మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA

నిప్పుల కొలిమే!

› 7



నిరుటి కన్నా 7.5 డిగ్రీలు అధికం
నల్లగొండ జిల్లా ఇబ్రహీంపేటలో 46.6 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత
నాలుగు రోజుల్లో 49 డిగ్రీలకు!

› 2



పింఛన్ పెంచుడుపై ఆశక్కకు ఆశలేదు

కాంగ్రెస్ మాట తప్పింది
ఎప్పటికైనా కేసీఆరే అర్సుకుంటడు
ఆదిలాబాద్ వృద్ధురాలి మాట

› 3

శుక్రవారం FRIDAY 3.5.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 329 ‖ వెల (Price) రూ.6.50 | దశమి

శుక్రవారం, సూర్యోదయం: 5-49, సూర్యాస్తమయం: 6-37. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం కృష్ణ పక్షం తిథి: దశమి రాత్రి 11-24 వరకు. నక్షత్రం: శతభిషం రాత్రి 12-06 వరకు. వర్జ్యం: ఉదయం 8-31 నుంచి ఉదయం 10-01 వరకు. రాహుకాలం: ఉదయం 10-37 నుంచి పగలు 12-13 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-23 నుంచి ఉదయం 9-14 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-38 నుంచి పగలు 1-29 వరకు. అమృతకాలం: సాయంత్రం 5-24 నుంచి సాయంత్రం 6-54 వరకు. గురు మౌఢ్యం ప్రారంభం.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline

• రోడ్‌షో.. జోష్



సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఎన్నికల ప్రచారయాత్ర నిర్వహించారు. జూబ్లీహిల్స్, మూసాపేటలో అభ్యర్థులు పద్మారావుగౌడ్, రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి రోడ్‌షోల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ రోడ్‌షోలకు జనం నుంచి భారీ స్పందన లభించింది. జూన్ 2 తర్వాత హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చేందుకు బీజేపీ కుట్ర పన్నుతున్నదని కేటీఆర్ ఆరోపించారు.

• మిషన్.. మడుగు నీళ్లు!



కేసీఆర్ హయాంలో నల్లా నీళ్లు తాగింది మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఏజెన్సీ గ్రామం సరసన్నపల్లి. ఇప్పుడా ఊరు తాగునీటికి తండ్లాడుతున్నది. కిలోమీటర్ల దూరంలో ఉన్న మడుగులోని బురద నీటితో గ్రామస్థులు గొంతు తడుపుకొంటున్నారు.

ఉప్పల్ స్టేడియంలో కరెంట్ కోత!

కార్పొరేట్ బాక్సుల్లో గంటకు పైగా అంతరాయం › 3

రేవంత్‌రెడ్డే ఫేక్!

ఆధారాలివిగో.. తప్పయితే నన్ను జైల్లో వేయండి

నిజమేనని తేలితే మీరు చంచల్‌గూడకు వెళ్తరా?

ఓయూ హాస్టళ్ల డాక్యుమెంట్‌పై కేటీఆర్ సవాల్

జైల్లో ఉండాల్సింది ముఖ్యమంత్రే!

తప్పుడు డాక్యుమెంట్ పెట్టిన సీఎం

ఆయనను వదిలి.. క్రిశాంక్ అరెస్ట్

ఫేక్ అని నిరూపించినందుకే పగ

సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఫేక్ డాక్యుమెంట్‌లో ఓయూ చీఫ్ వార్డెన్ స్టాంప్‌ను కూడా మార్చేశారు. తప్పు చేసింది రేవంత్ అయితే, బీఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్‌ను అరెస్ట్ చేసి, 14 రోజుల రిమాండ్‌కు పంపించారు. అసలు జైల్లో ఉండాల్సింది ఎవరు?.. ఫేక్ డాక్యుమెంట్ పెట్టిన రేవంతా? అది ఫేక్ అని చెప్పిన క్రిశాంకా? -కేటీఆర్

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్స్‌కు సెలవులు ప్రకటించిన వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా ఫేక్ డాక్యుమెంట్ పోస్ట్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ డాక్యుమెంట్ సృష్టించడం నేరమని, ఈ వ్యవహారంలో రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని, ఎన్నికల సంఘం కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలు చూపిస్తానని, ఒకవేళ ఆ సాక్ష్యాలు తప్పని నిరూపిస్తే తాను చంచల్‌గూడ జైలుకు వెళ్లడానికి సిద్ధమని ప్రకటించారు. తాను చెప్పింది నిజమని రుజువైతే, రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లాలని సవాల్ చేశారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కరెంట్ కోత, నీటి సమస్యను కారణంగా చూపుతూ ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్స్‌కు సెలవులు ప్రకటించడం, దానిపై బీఆర్ఎస్ › 2వ పేజీలో



బీజేపీ కనుసన్నల్లో ఈసీ

మోదీ, రేవంత్ ప్రసంగాలపై చర్యలేవి?
ప్రధానిపై చర్యకు ఈసీకి ధైర్యం లేదు
ముఖ్యమంత్రి మాటలు నీతి సూక్తులా?
మేం 27 ఫిర్యాదులు చేసినా స్పందించలే
కేసీఆర్‌పై మాత్రం ఆగమేఘాలపై చర్యలు
కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే.. వేర్వేరు కాదు
కేసీఆర్ బస్సుయాత్రతో ఆ పార్టీలకు దడ
ఓటుతోనే వాళ్లకు బుద్ధి చెప్పాలి › 2
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఆర్ఆర్ఆర్ ట్యాక్స్!

రాహుల్..రేవంత్.. రియల్ ఎస్టేట్ ట్యాక్స్
బిల్డర్ల నుంచి ఎస్ఎఫ్‌టీకి రూ.100 డిమాండ్
చివరకు రూ.68కి కాంగ్రెస్ నేతల ఒప్పుకోలు
మొత్తం 120 ప్రాజెక్టులతో సెటిల్‌మెంట్
ఆ తర్వాతనే అనుమతులిచ్చిన ప్రభుత్వం › 5
బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు

ఈసీ అనుమతించినా పరిహారానికి నో!

పంట పరిహారం అందించని రాష్ట్ర ప్రభుత్వం

- పంపిణీకి 10 రోజుల క్రితమే అనుమతి
- అయినా స్పందించని కాంగ్రెస్ సర్కార్
- రైతులకు ఇవ్వాల్సింది రూ.15 కోట్లే
- అవి కూడా లేవా? అంటూ విమర్శలు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్టుగా తయారైంది పంట నష్టపోయిన రైతుల పరిస్థితి. పరిహారం పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతిచ్చినా ప్రభుత్వం మాత్రం ససేమిరా అంటున్నది. ఈసీ నుంచి అనుమతి వచ్చి పది రోజులు గడిచినా ప్రభుత్వం మాత్రం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అకాల వర్షాలు, వడగండ్ల వానల కారణంగా మార్చిలో 10 జిల్లాల్లో 15,812 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు వ్యవసాయశాఖ నిర్ధారించింది. నష్టపోయిన › 8వ పేజీలో

పోలీసుల అదుపులో కాంగ్రెస్ 'సోషల్' టీమ్!

వీడియో మార్ఫింగ్ ఆరోపణలపై సైబర్‌క్రైమ్ ఆఫీసులో ఆరుగురు
అరెస్టా? కాదా? అనే విషయంపై స్పష్టత ఇవ్వని రాష్ట్ర పోలీసులు
రోజంతా కొనసాగిన సస్పెన్స్
ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేయకుండా ఉండేందుకేనంటూ ప్రచారం!

› 3

26, 27 తేదీల్లో టెట్‌కు విరామం?

ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో వాయిదా వేయాలని ఈసీ సూచన

› 9

నేడు దోస్త్ నోటిఫికేషన్

డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఏర్పాట్లు

› 9

నేటినుంచి మళ్లీ జనంలోకి కేసీఆర్

రామగుండం నుంచి బస్సుయాత్ర పునఃప్రారంభం • సిద్దిపేట సభతో ఎన్నికల ప్రచారానికి ముగింపు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు బస్సుయాత్ర శుక్రవారం నుంచి తిరిగి కొనసాగనున్నది. కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేయకుండా ఎన్నికల సంఘం 48 గంటల విధించిన నిషేధం శుక్రవారం రాత్రి 8 గంటలకు ముగియనున్నది. ఈ తర్వాత కేసీఆర్ తిరిగి జనంలోకి వెళ్లనున్నారు. రామగుండం నుంచి బస్సుయాత్ర పునఃప్రారంభం కానున్నది. గతనెల 24న మిర్యాలగూడలో ప్రారంభమైన కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్‌షో అప్రతిహతంగా కొనసాగుతున్నది. కేసీఆర్ తమ పార్టీపై చేసిన వ్యాఖ్యలు నియామవళికి విరుద్ధమని కాంగ్రెస్ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈసీ 48 గంటలపాటు ఆయనపై నిషేధం విధించడంతో గురువారం జమ్మికుంటలో కేసీఆర్ నిర్వహించాల్సిన రోడ్‌షో రద్దు అయిన విషయం తెలిసిందే. ఈసీ విధించిన గడువు శుక్రవారం రాత్రి 8 గంటలతో ముగిసిన తర్వాత కేసీఆర్ రామగుండంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్‌ను బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసింది. రామగుండంలో మొదలై సిద్దిపేట బహిరంగ సభతో బస్సుయాత్ర ముగియనున్నది. ముందస్తు షెడ్యూల్‌లో ఒక్క జమ్మికుంట మినహా కేసీఆర్ ప్రచార పర్యటన అంతా యథాతథంగా సాగుతున్నది.

ఫలితాలతోనే కుట్రలకు చెక్

కేసీఆర్ బస్సు యాత్రతో సమీకరణాలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతున్నాయని, కేసీఆర్ ఎక్కడుంటే అక్కడ జనసంద్రం పోటెత్తుతున్నదని గ్రహించిన కాంగ్రెస్, బీజేపీ ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కమిషన్ నియమాలను సాకుగా చూపి నిలువరించే ప్రయత్నం చేశాయని బీఆర్ఎస్ భగ్గుమన్నది. తమ నిజ స్వరూపాన్ని కేసీఆర్ బయటపెడుతున్నారనే అక్కసుతోనే ఆ పార్టీలు మిలాఖత్ అయి కేసీఆర్‌ను నిలువరించాలన్న కుట్రలు ప్రజల ముందు నిలపడవని చెప్తున్నది. కేసీఆర్ కార్యాచరణను కేవలం 48 గంటలపాటు నిలిపివేసినంత మాత్రాన ప్రజానిరసన నుంచి వారు తప్పించుకోలేవని అంటున్నది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవిస్తామని,ఈసీ ఆదేశాల మేరకు కేసీఆర్ 48 గంటలు ప్రచారాన్ని నిలిపివేశారని పేర్కొన్నది. ఆ రెండూ ఒక్కటై బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని ఎన్ని కుట్రలు చేసినా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే ఆ పార్టీలకు తగిన బుద్ధిచెప్తాయని పార్టీ శ్రేణులు స్పష్టం చేశాయి.



కేసీఆర్ బస్సు యాత్ర, రోడ్‌షో షెడ్యూల్

తేదీ	రోడ్‌షో పట్టణం
మే 3	రామగుండం
మే 4	మంచిర్యాల
మే 5	జగిత్యాల
మే 6	నిజామాబాద్
మే 7	కామారెడ్డి, మెదక్
మే 8	నర్సాపూర్, పటాన్‌చెరు
మే 9	కరీంనగర్
మే 10	సిరిసిల్ల రోడ్‌షో, సిద్దిపేట బహిరంగ సభ

లోకం పోకడ



పెరిగిన ఎండలతో జనానికి రెడ్ అలర్ట్.. అలాగే బీఆర్ఎస్‌కు పెరిగిన ప్రజాదరణతో కాంగ్రెస్, బీజేపీలకు పింక్ అలర్ట్!



బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారంలో రాముడి ఫొటోను ప్రదర్శిస్తూ ఓట్లు అడుగుతున్న దృశ్యాన్ని ప్రదర్శిస్తున్న కేటీఆర్



ఓయూలో నీళ్లు, కరెంట్ కోతల కారణంగా సెలవు ప్రకటించడాన్ని నిరసిస్తూ ధర్నా చేస్తున్న విద్యార్థుల సమస్యపై కేసీఆర్ ట్వీట్‌ను ప్రదర్శిస్తున్న కేటీఆర్

బీజేపీ కనుసన్నల్లో ఈసీ

- మోదీ, రేవంత్ ప్రసంగాలపై చర్యలేవీ?
- మోదీపై చర్యలు తీసుకునే ధైర్యం లేదా?
- రేవంత్ మాటలు నీతిసూక్తుల్లా ఉన్నాయా?
- కేసీఆర్‌పై ఆగమేఘాలపై చర్యలా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో పొన్నాల లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): భారత ఎన్నికల సంఘం బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు మత వైషమ్యాలు రెచ్చగొట్టేవిధంగా మాట్లాడినా, సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని దుయ్యబట్టారు. మోదీపై చర్యలు తీసుకునే దమ్ము, ధైర్యం ఎన్నికల సంఘానికి లేదని, కనీసం నోటీసులు ఇవ్వడానికి కూడా జంకుతున్నదని విమర్శించారు. రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్, బీజేపీ నాయకులపై తాము ఇప్పటివరకు 27 ఫిర్యాదులు చేశామని, ఒక్కదాని మీద కూడా చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. కేసీఆర్ రోడ్‌షోలకు వస్తున్న ప్రజాదరణను చూసి కాంగ్రెస్, బీజేపీలకు దడ పుట్టిందని ఎద్దేవా చేశారు. ప్రజా స్పందనను చూసి ఓర్వలేక కేసీఆర్ ప్రచారంపై 48 గంటల నిషేధం విధించారని మండిపడ్డారు. గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం తీరును తూర్పారబట్టారు. మోదీ, అమిత్‌షా మత వైషమ్యాలు రెచ్చగొట్టేవిధంగా మాట్లాడినా, దారుణమైన వ్యాఖ్యలు చేసినా, ప్రత్యర్థి పార్టీలను బండబూతులు తిడుతున్నా, బీజేపీ ట్విట్టర్ ఖాతాలో ముస్లింలపై డైరెక్ట్‌గా విషం చిమ్ముతూ పోస్టులు చేస్తున్నా వారిపై చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలే ఎక్కువమంది పిల్లలను కంటారని, ఇతర పార్టీలు అధికారంలోకి వస్తే ముస్లింలకు ఆస్తులను పంచేస్తారంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా దాదాపు 20 వేల ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై కనీసం మోదీకి ఈసీ నోటీసులు కూడా ఇవ్వలేదని చెప్పారు. బీజేపీ అధికారిక ట్విట్టర్ ఖాతాలో రాముడి ఫొటో పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారంటూ ఆధారాలను చూపించారు. బీజేపీ అభ్యర్థి అరుణ్‌గోగుల్ రాముడి ఫొటోతో ఎన్నికల ప్రచారం చేస్తున్నా, మోదీ విద్వేష వ్యాఖ్యలు చేసినా, అమిత్‌షా దేవుని ఫొటోలు పెట్టుకొని ఓట్లు అడిగినా ఎన్నికల కమిషన్‌లో ఉలుకు-పలుకు ఉండదని విమర్శించారు. కానీ, కేసీఆర్ విషయంలో మాత్రం ఆగమేఘాల మీద నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. సిరిసిల్లలో ఎండిన పంటలు, రైతుల ఆర్తనాదాలు విన్న తరువాత, సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలను చూసి నిరోధ్‌లు, పాపడాలు అమ్ముకోవాలని ఒక దుర్మార్గుడు అంటే, దానిని ఖండిస్తూ కేసీఆర్ కొంచెం కఠిన పదాలు వాడారని వివరించారు.

కేసీఆర్ గొంతు నొక్కి..

4 కోట్ల ప్రజల తరుపున మాట్లాడుతున్న కేసీఆర్ గొంతు నొక్కి, 48 గంటలపాటు ఎన్నికల ప్రచారం చేయకుండా నిషేధంవిధించిన ఈసీకి రేవంత్‌రెడ్డి మాటలు నీతిసూక్తులు, ప్రవచనాలు, సుభాషితాల్లాగా కనిపిస్తున్నాయా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ తలనరకండని అంటూ రేవంత్ మాట్లాడారని ఆక్షేపించారు. బీఆర్ఎస్ ఫిర్యాదులపై ఈసీ చర్యలు తీసుకోలేదని, మంత్రి సురేఖను మందలించి సరిపెట్టిందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలకు ఓటు ద్వారానే జవాబు చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

స్వతంత్ర సంఘమేనా..?

ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థ అయితే మోదీ, రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు భయపడుతున్నదని కేటీఆర్ నిలదీశారు. కేసీఆర్ గొంతును 48 గంటలు నిషేధించవచ్చుని, కానీ కేసీఆర్ తయారుచేసిన కార్యకర్తలను గ్రామ గ్రామాన అడ్డుకోలేరని స్పష్టంచేశారు. కాంగ్రెస్, బీజేపీలు వేరువేరు కాదని, ఆ రెండూ ఒక్కటిగానే భావిస్తున్నామని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి పొన్నాల, మాజీ ఎంపీ రావుల, మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలనంటూనే.. పోలీస్ పాలన!

బీఆర్ఎస్ లక్ష్యంగా ఫిర్యాదులు, అరెస్టులు | సోషల్ మీడియాలోనూ గొంతునొక్కే యత్నం | కేటీఆర్, బాల్క, మల్లారెడ్డి, జీవన్‌రెడ్డిపై కేసులు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ప్రజాపాలన పేరుతో.. పోలీసు పాలన కొనసాగుతున్నదా? కాంగ్రెస్ పాలనలో సోషల్ మీడియాలోనూ ప్రశ్నించే గొంతులను పిసికేస్తున్నారా? ఎటుచూసినా అక్రమ కేసులు, భౌతిక దాడులతో గూండాగిరి రాజ్యమేలుతున్నదా? అంటే అవుననే అంటున్నారు తెలంగాణవాదులు. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లు కక్షలు, కేసులు, పగలు, కుట్రలు లేకుండా పాలన సాగితే.. కేవలం నాలుగు నెలల్లోనే ప్రజాపాలనలో అక్రమ కేసులు, భౌతిక దాడులు, హత్యాయత్నాలు, నిర్బంధపు అరెస్టులు నిత్యకృత్యంగా మారాయి. నేటి కాంగ్రెస్ పాలనలో ఒక ప్రశ్నకు ఎదురుదాడే జవాబుగా మారింది. ఒకమాటకు భౌతికదాడి సమాధానవుతున్నది. ఒక పోస్టుకు పోలీసు నోటీసులే నిదర్శనంగా మారాయి. ఆఖరికి సోషల్ మీడియాలో కూడా స్వేచ్ఛగా మాట్లాడనివ్వకుండా ఎక్కడికక్కడే గొంతునొక్కే ప్రయత్నం ఓ యజ్ఞంలా సాగుతున్నదని తెలంగాణవాదులు వాపోతున్నారు.

క్రిశాంక్ మెడపై నోటీసుల కత్తిపెట్టి..

గ్రామాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తలు మొదలు, పార్టీ అధినేత వరకు ఏం మాట్లాడినా అక్రమంగా కేసులు పెట్టించడమే కాంగ్రెస్ నాయకులు పనిగా పెట్టుకున్నారని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. ఇటీవల కేసీఆర్ మాట్లాడిన మాటలను సైతం వక్రీకరించి ఫిర్యాదుచేసి ఎలక్షన్ కమిషన్‌తో 48 గంటలు ప్రచారాన్ని ఆపించగలిగారని, తాజాగా సీఎం చేసిన ఫేక్ పోస్టును ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను ఏకంగా అరెస్టు చేశారని అంటున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 4 నెలల్లోనే క్రిశాంక్‌పై ఆరు కేసులు నమోదు చేయడం అత్యంతహేయమని విద్యార్థి నేతలు వాపోతున్నారు. సీఎం ఫేక్ ప్రచారాన్ని, అక్రమ కేసులను వదిలిపెట్టేది లేదని, కోర్టుల్లో పోరాడుతానని క్రిశాంక్ తెలిపారు.

కార్యకర్తలు మొదలు.. జర్నలిస్టుల వరకూ!

ప్రశ్నకు జవాబు చెప్పలేక బీఆర్ఎస్ కార్యకర్తలను హత్యలు చేయించే స్థాయికి కాంగ్రెస్ దిగజారిందని పార్టీశ్రేణులు వాపోతున్నాయి. బోగుడతండాలో రోడ్డు నిర్మాణంపై ఘర్షణపడి బీఆర్ఎస్ కార్యకర్తనుహత్య చేశారని ఆరోపించాయి. నాగర్‌కర్నూల్ జిల్లా గంద్రావుపల్లిలో చిక్కేపల్లి మల్లేశ్ హత్య ఉదాంతం మర్చిపోలేమని అంటున్నాయి. ధర్మపురిలో బీఆర్ఎస్ కార్యకర్త మాధవ్‌పై హత్యాయత్నం చేశారని అంటున్నాయి.

కేటీఆర్ వంటి నేతలనూ వదలని వైనం..

గత మార్చిలో సీఎం రేవంత్‌రెడ్డిపై 'ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించిన వెంటనే ఆయనపై పలుచోట్ల 504, 505 సెక్షన్ల కింద జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించారు. ఇప్పుడు 'డబుల్ ఆర్' ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఏకంగా ప్రధాని మోదీ ఆరోపించినా ఎలాంటి చర్యలూ లేవని బీఆర్ఎస్ నేతలు ఫైరవుతున్నారు. నాడు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై చర్యలు చేపట్టాలని ఆర్టీసీ, విద్యుత్తుశాఖల నుంచి నోటీసులు ఇప్పించారని, మాజీ మంత్రి మల్లారెడ్డిపై ఏకంగా భూ కబ్జా కేసులు పెట్టించారని గుర్తుచేశారు. సీఎం వ్యాఖ్యలకు చెప్పుతో కౌంటర్ ఇచ్చిన బాల్క సుమన్‌పై అక్రమ కేసులు పెట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మరికొందరిపై కేసులు నమోదుకు డీజీపీకి లేఖలిచ్చారని గుర్తుచేస్తున్నారు.

నీటి కొరత తీవ్రంగా ఉంది

సాగర్‌టెయిల్‌పాండ్ నుంచి తీసుకున్నాం: ఏపీ

హైదరాబాద్, మే2 (నమస్తే తెలంగాణ): నీటి కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలోనే సాగర్‌టెయిల్ పాండ్ నుంచి నీళ్లు మళ్లించామని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ)కు ఏపీ సర్కారు వెల్లడించింది. టెయిల్‌పాండ్ నుంచి అనుమతుల్లేకుండా 3 టీఎంసీల నీళ్లను మళ్లించుకుపోవడంపై తెలంగాణ బోర్డుకు ఫిర్యాదు చేసింది. దీనిపై వివరణ కోరుతూ బోర్డు ఏపీకి లేఖ రాసింది. బోర్డు లేఖపై తాజాగా ఏపీ స్పందిస్తూ.. తీవ్ర నీటి కొరత కారణంగా 4 టీఎంసీలను కావాలని గత త్రీమెన్ కమిటీ సమావేశంలోనే విన్నవించామని బదులిచ్చింది. అందులో భాగంగానే సాగర్‌టెయిల్‌పాండ్ నుంచి నీటిని మళ్లించుకున్నట్టు బోర్డుకు వివరించినట్టు తెలిసింది.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	46.6°c	34.1°c
ఆదిలాబాద్	46.2°c	24.3°c
ఖమ్మం	46.0°c	26.0°c
మహబూబ్‌నగర్	45.4°c	35.8°c
నిజామాబాద్	44.0°c	27.9°c
రంగారెడ్డి	43.9°c	21.1°c
మెదక్	43.2°c	22.6°c
వరంగల్	43.0°c	28.0°c
హైదరాబాద్	42.3°c	29.2°c
కరీంనగర్	42.0°c	27.0°c

నాలుగు రోజుల్లో 49 డిగ్రీలకు!

- రాష్ట్రంలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు
- నల్లగొండ జిల్లా ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 46.6 డిగ్రీలు నమోదు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంపై భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఫలితంగా రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు.. మరో నాలుగు రోజుల్లో 49కి చేరవచ్చని వాతావరణశాఖ అంచనా వేసింది. వడగాడ్పులు వీస్తాయని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వైద్య, వాతావరణశాఖలు హెచ్చరిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పలు చోట్ల 46 డిగ్రీలపై ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. నిరుడు మే నెలతో పోల్చితే ఈ సారి 7.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం నుంచి శనివారం వరకు దీర్ఘకాల వడగాడ్పులు కొనసాగుతాయని భారతీయ వాతావరణశాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏ శ్రావణి తెలిపారు. రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 46.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేటలో 46.5, భద్రాద్రి-కొత్తగూడెంలో 46.5, ములుగులో 46.5, పెద్దపల్లిలో 46.4, జగిత్యాలలో 46.4, మహబూబాబాద్‌లో 46.3, కరీంనగర్‌లో 46.2, వరంగల్‌లో 46.2, మంచిర్యాలలో 46.2, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 45.3, జనగామలో 45.3, యాద్రాద్రి-భువనరిరిలో 45.6, నిర్మల్‌లో 45.5, జయశంకర్‌లో 45.5, మహబూబ్‌నగర్‌లో 45.4, హనుమకొండలో 45.1, సిద్దిపేటలో 45.1, నారాయణపేటలో 45.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలంగాణ స్టేట్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సొసైటీ వెల్లడించింది.

6 నుంచి మోస్తరు వానలు

రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి తేలికపాటి, మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ తెలిపింది. సోమవారం కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. గురువారం జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో తీవ్రమైన వడగాడ్పులు కొనసాగాయి. శుక్రవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడ వడగాడ్పులు వీస్తాయని చెప్పింది. మే నెలలో మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణశాఖ హెచ్చరించింది. 6 వరకు కర్ణాటక, ఏపీ, తెలంగాణ, పుదుచ్చేరిలో ఎండల తీవ్రత ఉంటుందని సూచించింది. 4 వరకు జార్ఖండ్‌లో, 3 వరకు కేరళ లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వివరించింది.

కేటీఆర్‌పై విమర్శలు.. ఈసీకి పట్టవేమి?

- ఫోన్ ట్యాపింగ్‌లో కేటీఆర్‌పై ఆరోపణలు
- ఈసీకి ఫిర్యాదు చేసినా స్పందన నిల్
- హైకోర్టులోనూ ముగిసిన వాదనలు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై జాతీయ, రాష్ట్ర నాయకులు ఇష్టమొచ్చినట్టు విమర్శలు చేస్తున్నా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడం లేదంటూ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం హైకోర్టు విచారించింది. సీజే జస్టిస్ అలోక్ అరా ధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం వ్యాజ్యాన్ని విచారించింది. ఈసీ తరపు న్యాయవాది దేశాయ్ అవినాశ్ వాదనలు వినిపిస్తూ.. బీఆర్ఎస్ ఫిర్యాదులను చట్టప్రకారం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వాస్తవాలను నిర్ధారించుకోకుండా జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను నియంత్రించేందుకు ఈసీ ఎలాంటి ఆదేశాలు జారీచేయలేదని కోర్టుకు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వెనక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉన్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, రాహుల్‌గాంధీ, కేకే మహేందర్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డితోపాటు బీజేపీ నేత, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా కేటీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడారని న్యాయవాది మయూర్‌రెడ్డి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ ఫిర్యాదు పరిశీలనలో ఉన్నదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఈసీ న్యాయవాది చెప్పడంతో విచారణను ముగిస్తున్నట్టు హైకోర్టు తెలిపింది.

హైదరాబాద్‌ను యూటీగా మార్చే కుట్ర

- బీజేపీ కుటిల యత్నాలను తిప్పికొట్టాలి
- పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని నాశనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- మల్కాజిగిరి రోడ్‌షోలో కేటీఆర్

జూబ్లీహిల్స్, మే 2: జూన్ 2 తరువాత హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భావిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సంచలన ఆరోపణలు చేశారు. పదేండ్లుగా అన్ని వర్గాల ప్రజలతో ఆనందంగా ఉన్న హైదరాబాద్‌ను కుక్కలు చింపిన విస్తరిలా చేయాలని చూస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ కుటిల యత్నాలను తిప్పి కొట్టేందుకు ప్రజలంతా ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. గురువారం ఆయన మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మూసాపేటలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజల మధ్య మతం చిచ్చుపెట్టి ఓట్లు దండుకునే పనిలో మోదీ, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను నయవంచన చేసేందుకు రేవంత్‌రెడ్డి మళ్లీ వస్తున్నారని దుయ్యబట్టారు. 'పేగులు మెడలో వేసుకుని తిరుగుతా', 'పండబెట్టి తొక్కుతా' అనే చిల్లర మాటలు తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల కోసం చేసిందేమిటని నిలదీశారు. నాడు కేసీఆర్ హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తే, నేడు రేవంత్ నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నారని విమర్శించారు. హైదరాబాద్‌కు కొత్త కంపెనీలు వచ్చుడు కాదు, బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన కంపెనీలు కూడా వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌తో పోటీయే లేదని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



గురువారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని శ్రీరామ్‌నగర్ రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తదితరులు

రేవంత్‌రెడ్డే ఫేక్!

మొదటిపేజీ తరువాయి...

అధినేత కేసీఆర్ ట్వీట్ చేయడం, ఆ మరుసటి రోజు సీఎం రేవంత్‌రెడ్డి కూడా మరో పోస్ట్ పెట్టడం, బీఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్‌ను అరెస్టు చేయడం తదితర పరిణామాలపై కేటీఆర్ వివరించారు. నీటికొరత, కరెంట్ సమస్య కారణంగా నెల రోజులపా టు ఓయూ హాస్టల్స్‌కు సెలవులు ఇస్తున్నట్టు చీఫ్ వార్డెన్ ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారని తెలిపారు. పోటీ పరీక్షల నేపథ్యంలో దీనిని వ్యతిరేకిస్తూ ఓయూ విద్యార్థులు ధర్నాకు దిగారని వివరించారు. ఈ నేపథ్యంలో కరెంటు కోత, తాగునీటి సమస్యపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ, ఓయూ ఉదంతాన్ని ఉదహరిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ట్వీట్ చేశారని గుర్తుచేశారు. ఆ వెంటనే చీఫ్ వార్డెన్‌కు యూనివర్సిటీ రిజిస్ట్రార్ షోకాజ్ నోటీసు ఇచ్చారని, ఎస్పీడీసీఎల్ నుంచి కూడా కరెంట్ సమస్య లేదంటూ 'వైస్ చైర్మన్' పేరుతో నోటీసు ఇచ్చారని పేర్కొన్నారు. 'వైస్ చాన్సలర్'కు బదులు 'వైస్ చైర్మన్' అని పేర్కొనడం చూస్తుంటే ఈ ప్రభుత్వం తెలివి తేటలు అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. మరోవైపు, కేసీఆర్ ట్వీట్ చేసిన మరుసటి రోజే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ట్విట్టర్‌లో ఒక నోటీస్ పెట్టారని, తెలిపారు.

సీఎం పోస్ట్ చేసిన నోటీసుపై విద్యార్థుల ఆగ్రహం

సీఎం రేవంత్‌రెడ్డి పెట్టిన నోటీస్ నకిలీదని వెల్లడిస్తూ, ఓయూ విద్యార్థులే అసలైన నోటీసును సోషల్ మీడియాలో వెలుగులోకి తెచ్చారని కేటీఆర్ వివరించారు. ముఖ్యమంత్రే ఫోర్జరీ డాక్యుమెంట్‌ను ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం ఏమిటని విద్యార్థులు ప్రశ్నించారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి అనే ఒక పనికిమాలిన నాయకుడు, సీఎం అయి ఉండి కూడా తన పర్సనల్ ట్విట్టర్ ఖాతా ద్వారా ఫేక్ నోటీసును ట్విట్టర్‌లో పోస్ట్ చేశారని, ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా చిల్లర ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఇలా ముఖ్యమంత్రి ఫేక్ డాక్యుమెంట్ చేయొచ్చా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పోస్ట్ చేసిన ఫేక్ డాక్యుమెంట్‌లో చీఫ్ వార్డెన్ స్టాంప్‌ను కూడా మార్చేశారని వివరించారు. ఫేక్ డాక్యుమెంట్ ద్వారా తప్పు చేసింది సీఎం రేవంత్‌రెడ్డి అయితే, బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్‌ను అరెస్ట్ చేసి, 14 రోజుల రిమాండ్‌కు పంపించారని మండిపడ్డారు. అసలు జైల్లో ఉండాల్సింది ఎవరు.. ఫేక్ డాక్యుమెంట్ పెట్టిన రేవంత్ రెడ్డా? అది ఫేక్ డాక్యుమెంట్ అని చెప్పిన క్రిశాంకా? అని ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం, ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించడం నేరమని, ఈ చర్యలకు పాల్పడిన రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తప్పు ఒప్పుకోవాలని హితవు చెప్పారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్న క్రిశాంక్ మీద ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసు నమోదుచేశారని, దీనిని ప్రజాస్వామికవాదులందరూ ఖండించాలని కోరారు. క్రిశాంక్‌ను వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ఫేక్ డాక్యుమెంట్ పోస్ట్ చేశారని, ఆయనపై ఫోర్జరీ కేసు పెట్టాలని ఓయూ విద్యార్థులు కూడా ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫేక్ సర్క్యులర్ పోస్ట్ చేసినందుకు రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలి

తెలంగాణ ఉద్యమంలో ఇలాంటి ఎన్నో కేసులు, వేధింపులు చూశామని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ స్పష్టంచేశారు. న్యాయ వ్యవస్థ మీద తమకు నమ్మకం ఉన్నదని చెప్పారు. సత్యమేవ జయతే అన్నట్టుగా సత్యం, న్యాయం ఏనాటికైనా గెలుస్తుందని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ మొహబ్బత్ కా దుకాణ్ అంటారని, కానీ, తమ కార్యకర్తల మీద ఈ ప్రభుత్వం దాడులకు తెగబడుతున్నదని విమర్శించారు. వీటన్నింటికి మే 13న బీఆర్ఎస్‌కు ఓటు వేయడం ద్వారా జవాబు చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఈసీ చర్యలు తీసుకుంటుందా? లేదా? అనేది కాలం నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి ఇవ్వని నోటీసుకు ఇచ్చినట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని, బీజేపీ, రేవంత్ షాడో ఫైటింగ్ చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

వడదెబ్బ మరణాలు లేవు

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ

హైదరాబాద్, మే 2 (నస్తే తెలంగాణ) : వడదెబ్బతో ఏడుగురు మృతి చెందినట్టు పత్రికలో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని, వారు వివిధ కారణాలతో చనిపోయినట్టు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ స్పష్టం చేసింది. వికారాబాద్ జిల్లాలో 1న మృతి చెందిన ఉపాధ్యాయురాలు రాణి (45), ఆదిలాబాద్ జిల్లాలో ఆత్రం జంగు (46), కరీంనగర్ జిల్లాలో ఆర్ నర్సయ్య (46) గుండెపోటుతో మృతిచెందారని, రంగారెడ్డి జిల్లా కందుకూరులో చనిపోయిన 65 ఏండ్ల గుర్తుతెలియని వ్యక్తి మద్యం అలవాటుతో తలెత్తిన ఆరోగ్య సమస్యలతో, కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ఇతర కారణాలతో మరో వ్యక్తి మృతి చెందినట్టు తెలిపింది. మృతిచెందిన వ్యక్తుల్లో ఎవరికీ వడదెబ్బ లక్షణాలు లేవని తెలిపింది.

నిజాం షుగర్స్‌పై కాంగ్రెస్, బీజేపీ మోసం

బోధన్ చెరుకు ఫ్యాక్టరీకోసం గళమెత్తుతా..

నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేయిస్తా

ధర్మపురి అర్వింద్‌ను పసుపు రైతులే ఓడిస్తరు

జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా పైసా లాభం చేయలే

'నమస్తే' ఇంటర్వ్యూలో బాజిరెడ్డి గోవర్ధన్

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ



నిజామాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే నిజాం షుగర్స్ ఫ్యాక్టరీకి ఈ గతి పట్టింది. రైతులంతా సహకార సంఘంగా ఏర్పడితే కేసీఆర్ హయాంలో పూర్తిస్థాయి మద్దతు ఇచ్చి ఫ్యాక్టరీని తెరిపించేందుకు ముందు కొచ్చాం.. కానీ నాడు ఇవే కాంగ్రెస్, బీజేపీలు రైతులను తప్పుదోవ పట్టించి అడ్డుకున్నయ్. మహారాష్ట్ర తరహా రైతులకు మేలు చేసేందుకు కేసీఆర్ ఆలోచన చేశారు.' అని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ వివరించారు. 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే షుగర్ ఫ్యాక్టరీ, పసుపు బోర్డు కల సాకారమవుతుందని చెప్పారు.

ఎన్నికల ప్రచారం ఎలా కొనసాగుతున్నది?

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి అద్భుత స్పందన వస్తున్నది. బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలతో వీలైనంత ఎక్కువ మందిని కలుస్తూ బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకతను వివరిస్తున్నాం. ప్రజలు కూడా బీఆర్ఎస్సే గెలవాలని కోరుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా కేసీఆర్ పరిపాలననే గుర్తుచేస్తున్నరు. కేసీఆర్ పాలనలో మానవీయత ఉండేది. అన్ని వర్గాలవారికి ఆ లోటు స్పష్టంగా తెలుస్తున్నది. బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో మా ఎమ్మెల్యేలే ఉన్నరు. ముఖ్య విషయం ఏమిటంటే అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం ఓట్లను పరిశీలిస్తే ఇతర పార్టీల కన్నా బీఆర్ఎస్‌కే ఎక్కువ వచ్చాయి.

ఎంపీ అర్వింద్ మళ్లీ పసుపుబోర్డు అంటున్నడు కదా?

ఇచ్చిన హామీని నెరవేర్చని దద్దమ్మ ధర్మపురి అర్వింద్. తాను గెలిస్తే ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు తెస్తానని చెప్పి రైతులను మోసం చేసిండు. స్వయంగా ప్రధాని మోదీతో ప్రకటన చేయించి ఇప్పటికీ అతీగతీ లేదు. అందుకే పసుపు రైతులు అర్వింద్‌పై కోపంతో ఉన్నరు. వారే బీజేపీని ఓడించబోతున్నరు. పసుపు బోర్డు ఎక్కడుందో చూపించే దమ్ముందా? ఇది మరో ఎన్నికల గిమ్మిక్కు మాత్రమే. కాంగ్రెస్ పార్టీ కూడా రైతులను నిలువునా దగా చేస్తున్నది. రైతుబంధును సక్రమంగా ఇవ్వలేదు. సాగునీటి కోసం రైతులను గోసపెట్టింది. వడ్లకు రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి చేతులెత్తేసింది. ఇది రైతుల్లో రేవంత్ సర్కారుపై అసంతృప్తిని పెంచింది. ఈ ఎన్నికల్లో రైతులు బీఆర్ఎస్ వెంటే ఉంటరు.

చెరుకు ఫ్యాక్టరీపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎలాంటి నాటకాలాడి ఓట్లు రాబట్టుకున్నదో అందరికీ తెలుసు. లోక్‌సభ ఎన్నికల్లోనూ అవే మాయ మాటలు చెప్తున్నది. బోధన్ షుగర్ ఫ్యాక్టరీపై అబద్ధపు హామీలిస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే కదా ఫ్యాక్టరీకి ఈ గతి పట్టింది. దాన్ని తెరిపించడంపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు. కేసీఆర్ హయాంలో రైతులంతా కలిసి సహకార సంఘంగా ఏర్పడితే పూర్తిస్థాయి మద్దతిచ్చి నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ముందుకొచ్చాం. కానీ అప్పుడు ఇవే బీజేపీ, కాంగ్రెస్‌లు రైతులను తప్పుదోవ పట్టించి అడ్డుకున్నయ్. నిజాం షుగర్ ఫ్యాక్టరీతో నాకు విడదీయలేని బంధం ఉంది. 1996లో రైతులు నన్ను ఎన్ఎస్ఎఫ్‌కు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఎంపీగా గెలిస్తే పార్లమెంట్‌లో గళమెత్తి చెరుకు రైతుల మేలు కోసం పాటుపడుతా. పసుపు బోర్డు అంశంపై కొట్లాడి నిజామాబాద్‌లోనే ఏర్పాటయ్యేలా కృషి చేస్తా.

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై మీకున్న పట్టు ఎలాంటిది?

నిజామాబాద్ లోక్‌సభ పరిధి నాకు కొట్టిన పిండి. ఈ ప్రాంత ప్రజలతో దశాబ్దంగా నాకు పరిచయాలున్నాయి. మరోవైపు జగిత్యాల జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాకు ఆత్మీయత, అనురాగాలు పంచే బంధుత్వాలున్నాయి. మా అమ్మమ్మ ఊరు జగిత్యాల జిల్లాలోనే ఉంది. నా బాల్యం అక్కడే గడిచింది. గతంలో బాన్సువాడ, ఆర్మూర్, మొన్నటి వరకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా సేవలందించా. బాన్సువాడ టెక్నికల్‌గా జహీరాబాద్ లోక్‌సభకు వెళ్లినా అందులోని కొన్ని గ్రామాలు నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోకి వస్తాయి. ఈ ప్రాంతంపై నాకు పట్టుంది. అంతకుమించి బీఆర్ఎస్ అనే బలమైన శక్తి నావెంట ఉంది. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, ఆశన్నగారి జీవన్‌రెడ్డితోపాటు బోధన్‌లో షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, జడ్పీ చైర్మన్ విఠల్ రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జగిత్యాల బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు నాకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. ఐక్యంగా ప్రచారంలో దూసుకుపోతున్నాం.

కాంగ్రెస్ పాలనపై ప్రజలేమంటున్నరు?

కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని జనం తిడుతున్నరు. ఆరుగ్యారెంటీలను తుంగలో తొక్కి మోసంచేస్తున్న రేవంత్‌రెడ్డి తీరును ఎండగడుతున్నరు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసా కింద ఎకరానికి రూ.15వేలు, మహిళలకు రూ.2500, పింఛన్లు రూ.4వేలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వకపోవడంపై ప్రజలు అసంతృప్తితో రగిలిపోతున్నరు. మళ్లీ కేసీఆర్ వస్తేనే బాగుంటుందని ప్రజలంతా ముక్తకంఠంతో కోరుకుంటున్నరు. రేవంత్‌రెడ్డి సీఎం సీట్లో కూర్చొని ఫక్తు రాజకీయాలు చేయడం, బూతులు మాట్లాడటం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదు. కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పచ్చి అవకాశవాది. పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచి నాలుగున్నరేండ్లలో ఈ ప్రాంతానికి ఒక్కసారి కూడా తన ముఖం చూపించలేదు. అలాంటోడు ఎంపీగా నిలబడ్డాడు. ఈ ప్రాంతానికి పైసా కూడా వెచ్చించని వ్యక్తికి నిజామాబాద్ వాసులు ఎందుకు ఓటెయ్యాలి?



సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

కుట్రతోనే కేసీఆర్ ప్రచారంపై నిషేధం

- మోదీ, రేవంత్ విద్వేష ప్రసంగాలు ఈసీ దృష్టికి రాలేదా?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విస్మయం

సూర్యాపేట, మే 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మాండలికాన్ని సరిగ్గా అర్థం చేసుకోని ఈసీ 48 గంటలపాటు ప్రచారం చేయకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై నిషేధం విధించడంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విస్మయం వ్యక్తంచేశారు. ఫేక్ వీడియోలు ప్రచారం చేస్తే రేవంత్‌కు నోటీసులతో సరిపెట్టి, కేసీఆర్‌కు మాత్రం ప్రచారంపై నిషేధం విధించడం సరికాదని అన్నారు. అదీగాక బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి క్రిశాంక్‌ను అరెస్టు చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. కేసీఆర్ చేపడుతున్న బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీ నేతల కాళ్ల కింద భూమి కంపిస్తుందని, అందుకే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇద్దరూ కలిసి కుట్ర చేసి ఈసీతో కేసీఆర్ ప్రచారాన్ని నిషేధించేలా చేశారని మండిపడ్డారు. గురువారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. మోదీ, రేవంత్ విద్వేష ప్రసంగాలు, ఫేక్ వీడియోలు ఈసీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు కార్మికుల పట్ల అవమానకరంగా మాట్లాడిన సందర్భంలో స్పందించిన కేసీఆర్ మాటలను వక్రీకరించారని పేర్కొన్నారు. కేసీఆర్ యాత్రలు చేపట్టడంతో ఛోటే భాయ్, బడే భాయ్ (రేవంత్, మోదీ)లకు వణుకుడు మొదలైందని ఎద్దేవా చేశారు. వీధి రౌడీల్లా మాట్లాడిన రేవంత్ స్వేచ్ఛగా తిరుగుతుంటే కేసీఆర్‌ను మాత్రం ఇంటికే పరిమితం చేయడం సరికాదని అన్నారు. రేవంత్ తెలంగాణ సంపదను ఢిల్లీకి పంపుతున్నాడని స్వయానా మోదీ అనడం ద్వారా ఆయనకు పక్కా సమాచారం ఉన్నట్టే కదా?, అలాంటిది రేవంత్ అవినీతిపై మోదీ విచారణ సంస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు చర్చకు రానీయకుండా పక్కదారి పట్టించడం కోసమే డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

రేవంత్ ఇచ్చిందీ గాడిద గుడ్డే!

- వంద రోజుల్లో 6 గ్యారెంటీలు అని మాట మార్చారు
- బీజేపీ ఏమీ ఇవ్వలేదని పదేండ్ల నుంచి మొత్తుకున్నం
- సీఎం రేవంత్ ఇప్పుడు ఇదే పాట పాడుతున్నారు
- రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలి
- సంగారెడ్డి జిల్లాలో రోడ్‌షోల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డి జిల్లా గుమ్మిడిదల రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డి, మే 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చిందని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తన నాలుగు నెలల పాలనలోనూ తెలంగాణ ప్రజలకు గాడిద గుడ్డే ఇచ్చారని మాజీమంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లాలోని దౌల్తాబాద్, గుమ్మడిదల, బొల్లారంలో నిర్వహించిన రోడ్‌షోల్లో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు గాడిద గుడ్డే ఇచ్చిందని రేవంత్‌రెడ్డి చెప్తున్నారని, ఇదే విషయాన్ని బీఆర్ఎస్ పదేండ్లుగా చెప్తూనే ఉన్నదని తెలిపారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి రేవంత్ మాట మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, తులం బంగారం అని ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయని, వారికి శిక్ష పడాల్సిందేనని అన్నారు. బోనస్ ధర చెల్లించి రైతుల నుంచి కాంగ్రెస్ సర్కార్ పంటలను ఎందుకు కొనుగోలు చేయటం లేదని నిలదీశారు. రైతులు, ప్రజలను మోసంచేస్తున్న కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని, రాష్ట్ర భవిష్యత్తు కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. మతం పేరుతో బీజేపీ గెలవాలని ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి దుబ్బాక ఉపఎన్నికల్లో అడ్డగోలుగా హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, దుబ్బాకలో చెల్లని రూపాయి ఈ ఎన్నికల్లో చెల్లుతుందా? అని ప్రశ్నించారు. బీజేపీ అభ్యర్థి బ్లాక్ మెయిల్ రాజకీయాలు మనకు అవసరమా? అని ప్రజలను అడిగారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఉన్నత విద్యావంతుడు, మాజీ కలెక్టర్ అయిన వెంకట్రామిరెడ్డి తన కుటుంబ ఆస్తి నుంచి రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ప్రజలకు మంచి చేయాలన్న తపన ఉన్న వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. రోడ్‌షోలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు 'కమ్మలు' ఓటెందుకు వేయాలి?

- ఒక్క కారణమైనా చెప్పు రేవంత్
- ఖమ్మం, చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాల్లో పోటీకి ఒక్క కమ్మ అభ్యర్థీ దొరకలేదా?
- కమ్మకుల సమాజం పేరిట లేఖ
- సామాజిక మాధ్యమాల్లో వైరల్

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని కమ్మ కులస్థులు కాంగ్రెస్ పార్టీకి ఓటు ఎందుకు వేయాలో చెప్పాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కమ్మకుల సమాజం పేరిట సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖ ఒకటి సోషల్ మీడియా వైరల్ అవుతున్నది. కాంగ్రెస్‌కు ఓటెందుకు వేయాలో ఒక్క కారణమైనా చెప్పే దమ్ము రేవంత్‌కు ఉందా? అని అందులో ప్రశ్నించారు. కమ్మకులస్థులు అధికంగా ఉండే ఖమ్మం, చేవెళ్ల, మల్కాజిగిరిలో టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్‌కు ఒక్క అభ్యర్థి కూడా దొరకలేదా? అని నిలదీశారు. 'తెలంగాణలో ఆర్థికంగా, సామాజికంగా కమ్మలు అత్యంత ప్రభావిత వర్గమని మీరు భావించట్లేదా? మీ రాజకీయ ఉన్నతికి పునాది వేసింది కమ్మ కులస్థులు కాదా?' అని సూటిగా ప్రశ్నించారు. నాడు నారా చంద్రబాబునాయుడు చలువతో రేవంత్‌రెడ్డి కమ్మలను వాడుకొని ఈ స్థితికి వచ్చారని గుర్తుచేశారు. 'ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ, కమ్మ మీడియా సంస్థల దన్నుతో మీరు ఒక బలమైన నాయకుడిగా ఎదిగింది వాస్తవం కాదా? నువ్వు పీసీసీ అధ్యక్షుడైతే అక్కున చేర్చుకుంది మా నాయకురాలు రేణుకాచౌదరి కాదా? అని లేఖలో ప్రశ్నించారు.

ఒక్క కమ్మ అభ్యర్థీ దొరకలేదా?

'తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో 37 అసెంబ్లీ నియోజకవర్గాలను కమ్మ కులం ప్రభావితం చేస్తుందనే విషయం మీకు తెలియదా? లేదా, తెలిసి నటిస్తున్నారా? గత అసెంబ్లీ ఎన్నికల్లో కమ్మ కులస్థులు గంపగుత్తగా కాంగ్రెస్‌కే ఓటువేసిన విషయం మర్చిపోయారా? ఆ దన్నుతోనే మీరు సీఎం అయిన వాస్తవాన్ని అటకెక్కించారా?' అని ప్రశ్నించారు. 'ఎన్నికలు కాగానే నీ కులానికి మూడు మంత్రి పదవులు, 14 కార్పొరేషన్లు, 17 మంది అధికారులకు అత్యంత కీలక పోస్టులు ఇచ్చుకున్నావు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్మలకు అత్యంత బలమైనదనే విషయం మీకు తెలియదా? ఎంపీ ఎన్నికల్లో నీ రెడ్డి కులానికి 17 సీట్లలో ఏడు సీట్లను కేటాయించి నీ కుల పక్షపాతాన్ని నిరూపించుకున్నది వాస్తవం కాదా? రాష్ట్రంలో ఎంపీగా నిలబడేందుకు కమ్మ అభ్యర్థి లేరా? కమ్మలు ఎంపీ సీటుకు అర్హులు కారా?' అని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు ఈసారి గోరీ కడతం

'ఖమ్మం, చేవెళ్ల, మల్కాజిగిరి లాంటి ఒక్క స్థానంలో కూడా పోటీకి కమ్మం కులం నుంచి అభ్యర్థులు దొరకలేదా? లేదా నీ కుల పెత్తనాన్ని మా మీద రుద్దాలని నిర్ణయం తీసుకున్నావా? నీ కులానికి చెందిన నీ శత్రువు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడే కాకుండా నటుడు దగ్గుబాటి వెంకటేశ్ వియ్యంకుడు అయిన రఘురాంరెడ్డికి ఖమ్మం ఎంపీ సీటు ఇవ్వడానికి ఇష్టపడ్డావు కానీ, నీకు రాజకీయంగా, వ్యక్తిగతంగా ఔన్నత్యాన్ని ఇచ్చిన కమ్మ కులాన్ని పక్కన పెట్టడాన్ని మా కులం జీర్ణించుకోలేకపోతున్నది. రాష్ట్రంలో బలమైన ఓటు బ్యాంకు, ఆర్థిక పునాదులు కలిగిన మా కమ్మ కులం రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలో ఒక్కసారి పబ్లిక్ గా చెప్పే దమ్ము నీకు ఉందా? వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు గోరీ కట్టడమే మా ఆశయం అని తెలుసుకో రేవంత్‌రెడ్డి. జై కమ్మ.. జై ఎన్టీఆర్' అంటూ లేఖను ముగించారు.



పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేటలో బుర్ర శంకర్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

కాంగ్రెస్ గూండాలను కాలమే శిక్షిస్తుంది

- వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
- బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- బీఆర్ఎస్ నాయకుడు శంకర్‌కు పరామర్శ

రామగిరి, మే 2: 'కాంగ్రెస్ గూండాలను కాలమే శిక్షిస్తుంది. అధికారం వచ్చిన ఐదు నెలల్లోనే ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ, బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. వాస్తవాలను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు. వాళ్లే తగిన బుద్ధి చెబుతారు' అని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రెండ్రోజుల క్రితం కాంగ్రెస్ నేతల దాడిలో గాయపడ్డ పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట తాజా మాజీ సర్పంచ్ భర్త బుర్ర శంకర్‌గౌడ్‌ను గురువారం ఆయన జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి పరామర్శించారు. దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎంతటి దాడులకు తెగించినా బీఆర్ఎస్ కార్యకర్తలు సంయమనం పాటించాలని, బీఆర్ఎస్‌ది దాడుల సంస్కృతి కాదని సూచించారు. వారికి కచ్చితంగా కాలమే సమాధానం చెబుతుందని అన్నారు.

కాంగ్రెస్ 'సోషల్' సభ్యుల అరెస్టు

- రోజంతా కొనసాగిన సస్పెన్స్
- ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేయకుండా ఉండేందుకే గోప్యత అనే ప్రచారం!

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా విభాగానికి చెందిన ఆరుగురు ప్రతినిధులను సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అయితే, ఈ అరెస్టుపై సైబర్ క్రైమ్ పోలీసులు స్పష్టత ఇవ్వడం లేదు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రిజర్వేషన్లపై మాట్లాడిన వీడియోను మార్ఫింగ్ చేశారని బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ప్రేమేందర్‌రెడ్డి గతనెల 27న ఇచ్చిన ఫిర్యాదుపై సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే విషయంపై ఢిల్లీలో బీజేపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై ఢిల్లీ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులకు, సోషల్‌మీడియా ప్రతినిధులకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇదే కేసులో ఢిల్లీ పోలీసులు నిందితులను అరెస్టు చేసేందుకు వస్తున్నారనే సమాచారంతో హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయమే కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న మన్నె సతీశ్, నవీన్, తస్లీమా, గీత, శివ, ఆస్మాలను అదుపులోకి తీసుకున్నారు. వారిని ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు విచారించి పలు వివరాలు సేకరించారు. అయితే రాత్రి వరకు కూడా ఉన్నతాధికారులు ఎవరూ ఫోన్ లిఫ్ట్ చేయలేదు, అరెస్టు చేశారా? ఇంకా విచారిస్తున్నారా? నోటీసులు ఇచ్చారా? అనే విషయంపై స్పష్టత కోసం ప్రయత్నించినా అధికారుల నుంచి స్పందన లేదు. అదుపులో తీసుకున్న మాట వాస్తవమని అంతకుముందే అధికారులు నిర్ధారించారు.

ఎందుకీ గోప్యత అంటే?

కేంద్ర హోంమంత్రి వీడియోను మార్ఫింగ్ చేసిన కేసులో దర్యాప్తును ఢిల్లీ సైబర్‌క్రైమ్ పోలీసులు వేగంగా చేశారు. నోటీసులు జారీ చేయడమే కాకుండా సోషల్‌మీడియాలో కీలకంగా వ్యవహరించి మార్ఫింగ్ చేసిన వారిని గుర్తించి అరెస్టు చేసేందుకు సిద్ధమయ్యారు. దీనిని గుర్తించిన తెలంగాణ పోలీసులు... ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయకుండా ఉండేలా ముందుగానే తమ అదుపులోకి తీసుకున్నట్టు చర్చ జరుగుతున్నది.



ఆదిలాబాద్ జిల్లా ధనోరలో రూ.4 వేల పింఛన్ వస్తలేదని చెబుతున్న వృద్ధురాలు ఆశక్క

నాలుగువేల పింఛన్‌పై ఆశక్కకు ఆశలేదు!

- కేసీఆర్ 2 వేలిచ్చినా తృప్తిగా ఉన్నం
- ఐదు నెలలైనా 4 వేల పింఛన్ ఏది?
- సర్కార్‌పై వృద్ధురాలి మండిపాటు

ఆదిలాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని ఓ వృద్ధురాలు మండిపడింది. నాలుగు వేల పింఛన్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా మాట నిలబెట్టుకోలేదని మండిపడింది. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు గురువారం ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం ధనోరలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్నం ఆశక్క అనే వృద్ధురాలి వద్దకు వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరగా.. తప్పకుండా కారు గుర్తుకే వేస్తానని చెప్పింది. రేవంత్ సర్కార్‌ను తూర్పారబట్టింది. పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామన్న కాంగ్రెస్ మాట తప్పిందని మండిపడింది. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 వేల పింఛనే వస్తుందని తెలిపింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ పెంచుతుందనే నమ్మకం లేదని వాపోయింది. కేసీఆర్ అమలు చేసిన రూ.2 వేల పింఛన్‌తోనే తృప్తిగా బతుకున్నట్టు తెలిపింది.

ఉప్పల్ స్టేడియంలో మళ్లీ కరెంట్ కట్

- కార్పొరేట్ బాక్సుల్లో గంటకు పైగా అంతరాయం
- నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రేక్షకులు
- ప్రపంచవ్యాప్తంగా పరువు తీస్తున్నారంటూ ఆవేదన

ఉప్పల్, మే 2 (నమస్తే తెలంగాణ): కరెంట్ కోతలు ఉప్పల్ స్టేడియాన్ని వీడటం లేదు. గతంలో హెచ్‌సీఏ కరెంట్ బిల్లు చెల్లించలేదని విద్యుత్తు సరఫరాను తొలగించామని స్వయంగా విద్యుత్తు అధికారులు చెప్పగా, తాజాగా మరోసారి ఉప్పల్ స్టేడియంలో కరెంట్ సమస్య తలెత్తింది. గురువారం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి కరెంట్ సరఫరా లేక అభిమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్పొరేట్ బాక్సుల్లో గంటకు పైగా కరెంట్ సరఫరా నిలిచి చీకట్లు అలుముకున్నాయి. ఈ సమయంలో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టి కరెంట్‌పైకి మళ్లింది. ప్రపంచ దిగ్గజ క్రికెటర్ల ముందు విద్యుత్తు సమస్య తలెత్తడం సిగ్గుచేటని పలువురు చర్చించుకుంటున్నారు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి టికెట్లు కొన్నామని, మ్యాచ్ వీక్షిద్దామని వస్తే కరెంట్ లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నామని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలే ఉష్ణోగ్రతలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ తరుణంలో కరెంట్ పోవడం తమను మరింత బాధకు గురిచేసిందని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కరెంట్ ఎందుకు కట్ చేశారంటూ స్టేడియం యాజమాన్యంతో ఘర్షణకు దిగినట్టు తెలిసింది. గతంలో ఉప్పల్ స్టేడియం వేదికగా హైదరాబాద్, చైన్నై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కూడా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కొన్నినెలల నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో ఉప్పల్ స్టేడియానికి విద్యుత్తు సరఫరాను నిలిపివేసినట్టు ఆనాడు అధికారులు తెలిపారు. రూ.1.57 కోట్లు విద్యుత్తు బిల్లులు హెచ్‌సీఏ చెల్లించలేదని విద్యుత్ అధికారులు ఆరోపించిన విషయం తెలిసిందే.

సిద్దిపేటలోనే రుణమాఫీ సభ

- హరీశ్.. రాసి పెట్టుకో: రేవంత్
- ఈసారి ఒట్టు కొమరవెల్లి మల్లన్నపై

సిద్దిపేట/కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కొమురవెల్లి మల్లన్న సాక్షిగా ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ పంద్రాగస్టు లోపల సిద్దిపేటలో లక్షమందితో సభ పెట్టి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని, హరీశ్‌రావు రాసిపెట్టుకోవాలని సూచించారు. ఆసిఫాబాద్ రోడ్‌షోలో రేవంత్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. కులాలు, మతాల పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తున్నదని, భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కల్పించిన రిజర్వేషన్‌లను తొలగించేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఢిల్లీ సుల్తానులా తయారైన మోదీ, అమిత్ షాకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. రిజర్వేషన్లపై బీజేపీని నిలదీస్తే తనపై ఢిల్లీ పోలీసులతో కేసులు పెట్టించారని, ఇలాంటి కేసులకు తాను భయపడేది లేదని తేల్చి చెప్పారు. ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మెదక్, ఆసిఫాబాద్‌లో నిర్వహించిన సీఎం రోడ్‌షోకు జనం అంతంత మాత్రంగానే హాజరయ్యారు.



సీఎం సిద్దిపేట రోడ్‌షో ఏరియాలో అప్రమత్తంగా విద్యుత్తు అధికారులు, సిబ్బంది

విద్యుత్ సిబ్బంది పాట్లు

సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి నిర్వహించిన రోడ్‌షో సందర్భంగా కరెంటు పోకుండా విద్యుత్తుశాఖ సిబ్బంది పలు జాగ్రత్తలు తీసుకున్నారు. కరెంటు పోతే తమ ఉద్యోగాలు కూడా పోతాయన్న భయంతో ఎస్ఈ మొదలు కిందిస్థాయి సిబ్బంది వరకు మొత్తం సభ వద్దే ఉండి ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకున్నారు. సభ సజావుగా ముగియడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. సీఎం రేవంత్ రోడ్‌షో సందర్భంగా బాబూ జగ్జీవన్‌రావు విగ్రహం నుంచి పాత బస్టాండ్ వరకు ట్రాఫిక్‌ను మళ్లించడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్‌షో ప్రారంభానికి గంటన్నర ముందే ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయడంతో వాహనదారులు అష్టకష్టాలుపడ్డారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

వైద్యానికి చికిత్స

'అన్నీ వేదాల్లోనే ఉన్నాయిష' అన్నట్టుగా 'ఆయుర్వేదమే సర్వరోగ నివారిణి' అనే ధోరణి ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఏది అచ్చమైన ప్రాచీన ఆయుర్వేదమో, ఏది టక్కుటమార చిట్కా వైద్యమో కనిపెట్టడం కష్టమైపోయింది. దీంతో నమ్మేవాడికి నమ్ముకున్నంత, అమ్మేవాడికి అమ్ముకున్నంత అన్నట్టుగా తయారైంది పరిస్థితి. పైగా ఆయుర్వేదం మంచిది, అల్లోపతి చెడ్డది అనే భావన కూడా చాపకింద నీరులా వ్యాపిస్తున్నది. ఈ భావన వెర్రితలలు వేస్తే ఏం జరుగుతుందో మనకు పతంజలి ఆయుర్వేద ఉత్పత్తుల వివాదంలో తేటతెల్లమైంది. సామాజిక ఉద్యమకారుడిగా, యోగ ప్రచారకుడిగా ప్రసిద్ధుడైన బాబా రాందేవ్ అలోపతి వైద్యానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు ఆయన మెడకు చుట్టుకున్నాయి. ముఖ్యంగా కొరోనిల్ ఔషధం చుట్టూ అల్లుకున్న ప్రచారం తీవ్రమైన తలవంపులు తెచ్చిపెట్టింది. చివరికి సర్వోన్నత న్యాయస్థానం తాఖీదుల మేరకు ప్రముఖ పత్రికల్లో క్షమాపణ ప్రకటనలు విడుదల చేయాల్సి వచ్చింది.

'వైద్యో నారాయణో హరిః' అని గౌరవించే దేశం మనది. ప్రాచీనకాలంలోనే శుశ్రుతుడు, చరకుడు ప్రామాణిక వైద్య గ్రంథాలు రాసిపెట్టిన భారతదేశంలో వైద్యం ఎదుర్కొంటున్న గందరగోళ పరిస్థితికి పతంజలి వివాదం అద్దం పట్టింది. ఒకప్పుడు ఊరూరా ఓ వైద్యుడు ఉండేవాడు. దేశవాళీ పద్ధతుల్లో చికిత్సలు చేస్తూ రోగాల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేవాడు. వలసపాలన పుణ్యమాని ఆయుర్వేదం, సిద్ధ, యునానీ వంటి స్వదేశీ వైద్యవిధానాలు క్రమంగా వెనుకతట్టు పట్టి అల్లోపతి పైచేయి సాధించడం కొంతవరకు ఈ పరిస్థితికి కారణం. పరిశోధన, అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతూ, ఆధునిక ముద్రతో అల్లోపతి ధాటిగా నిలబడగలిగింది. భారతీయ వైద్యవిధానాల్లో ఆ స్థాయి పరిశోధనలు జరగలేదన్నది వాస్తవం. దీంతో అవి అశాస్త్రీయమైనవనే భావన వ్యాప్తిలోకి వచ్చింది. ఒక అప నమ్మకం పెంచుతూ పోయారు. అలాగని అల్లోపతి కడిగిన ముత్యంలా తళతళ మెరుస్తున్నదని కాదు. ఔషధాల విషయంలో ఎన్నెన్నో వివాదాలు ఉండనే ఉన్నాయి. వైద్య ప్రమాణాలపై కఠిన నియంత్రణ అమలులో ఉండే పాశ్చాత్య దేశాల్లో అల్లోపతి ఔషధాలపై కుప్పతెప్పలుగా కేసులుండటమే ఇందుకు నిదర్శనం. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో నిషేధించిన మందులు ఇండియాలో బాహాటంగా వైద్యులు సిఫారసు చేస్తారనే అపప్రథ మొదటినుంచీ ఉండటం తెలిసిందే.

వైద్య విధానాల మధ్య వివక్ష లేదా అంటే అది అర్థరహితమైన విషయం. సమ్మిళితత్వమే శ్రేయస్కరం. అత్యవసర చికిత్సలకు అల్లోపతి, ఉదర సమస్యలకు ఆయుర్వేదం, దీర్ఘవ్యాధులకు హోమియోపతి.. ఇలా ఒక్కో రకం రుగ్మతలకు ఒక్కో విధానం బాగా పనిచేస్తుందని కొందరు నమ్ముతారు. కానీ అలోపతికి, ఇతర విధానాలకు మధ్య సయోధ్య కుదరదు. ఇతర విధానాలను గుర్తించేందుకు అల్లోపతి నిరాకరించడమే అందుకు కారణం. ఈ నేపథ్యంలో డబ్బులుంటే అల్లోపతి.. లేకపోతే ఆయుర్వేద ముసుగులో సాగే చౌక వైద్యం అన్న తీరుగా వైద్యం నడుస్తున్నది. భారతదేశానికి ఆచరణాత్మక వైద్య అనుసంధానంపై, ఆరోగ్య పరామితులపై ఇప్పటికీ పెద్దగా ఆలోచన జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. డాటా అందుబాటులో లేకపోవడం మరో సమస్య. దీనివల్ల స్వదేశీ వైద్య పద్ధతులు లెక్కలోకి రాకుండా పోతున్నాయి. పతంజలి వివాదాన్ని ఆసరాగా చేసుకొని వైద్య పరిశోధక సంస్థలు, ప్రభుత్వం ఇకనైనా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాలి. స్వదేశీ వైద్య విధానాన్ని సమూలంగా సంస్కరించి, సమున్నతంగా నిలబెట్టేందుకు ప్రచార ఆర్భాటాల నుంచి విముక్తి కలిగించి నిజమైన ఆయుర్వేద వైద్యాన్ని వ్యాప్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

కుమ్మక్కు.. కుట్ర.. కుతంత్రం!

ఎన్నికల యుద్ధ సందర్భంలో 'కుమ్మక్కు', 'బీ టీం' అంటూ యథేచ్ఛగా పేలుతున్నయి కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న రెండు జాతీయ పార్టీలు. ఈ రెండు పార్టీల టార్గెట్ బీఆర్ఎస్సే. వాటిని ఆ స్థాయిలో హడలెత్తిస్తున్నరు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఆయన సభలకు వస్తున్న భారీ స్పందన ఆ రెండింటికి నిదురను దూరం చేస్తున్నది. అందుకే, ఆ రెండు పార్టీలు కలిసి నాటకాలు ఆడుతున్నయి. వాటి సంయుక్త దర్శకత్వంలో నాటకాన్ని రక్తి కట్టిస్తున్నది ఎన్నికల కమిషన్. కాబట్టే, 'పేగులు మెడలో వేసుకుంటా, డ్రాయర్ లాగేస్తా, కనుగుడ్లు పీకేస్తా' వంటి వల్గర్, ఛీప్ భాష మాట్లాడిన రేవంత్‌రెడ్డిని వదిలేసి.. కాంగ్రెస్ అబద్ధపు హామీలను, విధానపరమైన నిర్ణయాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లిన కేసీఆర్‌పై 48 గంటల నిషేధం విధించిన 'భారత జాతీయ కాంగ్రెస్ జనతా ఎన్నికల కమిషన్' చెప్తున్నది ఎవరు ఎవరితో కుమ్మక్కు అవుతున్నరో అని.



శ్రీశైల్ రెడ్డి పంజుగుల
90309 97371



'మేం బీజేపీలో చేరము. కానీ, బయటి నుంచి మద్దతు ఇస్తం' అన్న రీతిలో ఎన్నికల కమిషన్, ఈడీ, ఐటీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నయి. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఇబ్బందులు సృష్టించే విషయంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి పని చేస్తున్నాయనడానికి వంద ఉదాహరణలు చెప్పవచ్చు. ఒకటే మద్యం కేసులో కేజ్రీవాల్‌పై ఒక రకంగా, శరత్ చంద్రారెడ్డిపై ఒక రకంగా, కల్వకుంట్ల కవితపై ఒకరకంగా వ్యవహరిస్తున్నయి రెండు జాతీయ పార్టీలు. తెలంగాణలో ఎన్నో మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలతో బీఆర్ఎస్‌ను దించి కాంగ్రెస్-బీజేపీ కలిసి గద్దెనెక్కుతున్నయి.

'మోదీ గారు' అధీర్ బాబు అని పిలిచే కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధురి బెంగాల్‌లో తమ మిత్రపక్షమైన టీఎంసీకి కాకుండా బీజేపీకి ఓట్లేయాలని చెప్పడం కుమ్మక్కుకు పరాకాష్ఠ. కేరళలో తమ మిత్రపక్ష సీఎం పినరయి విజయన్‌ను రేవంత్‌రెడ్డి తిట్టి రావడం ఈ కుమ్మక్కులో భాగమే. సిగ్గూ ఎగ్గూ లేని తెలంగాణ వామపక్ష నాయకులు కిమ్మనలేకపోవడం అతి అధమస్థాయి కుమ్మక్కు. ఏ మాత్రం విలువలు లేని రాజకీయం!

నరేంద్ర మోదీకి తాను చోటే భాయ్ అని రేవంత్‌రెడ్డి తెలివి తక్కువగా ఏమీ చెప్పలేదు. బాహాటంగానే మోదీతో, అదానీతో అంటకాగారు. 'నేను ఏబీవీపీ మనిషిని. మీకు నమ్మదగినవాడిని. తెలంగాణలో మీ అవసరాలు నేను, నా అవసరాలు మీరు తీర్చడంపై సీరియస్‌గా ఉందాం' అని ఆయన మోదీతో, ఆర్ఎస్ఎస్ పెద్దలతో చెప్పి ఉంటారని అనడానికి మనకెవరికీ సాక్ష్యాధారాలు అవసరం లేదు. రేవంత్ ప్రతి మాటా, ప్రతి చేతా అదే స్పష్టం చేస్తున్నది. బీజేపీ గెలుపు కోసం కనీసం ఆరేడు స్థానాల్లో బలహీనమైన అభ్యర్థులను నిలిపారు రేవంత్‌రెడ్డి.

రాహుల్‌గాంధీని, తెలంగాణ కాంగ్రెస్‌నూ పీకల్లోతు పాతిపెట్టడానికి స్కెచ్ వేశారు రేవంత్. తెలివి తక్కువ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఇవేవీ పట్టవు. మెప్పించే మాటలు, మురిపించే మూటలు చాలు వారికి. పాపం, పార్టీ జెండాయే జీవితం అనుకునే నాన్ సీరియస్ తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ల ఊహలకు కూడా అందరు రేవంత్.

తెలంగాణ బీజేపీ పరిస్థితి కూడా అచ్చం కాంగ్రెస్‌లాగే ఉన్నది. 'బండి సంజయ్, కిషన్‌రెడ్డి లాంటి వాళ్లను మా అధిష్ఠానం పట్టించుకోదు. టాప్ ముగ్గురు, నలుగురు జాతీయ నాయకులే అన్నీ స్వయంగా చూస్తరు, చేస్తరు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ముఖ్య విషయాలు ఏమీ చెప్పరు' అని బీఎల్ సంతోష్ తరఫు మనుషులు మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో చెప్పిన విషయం మనందరం ఆడియోల్లో విన్నం.


కాంగ్రెస్, బీజేపీలపై సాధికారికంగా, గణాంక సహితంగా చెలరేగిపోయే బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్‌ను నిర్బంధించిన్రు. నిషేధాలు, నిర్బంధాలు ఉద్యమకారులకు నిజమైన అభినందనల లాంటివి. వారి పనితీరును గౌరవించటం వంటివి. బూడిద నుంచి భగ్గుమని లేచి ఆకాశానికి ఎగిరే ఫీనిక్స్ పక్షిలా లేస్తరు నాయకులు. కేసీఆర్ చెప్పినట్టు 48 గంటల నిర్బంధానికి ప్రతీకారం 96 గంటల నిరసనల రూపంలో చూపిస్తరు ప్రజలు.

కేసీఆర్‌కు పొత్తూ, కుమ్మక్కూ లాంటివి ఉంటే గింటే అవి ప్రజలతోనే. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల జీవనప్రమాణాల పెంపు గురించి ఆలోచించే నాయకునికి, ఆయన పార్టీకి చిల్లర రాజకీయాలు అవసరం లేదు.

రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్‌కు, బీజేపీకి మరొక సామీప్యం కూడా ఉన్నది. దేవుని పేరుతో ఓట్లు అడగటం బీజేపీ నీచ రాజకీయం అయితే, దేవునిపైనే ఒట్లు వేయడం రేవంత్ చిల్లర రాజకీయం. అయితే ఇవన్నీ చైతన్యవంతమైన తెలంగాణ సమాజం ముందు నడవవు. తన బూటకపు ఒట్ల వల్ల కీడు కలుగకూడదనే రేవంత్ తన కుటుంబంపై ఒట్లు వేయడం లేదని, దేవుడు తేరగా దొరికిండు కదాని ఆయనపై ఒట్లు వేస్తున్నరని ఊర్లల్లో సామాన్య జనం మాట్లాడుకుంటున్నరు. దేవునిపై ఆ రెండు పార్టీలకు ఉన్న దైవ భక్తి, పాప భీతి ఏపాటిదో అర్థం అవుతున్నది కదా? మాధవునితోనే నాటకాలు ఆడేవారికి మానవులు ఒక లెక్కా?

అంతిమంగా చెప్పదలచుకున్నది ఒక్కటే: 'మోదీ, రేవంత్ కుమ్మక్కుల గురించి ఆలోచించండి, మీ భవిష్యత్తు పట్ల జాగరూకులై ఉండండి' అని తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కూడా నేను సూచిస్తున్నా.

ఇక, విజ్ఞులైన తెలంగాణ జనానికి: తెలంగాణలో బీఆర్ఎస్ మొదటి స్థానంలోకి వేగంగా దూసుకువస్తున్నదని, కాంగ్రెస్ మూడో స్థానానికే పరిమితం కానున్నదని జాతీయ సర్వేలు సైతం చెప్తున్నయి. 8-10 స్థానాల వరకు బీఆర్ఎస్ గెలువబోతున్నది. పదేండ్ల ప్రగతి తెలంగాణను ఐదు నెలల్లోనే సర్వనాశనం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల గ్రామగ్రామాన నిరసనలు వెల్లువెత్తుతున్నవి. ఆ పార్టీ అభ్యర్థులను ప్రజలు నిలదీస్తున్నరు. హామీలు, గ్యారెంటీలు అన్నీ మోసమని గ్రహించిన్రు. బీఆర్ఎస్ సభలకు పోటెత్తుతున్నరు. అందుకే ఆ రెండు పార్టీలకు దడ పుట్టి నీచ రాజకీయాలకు తెరలేపుతున్నయి. ఈ తరుణంలో బీఆర్ఎస్‌ను, తెలంగాణను దెబ్బతీసే కుమ్మక్కు ఎత్తుగడలపై తస్మాత్ జాగ్రత్త.



ఓటే సమాధానం!

అదేదో తెలుగు సినిమా డైలాగ్‌లాగా 'నాకు నేనే పోటీ, నాతో నేనే పోటీ, నాకు ఎవరు ఎదురొచ్చినా తొక్కిపడేస్తా' అనే విధంగా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారు. అధికారాన్ని దక్కించుకోవడం కోసం, దాన్ని నిలబెట్టుకోవడం కోసం ఆయన ఎంత దూరమైనా వెళ్తారనడంలో సందేహం లేదు. తన లక్ష్యాన్ని చేరుకోవడానికి మొన్నటివరకు మతాల మధ్య వైషమ్యాలు పెట్టడానికి కూడా ఆయన వెనుకాడేవారు కాదు. అదీ కుదరకపోతే ప్రతిపక్ష పార్టీల నేతలను ఈడీ ద్వారా జైల్లో పెట్టించేవారు. కానీ, ఇప్పుడు కుర్చీ కోసం ఏకంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులనే మింగేస్తున్నారు! మొన్న ఖజురహో, నిన్న సూరత్, నేడు ఇండోర్. మరి రేపు మరొకరు మోదీ అధికార దాహానికి బలి కావాల్సిందేనా?

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గొప్పలు చెప్పుకొనే మన దేశంలో అసలు ప్రతిపక్షం అనేది ఉండకూడదా? ఒకవేళ మోదీ మరోసారి అధికారం చేపడితే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టు నిజంగానే దేశంలో ఇవే చివరి ఎన్నికలు కానున్నాయా? అంటే ఔననే సమాధానమే వినిపిస్తున్నది. ఇప్పటినుంచే అందు కనుగుణంగా పరిణామాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నో దారుణాలు చోటుచేసుకుంటున్నాయి.

సూరత్‌లో రాజకీయ నాటకీయ పరిణామాల మధ్య కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభాని నామినేషన్‌ను తిరస్కరించడం వివాదాస్పదంగా మారింది. నీలేష్ కుంభాని నామినేషన్ తిరస్కరణకు గురికావడం, ఇతర ఇండిపెండెంట్లు బరిలో నుంచి తప్పుకోవడంతో బీజేపీ అభ్యర్థి ముఖేష్ దలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఆ నియోజకవర్గంలోని దాదాపు 18 లక్షల మంది ఓటర్లకు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లేకుండాపోయింది. ఏడు దశాబ్దాల సూరత్ లోక్‌సభ చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. సూరత్‌లో మొత్తం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో నీలేశ్ కుంభాని సహా 6 నామినేషన్లను తిరస్కరించారు. అనంతరం 8 మంది స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇదంతా బీజేపీ ప్రోద్బలంతోనే జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది. నామినేషన్లను ఉపసంహరించుకోవాలని స్వతంత్ర అభ్యర్థులను కోరినట్టు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావడే చెప్పడం చూస్తే బీజేపీ నిర్వాకమని తెలుస్తున్నది.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా చేసిన సంతకాలు నకిలీవని చెప్తున్నప్పటికీ అది అనుమానాస్పదంగా మారింది. నీలేశ్ కుంభాని మద్దతుదారులుగా సంతకాలు పెట్టినవారంతా ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులే. సంతకం పెట్టినవారిలో జగదీశ్.. నీలేశ్‌కు బావ వరుస అవుతారు. ధ్రువిన్ మేనల్లుడు. రమేశ్ పోలా ఆయన బిజినెస్ పార్ట్‌నర్. ఆ ముగ్గురు నీలేశ్‌కు ఆప్తులే అయినప్పటికీ వారు కలెక్టరేట్‌కు వెళ్లి నామినేషన్లపై ఉన్నవి తమ సంతకాలు కావని ఎందుకు ప్రమాణపత్రం ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తాజాగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బమ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకొని బీజేపీలో చేరడం సంచలనంగా మారింది. అక్షయ్ కాంతి బమ్ నామినేషన్‌ను ఉపసంహరించుకోవడానికి సరిగ్గా మూడు రోజుల ముందు నాటకీయ పరిణామాలు జరిగాయి. 17 ఏండ్ల కిందటి కేసులో కోర్టుకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు అందాయి. ఆ తర్వాత ఆయన బీజేపీలో చేరారు. దీంతో ఇదంతా కాకతాళీయంగా జరిగిందా? లేదా ఏదైనా రాజకీయ కుట్ర దాగి ఉందా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

ఇండోర్‌లో 1989 నుంచి బీజేపీ అభ్యర్థులే ఎంపీలుగా గెలుస్తున్నారు. 1989-2014 వరకు సుమిత్రా మహాజన్ ఎంపీగా ప్రాతినిధ్యం వహించగా.. 2019లో శంకర్ లల్వానీ ఐదు లక్షల మెజారిటీతో గెలిచి రికార్డు సృష్టించారు. అంత భారీ మెజారిటీ వచ్చిన స్థానంలో ప్రత్యర్థి పార్టీకి చెందిన అభ్యర్థి నామినేషన్‌ను విత్‌డ్రా చేయించాల్సిన అవసరం ఏమొచ్చింది. ఓటమి భయంతోనే బీజేపీ ఇలా చేస్తున్నదనేది స్పష్టంగా తెలుస్తున్నది. ఓటమి భయంతోనే అనేక చోట్ల బీజేపీ ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నదనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఖజురహోలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి మీరా యాదవ్ నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో చేసేదేమీ లేక ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ అభ్యర్థి కేవీ ప్రజాపతికి ఇండియా కూటమి మద్దతు ప్రకటించింది.

ఎవరు పోటీలో ఉండాలో ఎవరు ఉండకూడదో బీజేపీ నిర్ణయిస్తుండటం ఆందోళనకరం. ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. పోటీ ఉండకూడదని అనుకున్నపుడు ఎన్నికలు నిర్వహించడం ఎందుకు? కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేయడమెందుకు?

ఓటు ద్వారానే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుంది. అసలు పోటీయే లేకుండా బలవంతపు ఏకగ్రీవాలు దేశానికి మంచిది కాదు. ఒకవేళ మూడోసారి మోదీ సర్కార్ అధికారంలోకి వస్తే.. దేశంలో ఇవే చివరి ఎన్నికలు అయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఓటు అనేది హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలి. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారికి తమ ఓటుతో సమాధానం చెప్పాలి.



భరత్ చౌహాన్
90306 66999

మోదీ.. 27 కేసులు, 1 నోటీసు, చర్య సున్నా

'మీ విధి నిర్వహణలో మీరు విఫలమయ్యారని నేను ఏప్రిల్ 24న హెచ్చరించాను. ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో, వివక్షతో వ్యవహరిస్తున్నదనేది నా ఆరోపణ'
- 2014, మే 8న బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోదీ

2019 నుంచి ఇప్పటివరకు విపక్ష పార్టీలు ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్టు కనీసం 27 సార్లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఈ కేసుల్లో దేని మీదా ఇప్పటివరకు ఎన్నికల సంఘం నికరమైన చర్య తీసుకోలేదు. ఈ ఫిర్యాదుల్లో విద్వేష ప్రసంగం, ఓట్లు పొందేందుకు సైనిక దళాలను ఉపయోగించుకోవడం, మతం పేరు మీద ఓట్లు అడగడం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలను ప్రధాని ఎన్నికల సభల ప్రసంగాల తయారీకి ఉపయోగించుకోవడం మొదలైనవి ఉన్నాయి.



హిమాన్షి దహియా


మొట్టమొదటిసారిగా ఎన్నికల సంఘం ఏప్రిల్ 25న బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన గురించి తెలియజేసే నోటీసులు పంపింది. అయితే ఇక్కడో చిన్న కిటుకు ఉంది. ఆ నోటీసులో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) అందజేసిన ఫిర్యాదుల గురించిన ప్రస్తావన అయితే ఉంది కానీ, ప్రధాని పేరు ఎక్కడా పేర్కొనలేదు. ఒక ఎన్నికల సభలో ప్రధాని నరేంద్ర మోదీ మతావేశంతో కూడిన ప్రసంగం చేశారనీ, కాంగ్రెస్ ఒకవేళ అధికారంలోకి వస్తే సంపదను చొరబాటుదారులకు పంచేస్తుందని ఆ ప్రసంగంలో అన్నారని ఆయా రాజకీయపక్షాలు తమ ఫిర్యాదులో ఆరోపించాయి.

'కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వారు దేశంలోని సంపదలపై ముస్లింలకే మొదటి హక్కు ఉంటుందని చెప్పారు. అంటే వారు దేశ సంపదను ఎక్కువ పిల్లలు కనేవారికి, చొరబాటుదారులకు పంచుతారని అర్థం. ఇదంతా మీకు ఆమోదయోగ్యమా?' అని ప్రధాని రాజస్థాన్‌లోని బాన్సువాడ జిల్లాలో ఏప్రిల్ 21 ఆదివారం నాడు జరిగిన సభలో సభికులను ఉద్దేశించి ప్రశ్నించారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు.. 'మన తల్లులు, చెల్లెళ్ల ఒంటి మీద ఉన్న బంగారానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, లెక్కవేసి దానిని పంచేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో అంటున్నది. సంపదపై మొదటి హక్కు ముస్లింలకు ఉంటుందని మన్మోహన్ సింగ్ సర్కార్ ఇదివరకే అన్నది. సోదర, సోదరీమణులారా ఈ అర్బన్ నక్సల్ ఆలోచనలు మీ మెడలో ఉండే మంగళసూత్రాన్ని కూడా వదిలిపెట్టవు, వారు అంతదాకా వెళ్తారు.'

ఎన్నికల ప్రవర్తన నియమావళిలోని సెక్షన్ (1) ఏమంటుందంటే: ఏ పార్టీ కానీ, అభ్యర్థి కానీ ప్రస్తుతం ఉన్నటువంటి విభేదాలను రెచ్చగొట్టడం లేదా విద్వేషాన్ని సృష్టించడం లేదా వివిధ కులాలు, సామాజికవర్గాలు, మతాలు, భాషావర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించకూడదు.

బీజేపీని సదరు నోటీసుకు ఏప్రిల్ 29లోగా సమాధానం అందజేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆ ప్రసంగం చేసిన బాన్సువాడ నియోజకవర్గంలో రెండో విడతలో భాగంగా ఏప్రిల్ 26 శుక్రవారం నాడు పోలింగ్ జరిగింది.



2019 నుంచి ఇప్పటివరకు విపక్ష పార్టీలు ప్రధానిపై అందజేసిన కనీసం 27 ఫిర్యాదులను 'ది క్వింట్' విశ్లేషించింది. ఇందులో అంశాలవారీగా చూస్తే... 8 రకాల ఉల్లంఘనలు జరిగినట్టు తెలుస్తున్నది.

విపక్షాలు చెప్పేదాని ప్రకారం ఎన్నికల సంస్థ ఈ ఫిర్యాదుల్లో దేనిమీదా చర్య తీసుకోలేదు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి 2019 మార్చి 27న ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రాసిన ఒక లేఖలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత ఆయన చేసిన ప్రకటనకు సంబంధించి ఫిర్యాదు చేశారు.

'ప్రధాని తన ప్రసంగంలో డీఆర్డీవో శాస్త్రవేత్తలు ఉపగ్రహ విధ్వంసక క్షిపణిని విజయవంతంగా ప్రయోగించి, పరీక్షించడాన్ని ప్రస్తావించారు. ఎన్నికల ప్రచారం జరుగుతుండగా, అందులోనూ ప్రధాని కూడా ఒక అభ్యర్థిగా ఉన్నప్పుడు ఈ ప్రకటన చేశారు. ఇది స్పష్టంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడమే' అని ఏచూరి తన ఫిర్యాదులో తెలిపారు. ఆ ఫిర్యాదుపై ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఒక కమిటీ ప్రభుత్వ మీడియా దుర్వినియోగం అనేది జరగలేదని ఒక్క ముక్కలో తేల్చేసింది. ఎన్నికల సంఘం తన ఫిర్యాదును కొట్టివేయడంపై ఏచూరి స్పందిస్తూ, అధికారిక మీడియా దుర్వినియోగం అనే సంకుచిత పరిధికి కుదించడం ఫిర్యాదుపై సంకుచిత భాష్యం చెప్పడమేనని అన్నారు. ప్రసంగం ముగిసిన వెంటనే ప్రధాని కేవలం భూమి మీద, ఆకాశంలో మాత్రమే కాదు.. అంతరిక్షంలో కూడా నేను చౌకీదారును అని ప్రకటించుకున్నారు. ఆ తర్వాత దీనిపై ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

ఎన్నికల సంఘం, మోదీ పాలన: గతేడాది డిసెంబర్‌లో భారత పార్లమెంటు ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం (2023)ను ఆమోదించింది. ఆ చట్టంలోని 7వ సెక్షన్ ప్రకారం ప్రధాని చైర్‌పర్సన్‌గానూ, కేంద్ర క్యాబినెట్ మంత్రి, ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉండే ఎంపిక కమిటీ సిఫారసు మేరకు సీఈసీ, ఈసీలను రాష్ట్రపతి నియమిస్తారు. సుప్రీం కోర్టు అదివరకే ఆ కమిటీలో ప్రధాని, ప్రతిపక్ష నేత లేదా పార్లమెంటులోని అతిపెద్ద విపక్ష పార్టీ నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండాలని ఆదేశించింది. (కానీ కేంద్రం దీనిని పాటించలేదు)

తమ పార్టీ గీతంలోని 'జై భవాని', 'హిందూ' అనే పదాలను తొలగించాలని ఎన్నికల సంఘం నుంచి తనకు ఏప్రిల్ 21న ఆదేశాలు వచ్చాయని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. ఆ ఆదేశాలు పాటించేందుకు ఠాక్రే నిరాకరించారు. తమకన్నా ముందుగా కర్ణాటక ఎన్నికల సందర్భంగా ఆంజనేయుని (జై బజరంగ బలీ) తలచుకుని ఈవీఎంను నొక్కాలని సూచించిన ప్రధాని నరేంద్ర మోదీపై, రాంలల్లా ఉచిత దర్శనం కావాలంటే బీజేపీకి ఓటు వేయాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై చర్య తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో హనుమంతుని పేరు వాడుకోవడంపై కాంగ్రెస్ కూడా ఈసీకి ఫిర్యాదు చేసింది. ఎన్నికల కమిషన్ దీనిపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. ప్రధానిపై పనౌతీ, పిక్‌పాకెట్, ధనవంతులకు రుణమాఫీ చేసేవాడనే ఆరోపణలు చేసినందుకు రాహుల్‌గాంధీకి ఎన్నికల సంఘం 2023 నవంబర్‌లో నోటీసులు పంపించింది. రాజకీయ ప్రత్యర్థులపై నిర్ధారితం కాని ఆరోపణలు చేయరాదని ఎన్నికల ప్రవర్తనా నియమావళి సూచిస్తున్నదని ఆ నోటీసులో రాహుల్‌కు గుర్తుచేసింది.

అంతకుముందు మితవాద బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేసిన హామీని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. అలా చేయడాన్ని బజరంగ్ బలీ లేదా హనుమంతుడిని జైలులో పెట్టడంగా పోల్చిచెప్పారు. ఈసీ నోటీసులో చేసిన సూచనలను పాటించేందుకు నిరాకరించే సమయంలో ఠాక్రే ఎత్తిచూపింది దీనినే. ప్రధానిని అవమానించేలా పోస్టులు పెట్టారని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు కూడా నోటీసులు జారీచేశారు. 2019లో కాంగ్రెస్ సీనియర్ నేత నవజ్యోత్ సింగ్ సిద్ధూ చేసిన వ్యాఖ్యలు నియమావళికి విరుద్ధంగా ఉన్నాయని ఈసీ పేర్కొంటూ, 72 గంటల పాటు ప్రచారం జరపకుండా ఆయనపై నిషేధం విధించింది.

ఎంసీసీ ఓ నైతిక సెన్సార్: ఏప్రిల్ 16 వరకు రాజకీయపార్టీలు నియమావళి పాటించడం అనేది స్థూలంగా సంతృప్తికరంగా ఉన్నదని స్వయంగా ఎన్నికల సంఘమే వెల్లడించింది. సుమారు 200 దాకా రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు అందాయని, వాటిలో 169 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నామని ఒక ప్రకటనలో ఈసీ తెలిపింది. అంశాలవారీగా ఫిర్యాదులను వివరిస్తూ, బీజేపీ నుంచి 51 ఫిర్యాదులు వస్తే 38 ఫిర్యాదులపై, కాంగ్రెస్ నుంచి 59 ఫిర్యాదులు వస్తే అందులో 51 ఫిర్యాదులపై, ఇతర పార్టీల నుంచి 90 ఫిర్యాదులు వస్తే 80 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నట్టు వెల్లడించింది.

ఏప్రిల్ 25న ప్రధాని మోదీ పేరు ప్రస్తావించకుండా స్టార్ క్యాంపెయినర్ల ఉల్లంఘనపై బీజేపీకి ఈసీ నోటీసు పంపింది. 2024 ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు ఈసీ జరిపిన పత్రికా సమావేశంలో నేషనల్ హెరాల్డ్‌కు చెందిన జర్నలిస్టు ఆష్లిన్ మాథ్యూ ఫిర్యాదుల విషయంలో ఎన్నికల సంఘం బీజేపీని ఒకరకంగా, ఇతర పార్టీలను ఒకరకంగా చూడటం గురించి ప్రశ్నించారు. 'విద్వేష ప్రచారాలపై, కోడ్ ఉల్లంఘనపై లెక్కప్రకారం చర్యలుంటాయని మీరు తెలిపారు. ప్రధానిపై, అమిత్ షాపై ఎన్నో ఫిర్యాదులు వచ్చినా ఈసీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. కానీ, ప్రతిపక్ష నాయకుల మీద మాత్రం చర్యలు తీసుకున్నారు. లెక్కప్రకారం చర్యలు అంటే విపక్ష నేతలపై ఎక్కువ చర్యలుంటాయా లేక బీజేపీ నుంచి ఎక్కువ నోటీసులు అని అర్థమా?' ఇది మాథ్యూ అడిగిన ప్రశ్న.

సమాధానంగా సీఈసీ రాజీవ్ కుమార్ ఇలా అన్నారు.. 'గత 10-11 సంవత్సరాల నుంచి వస్తున్న ఫిర్యాదులు చూడండి. ఆ తర్వాత మేం ఇచ్చిన నోటీసులు గమనించండి. పార్టీలు మా నోటీసులకు స్పందించిన తర్వాత, ఉల్లంఘన ఉన్నదని తెలిసినప్పటికీ, ప్రతిసారీ మేం చర్యలు తీసుకోవడం జరగదు. ప్రవర్తనా నియమావళి అనేది ఓ నైతిక సెన్సార్ లాంటిది. కానీ, ఎవరిమీదైనా కేసు ఉంటే మాత్రం మేం చూస్తూ ఊరుకోం. అది ఎంత పెద్ద స్టార్ క్యాంపెయినర్ అయినా సరే వదిలి పెట్టం'.

('ది క్వింట్' సౌజన్యంతో)

కాంగ్రెస్‌లో చేరిక.. లేదిక!

- ఆహ్వానిస్తున్న కమిటీ.. అడ్డుపడుతున్న ఎమ్మెల్యేలు
- చేతులెత్తేసిన చేరికల కమిటీ
- దీపాదాస్‌కు చెప్పాకే చేరికలు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): హలో! ఎవరైనా ఉన్నారా? రండి.. వచ్చి కాంగ్రెస్‌లో చేరండి.. మంచి తరుణం మించితే దొరకదు అంటూ కాంగ్రెస్ చేరికల కమిటీ చేసిన ప్రకటన మూన్నాళ్ల ముచ్చటే అయింది. టీపీసీసీ చేరికల కోసం ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటుచేసింది. అయితే ఇది ఏర్పడి వారం రోజులు తిరక్కముందే ఇక్కడ తమ సమ్మతంతో చేరికలు ఉండవని, చేరాలనే ఆసక్తి ఎవరికైనా ఉంటే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీనే సంప్రదించాలంటూ చేతులు ఎత్తేసింది. అసలు ఏం జరిగింది? ఎవరైనా వచ్చి కాంగ్రెస్‌లో చేరవచ్చని ఆహ్వానించి హడావుడి చేసిన కమిటీ వెనక్కి తగ్గడానికిగల కారణం ఏమిటి? అని పార్టీలో చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్‌లో చేరికల కథాకమామిషు ఏమిటని ఆరా తీస్తే ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. చేరికల కోసం ముగ్గురితో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి అందులో తమను నియమించి, తీరా పదవుల తీశాక తమను వారు అవమానించారు. అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాత పార్టీలో ఎవరైనా చేరవచ్చని ప్రకటన చేశాం. ఇప్పుడేమో, ఎవడంటే వాడే మెడలో పార్టీ కండువా కప్పుతారా? అని మంత్రులు, ఎమ్మెల్యేలు ఎదురు తిరగడంతో చేరికల కమిటీ కంగుతిన్నది. పొద్దున పార్టీలో చేర్చుకోవడం.. సాయంత్రానికి వారి చేరికలను నిలిపివేసినట్టు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నుంచి ప్రకటన రావడం నిత్యకృత్యంగా మారింది. ఇది తమ పదవులకు అవమానంగా మారుతున్నదని చేరికల కమిటీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇక నుంచి పార్టీలో ఎవరైనా చేరాలనుకుంటే నేరుగా దీపాదాస్ మున్షీని కలవండి అని చేరికల కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి ప్రకటించి చేతులు దులుపుకున్నారు.

గేట్లు తెరిచినా.. ఫలితం లేదని..

కాంగ్రెస్‌లో చేరికలకు గేట్లు తెరిచినట్టు పార్లమెంట్ ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించినప్పటికీ పెద్దగా చేరికలు జరుగలేదు. పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడంతో ఎమ్మెల్యేలు, ఎంపీలే కాకుండా చోటామోటా నాయకులు వచ్చినా చేర్చుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వానికి అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇటీవల హైదరాబాద్ వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీల నుంచి ఎవరు వచ్చినా చేర్చుకోవాలని పీసీసీని ఆదేశించారు. ఇది జరిగిన వెంటనే పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డితో చేరికల కమిటీ ఏర్పాటు చేశారు. ఎవరైనా వచ్చి కాంగ్రెస్‌లో చేరవచ్చు.. కండువాలు కప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నామని కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి ప్రకటించారు.

పొద్దున చేరికలు.. సాయంత్రం నిలిపివేత

కొందరు చోటామోటా నాయకులతోపాటు గత ఎన్నికలలో కాంగ్రెస్ టికెట్ దక్కక పార్టీకి రాజీనామా చేసిన నాయకులు, తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగిన వారు గాంధీభవన్‌కు వస్తే చేరిక కమిటీ వారికి కండువాలు కప్పింది. అలా చేరిన వారిలో దేవరకద్ర నుంచి అసెంబ్లీ ఎన్నికలలో టికెట్ ఆశించి భంగపడి పార్టీకి రాజీనామా చేసిన కే ప్రదీప్ గౌడ్ ఒకరు. ఈయన పార్టీలో చేరిన రోజు సాయంత్రమే ఆయన చేరికను నిలిపివేసినట్టు దీపాదాస్ మున్షీ ప్రకటించారు. తనకు టికెట్ దక్కలేదన్న ఆక్రోశంతో పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన నాయకుడిని తిరిగి ఎలా చేర్చుకుంటారని స్థానిక ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతో సంప్రదించకుండా చేర్చుకోవడాన్ని నిరసిస్తూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ప్రచారాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో దిక్కు తోచని దీపాదాస్ మున్షీ ఈ చేరికను నిలిపివేయక తప్పలేదని చెప్తున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ భార్గవ్, 13 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లతో వచ్చి గాంధీభవన్‌లో చేరిక కమిటీతో పార్టీ కండువా కప్పుకున్నారు. వీరి చేరిక కూడా సేమ్ టు సేమ్. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆగ్రహం తెప్పించింది. తమను సంప్రదించకుండా ఎలా చేర్చుకున్నారని వారు దీపాదాస్ మున్షీకే నేరుగా ఫోన్ చేసి నిలదీసినట్టు సమాచారం. దీంతో వీరి చేరికను కూడా నిలిపివేసినట్టు ఆమె ప్రకటించక తప్పలేదు. భువనగిరి నియోజకవర్గానికి చెందిన గౌడ శ్రీనివాస్‌గౌడ్, రాహుల్ గౌడ్, చిన్నం శ్రీనివాస్ గౌడ్ తదితరులు కూడా చేరికల కమిటీ ప్రకటనతో గాంధీ భవన్‌కు వచ్చి పార్టీ కండువా కప్పుకున్నారు. తనతో సంప్రదించకుండా వీరిని ఎలా చేర్చుకుంటారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ మండిపడటంతో వీరి చేరికలను కూడా నిలిపివేశారు.



మాకొద్దు.. ఈ కమిటీ

పొద్దున కండువా కప్పడం.. సాయంత్రానికి వారి చేరికలను నిలిపివేసినట్టు దీపాదాస్ మున్షీ ప్రకటించడంతో తాము చేరిక కమిటీ నుంచి తప్పుకుంటున్నట్టు సభ్యులు ముగ్గురు చెప్పారు. ఇక నుంచి ఎవరైనా పార్టీలో చేరదల్చుకుంటే నేరుగా దీపాదాస్ మున్షీని కలవాలని జగ్గారెడ్డి పత్రికాముఖంగా ప్రకటించారు.



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎల్ఐసీ కార్యాలయంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్

ఈసీ గీత దాటిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

- గోదావరిఖని ఎల్ఐసీ ఆఫీసులో ప్రచారం
- బీఎం, ఏబీఎం, ఇతర సిబ్బందితో సమావేశం

పెద్దపల్లి, మే 2 (నమస్తే తెలంగాణ): రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ఎన్నికల సంఘం నిబంధనలను తుంగలో తొక్కారు. పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరుతూ గురువారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎల్ఐసీ కార్యాలయంలో ప్రచారం చేశారు. ఓట్లు అభ్యర్థించడమే గాక కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలోనే బ్రాంచ్ మేనేజర్ నందిగాం శ్రీనివాస్‌రావు, ఏబీఎం నాగేంద్రకుమార్, ఏవో శ్రీనివాస్‌తో కలిసి సిబ్బంది, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసీ నిబంధనలకు నీళ్లొదులుతూ సదరు నేత చేసిన పనికి ఆ సంస్థ బ్రాంచి మేనేజర్, మరో ఇద్దరు అధికారులు సహకరించడమే కాకుండా ఏకంగా సమావేశ వేదికను అలంకరించి మద్దతు పలికారు. అంతకుముందు కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యేను ఎల్ఐసీ బ్రాంచి ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించి స్వామి భక్తిని చాటుకున్నారు. ఇన్సూరెన్స్ సంస్థ అధికారులు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమావేశంలో పాల్గొన్న మక్కాన్ సింగ్ చేతిగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వంశీని గెలిపిస్తే ఏజెంట్ల సంఘ భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఎల్ఐసీ కార్యాలయంలో ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవడంతోపాటు అందుకు సహకరించిన బ్రాంచి మేనేజర్, సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అమిత్ షా కో న్యాయం.. నాకో న్యాయమా?

- కేంద్రాన్ని నిలదీసిన కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్



హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): 'అమిత్ షాకో న్యాయం.. నాకో న్యాయమా? ఆయన ఫిర్యాదు చేస్తే అరెస్టులు.. నేను ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ కూడా చేయరా?' అని కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు విరుచుకుపడ్డారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్లను రద్దు చేస్తామని అన్నట్టు ఫేక్ వీడియో తయారు చేశారని బీజేపీ అగ్రనేత అమిత్‌షా ఫిర్యాదు చేస్తే 24 గంటల్లో అరెస్టులు చేసిన పోలీసులు.. మరి తాను అనని మాటలు అన్నట్టుగా ఒక పత్రిక రాసిందని ఫిర్యాదు చేస్తే కేసు ఎందుకు పెట్టడంలేదని ప్రశ్నించారు. దేశమంతా మోదీ ప్రభంజనం నడుస్తున్నదని, కాంగ్రెస్ గెలువడం కష్టమే అని తాను అన్నట్టుగా ఒక పత్రిక కథనాన్ని ప్రచురించిందని, తన ప్రతిష్ఠను దెబ్బతీసే కథనం ప్రచురించిన పత్రికపై ఫిర్యాదు చేస్తే ఎందుకు చర్య తీసుకోవడం లేదని నిలదీశారు.

6న కవిత బెయిల్ పిటీషన్ తీర్పు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ లిక్కర్ పాలసీ అంశంలో అరెస్టయిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సంబంధించిన బెయిల్ పిటిషన్‌పై ఈనెల 6న తీర్పు వెలువడనున్నది. సీబీఐ, ఈడీలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అభియోగాలు మోపడం, రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం కవితకు జ్యుడీషియల్ రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన కవిత తరపున గురువారం న్యాయవాదులు వాదనలు వినిపించారు. వాదనలు విన్న ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కావేరి బవేజా తుది తీర్పును ఈనెల 6కు వాయిదా వేశారు.

ఇంటి వద్దే ఓటింగ్ ప్రక్రియ షురూ!

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గురువారం నుంచి లోక్‌సభ ఎన్నికలకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే ప్రక్రియను ఎన్నికల అధికారులు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకేరోజు కాకుండా వెసులుబాటును బట్టి శుక్ర, శనివారాల్లో కూడా హోంఓటింగ్ ప్రారంభంకానున్నది. రాష్ట్రవ్యాప్తంగా 23,248 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. హోం ఓటింగ్‌కు 806 బృందాలు, 885 రూట్లుగా ఎన్నికల అధికారులు విభజించారు. ఒక్కో బృందంలో పోలింగ్ అధికారులతోపాటు వీడియో చిత్రీకరణ బృందం కూడా ఉంటుంది. హోంఓటింగ్‌ను ఈ నెల 6 కల్లా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది.

నల్లగొండ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్


హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 9 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 10న నామినేషన్ల పరిశీలన, 13 వరకు ఉపసంహరణ, అదే రోజు తుది అభ్యర్థుల ప్రకటన ఉంటుంది. ఈ నెల 27న పోలింగ్ జరుగుతుంది. జూన్ 5న ఓట్లను లెక్కిస్తారు. తొలిరోజైన గురువారం ముగ్గురు అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు, ప్రజావాణి పార్టీ నుంచి పాటి శ్రీకాంత్‌రెడ్డి, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య నామినేషన్లు వేశారు.

అందరినీ సమదృష్టితో చూడండి: ఈసీ

హైదరాబాద్, మే 2(నమస్తే తెలంగాణ): ఎన్నికల విధుల నిర్వహణ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులను సమదృష్టితో చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్ వ్యాస్ రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించారు. వారు ఇచ్చే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆయన స్పష్టంచేశారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను వ్యాస్ గురువారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్లు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకులతోపాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, వ్యయ నోడల్ అధికారి మహేశ్ భగవత్, అదనపు డీజీ సంజయ్ జైన్, అదనపు సీఈవో లోకేశ్ కుమార్, సంయుక్త సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాలు, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్య బృందాలు, స్ట్రాంగ్ రూమ్‌లకు అందించాల్సిన భద్రత తదితర అంశాలపై వ్యాస్ ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా పోలింగ్‌కు ముందు 72గంటలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి పొరపాటు జరిగినా క్షమించే ప్రసక్తే ఉండదని వ్యాస్ స్పష్టంచేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలోని పలు ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించాలని ఈ సందర్భంగా రాష్ట్ర అధికారులు కోరారు.

కాంగ్రెస్ 'ట్యాక్స్'లపై మౌనం

- కమీషన్ల పాలన సాగుతున్నదని బీజేపీ ఆరోపణలు
- ఆర్, ఆర్ఆర్, ఆర్బీ, ఆర్జీ, ఆర్ఆర్ఆర్ ట్యాక్సులంటూ రోజుకో పేరు
- ఆధారాలతో సహా బయటపెడతామంటూ ప్రగల్భాలు
- గల్లీ లీడర్ మొదలు ప్రధాని మోదీ వరకు కలవరింతలు
- ఆరోపణలు సరే.. చర్యలెందుకు లేవనే అనుమానాలు
- ఇద్దరి మధ్య లోపాయికారి ఒప్పందమని ఆరోపణలు



- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో 'ఆర్' ట్యాక్స్ మొదలైంది.
- కొత్తగా బీ ట్యాక్స్ ప్రారంభమైంది.
- ఆర్జీ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఢిల్లీకి, బెంగళూరుకు కప్పం కడుతున్నారు.
- రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. తెలంగాణ డబ్బులను కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఎన్నికల ఖర్చుకోసం వాడుకుంటున్నది.
- రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్‌కు తోడు మరో ఆర్ కలిసింది. ట్రిపుల్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): రెండు మూడు నెలలుగా బీజేపీ రాష్ట్ర నేతలు చేస్తున్న ఆరోపణలు ఇవి. ఏకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా 'రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు' అంటూ బహిరంగసభలో విమర్శించిన పరిస్థితి. 'ట్యాక్స్' వసూలు ఆరోపణలను మొదట్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రారంభించగా.. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మరో స్థాయికి తీసుకెళ్లారు. కే లక్ష్మణ్ వంటి కీలక నేతలు సైతం తరచూ ఇవే విమర్శలు చేస్తున్నారు. తెలంగాణలో సొమ్ము వసూలు చేసి.. ఢిల్లీకి సూట్‌కేసులు మోస్తున్నారంటూ పదేపదే చెప్తున్నారు. కాంగ్రెస్ తెలంగాణ డబ్బును దేశవ్యాప్తంగా ఎన్నికల ఖర్చుకోసం వాడుతున్నదంటూ మీడియాలో, సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. కర్ణాటకలో కమీషన్లు వసూలు చేసి తెలంగాణ ఎన్నికల్లో వాడారని, ఇప్పుడు తెలంగాణలో వసూలు చేసి కర్ణాటకకు తరలిస్తున్నారని కూడా ఆరోపిస్తున్నారు.

ఆరోపణలు సరే.. చర్యలేవి?

బీజేపీ గల్లీ లీడర్లు మొదలు ఢిల్లీ నేతల దాకా కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారు సరే.. 'మరి చర్యలు ఏవి?' అన్న ప్రశ్న ప్రజలందరిలో మెదులుతున్నది. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలున్న చోట ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు స్వైరవిహారం చేస్తున్న విషయాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రతిఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర నేతలు కూడా ప్రతిరోజూ ఆరోపణలు చేయడమే తప్ప ఈడీకో, సీబీఐకో ఫిర్యాదు చేసిన దాఖలాలు కూడా లేవని చెప్తున్నారు. ఇవిగో ఆధారాలు.. అదిగో ఆధారాలు అంటూ రాజకీయంగా పబ్బం గడుపుకోవడం తప్ప, ఆ ఆధారాలతో ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని నిలదీస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో చిన్న ఆరోపణలు, పాత కేసులను అడ్డం పెట్టుకొని ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగుతున్నాయని గుర్తు చేస్తున్నారు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని అంటున్నారు. నిరుడు తమిళనాడులో ఇసుకను అక్రమంగా మైనింగ్ చేస్తున్నారంటూ ఈడీ అధికారులు దాడులు చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. 2020 జూలైలో అశోక్ గెహ్లాట్ సీఎం గా ఉండగా ఆయన సోదరుడి ఇండ్లలో సోదా లు జరిపారని, 2007–09 మధ్య ఎరువుల ను పక్కదారి పట్టించారనే ఆరోపణలతో ఈ సోదాలు జరిగాయనంటున్నారు. ఇలా చిన్నచిన్న కారణాలకే ఈడీ రంగంలోకి దిగుతుండగా.. రాష్ట్రంలో మూడునాలుగు రకాల కమీషన్లు వసూలు చేస్తుంటే ఎందుకు మిన్నకుండిపోయాయని అడుగుతున్నారు. 'ఈడీ ఎక్క డ?.. సీబీఐ ఎందుకు రావడం లేదు?.. ఇతర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయి?' అని ప్రశ్నిస్తున్నారు.

ప్రతిపక్షమైనా.. చర్యలెందుకు లేవు?

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్లుగా ప్రతిపక్ష నేతలను ఇబ్బంది పెట్టేందుకే ఈడీ, సీబీఐని వాడుతున్నదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. పదేండ్లలో నమోదైన ఈడీ, సీబీఐ కేసుల్లో 97శాతం ప్రతిపక్ష నేతలు, వారి సన్నిహితులపై నమోదైనవేనని చెప్తున్నారు. అయినా రాష్ట్రంలో ఎందుకు చర్యలు లేవని ప్రశ్నిస్తున్నారు. మోదీ ఆరోపించిన తర్వాత కూడా ఫిర్యాదో, దర్యాప్తో లేకపోవడాన్ని బట్టి రెండు పార్టీల మధ్య లోపాయకారీ ఒప్పందం జరిగినట్టు అనుమానపడాల్సి వస్తున్నదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

రాష్ట్రంలో ఆర్‌ఆర్‌ఆర్ ట్యాక్స్

- రాహుల్, రేవంత్‌కు రియల్ ఎస్టేట్ ట్యాక్స్ జత కలిసింది
- చారాణా ఢిల్లీకి.. బారాణా ఇక్కడే ఖర్చు చేస్తున్న రేవంత్
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ ఆరోపణ

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఆర్ఆర్ ట్యాక్స్‌కు కొత్తగా మరో ఆర్ ట్యాక్స్ జతకలిసిందని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ట్రిపుల్ ఆర్ ట్యాక్స్ అంటే.. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, రియల్ ఎస్టేట్ ట్యాక్స్ అని పేర్కొన్నారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాల పునాదుల మీద రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, గద్దెనెక్కిన 24 గంటల నుంచే దోపిడీ మొదలు పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మూడు నెలలుగా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. బెంగళూరులో డీకే శివకుమార్ ఒక్కో స్కేర్ ఫీట్‌కు రూ.75 వసూలు చేస్తున్నారని, కాబట్టి తనకు రూ.100 కావాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారని చెప్పారు. చివరికి రూ.68కి సెటిల్‌మెంట్ జరిగిందని ఆరోపించారు. ఢిల్లీకి పంపాలి కాబట్టి పూర్తిగా నగదు రూపంలోనే తీసుకుంటున్నారని వివరించారు. వసూలు చేసిన దాంట్లో చారాణా (25శాతం) ఢిల్లీకి పంపుతున్నారని, బారా ణా (75 శాతం) ఇక్కడే ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఇలా కొత్తగా 120 ప్రాజెక్టులతో ప్రభుత్వం సెటిల్‌మెంట్ చేసి, అనుమతులు ఇచ్చిందని ఆరోపించారు. ట్రిపుల్ ఆర్ ట్యాక్స్ రూపంలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పారు. వసూళ్లకు భయపడి రియల్టర్లు, బిల్డర్లు హైదరాబాద్‌లో కాలు పెట్టడానికి భయపడుతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎన్నోసార్లు ఖజానా ఖాళీ అ య్యిందని చెప్పారని గుర్తుచేశారు. మరి సీఎం పీఠంపై కూర్చున్న తర్వాత లంకె బిందెలు ఉన్నాయని ఎలా అనుకున్నారని ప్రశ్నించారు. ఏడాది కడుపు కట్టుకుంటే రూ.40వేల కోట్లు వస్తాయని, వాటిని సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తానని రేవంత్‌రెడ్డి అంటున్నారన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డికి చెందిన కొత్త అవినీతిని బయటకు తీసుకువస్తానని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అయినా తప్పుడు హామీ లు ఇచ్చే వారిని నమ్మవద్దని ప్రజలను కోరారు.



అస్సాంలో మొక్క నాటుతున్న ప్రకృతి ప్రేమికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత జాదవ్‌పాయంగ్, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో–ఫౌండర్ కరుణాకర్‌రెడ్డి, రితిరాజ్‌పుకాన్

పచ్చని పుడమికి వృక్షవేద్ అరణ్య

- ప్రారంభించిన పద్మశ్రీ జాదవ్, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్
- అస్సాంలోని జోర్హట్ అడవిలో పదివేల మొక్కలు నాటే ప్రణాళిక

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా మొక్కల పెంపకం, పర్యావరణహిత కార్యక్రమాలను చేపట్టిన రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ కుమార్ మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అస్సాంకు చెందిన ప్రముఖ ప్రకృతి ప్రేమికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత జాదవ్ పాయంగ్‌తో కలిసి అస్సాంలో 'వృక్షవేద్ అరణ్య' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పచ్చని భవితకు బాటలు వేసి, పర్యావరణాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అస్సాంలోని జోర్హట్ అటవీ ప్రాంతం అరుణాచల ద్వీపంలో ఉన్న మొలాయికథోనిలో గురువారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వృక్షవేద్ అరణ్యలో భాగంగా పదివేల మొక్కలు నాటబోతున్నట్టు జాదవ్‌పాయంగ్ వెల్లడించారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ కో–ఫౌండర్ కరుణాకర్‌రెడ్డి, రితిరాజ్‌పుకాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాదవ్‌పాయంగ్ మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు మనం అందించే అత్యంత విలువైన సంపద వృక్ష సంపద అని, వృక్షాలను కొట్టివేయకుండా పెంచాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. వృక్షాలు కూడా మనుషులలాగే జీవాలని, అవి తాము బతుకుతూ, మనకు బతుకును ఇస్తున్నాయని, వాటిని కాపాడుకోవడం ప్రతి మనిషి బాధ్యత అని చెప్పారు. గ్రీన్‌ఇండియా చాలెంజ్ ద్వారా సంతోష్‌కుమార్ పర్యావరణానికి చేస్తున్న కృషికి వెలకట్టలేమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలంటూ సంతోష్‌కుమార్ చేస్తున్న ప్రయత్నం విజయవంతమైందని, దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని చెప్పారు.

చెట్లపై జాదవ్‌పాయంగ్ ప్రేమకు నిదర్శనం: సంతోష్‌కుమార్

జాదవ్‌పాయంగ్ వృక్ష వేద అరణ్య కార్యక్రమాన్ని ప్రారంభించడంపై మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ సంతోషం వ్యక్తంచేశారు. చెట్లపై జాదవ్‌పాయంగ్‌కు ఉన్న ప్రేమకు నిదర్శనం ఈ కార్యక్రమం అని అభివర్ణించారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు జరుగుతున్న ప్రయత్నంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పులుల అభయారణ్యం నుంచి పునరావాసానికి

- 94 కుటుంబాల గృహప్రవేశం

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): కవ్వాల్ పులుల అభయారణ్యం నుంచి మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు చెందిన 94 కుటుంబాలకు పునరావాసాల తరలింపు ప్రక్రియ పూర్తయిందని అటవీ సంరక్షణ ప్రధానాధికారి ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు. అటవీ జంతువుల సంరక్షణ, వాటి పునరుత్పాదకత కోసం గ్రామాలను ఖాళీ చేసి పునరావాసాన్ని కల్పించడం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారని తెలిపారు. గురువారం గ్రామస్థులందరూ ఒకేసారి గృహప్రవేశాలు చేశారు. ఈ రెండు గ్రామాలకు చెందిన 142 కుటుంబాలను అధికారులు పునరావాసం కోసం ఎంపిక చేయగా, వీరిలో 48 కుటుంబాలు ఏకమొత్తంగా రూ.15 లక్షల పరిహారానికి అంగీకరించారు. మిగిలిన 94 కుటుంబాలకు అవే రూ.15లక్షల పరిహారంలో భాగంగా ఒక ఇల్లు, వ్యవసాయ భూమిని అందించేందుకు అటవీశాఖ ఒప్పించింది. కవ్వాల్‌కు సమీపంలోనే కొత్త మద్దిపడగలో మొత్తం12.36ఎకరాల్లో అన్ని వసతులతో పునరావాస కాలనీ నిర్మిస్తున్నారు. మరి కొద్దిరోజుల్లో కవ్వాల్ అభయారణ్యంలోని మిగతా గ్రామాలు, అమ్రాబాద్ పులుల అభయారణ్యంలోని 4 పునరావాస గ్రామాల ప్రక్రియ కూడా పూర్తవుతుందని తెలిపారు.



ఖమ్మం జిల్లా దమ్మాయిగూడెం కాంగ్రెస్ ప్రచార సభలో రామసహాయం నరేశ్‌రెడ్డికి నచ్చజెబుతున్న ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి రఘురాంరెడ్డి, మంత్రి పొంగులేటి

కాంగ్రెస్‌లో తన్నులాట

- సిరిసిల్ల జిల్లాలో చెప్పుతో దాడి?
- ఖమ్మంలో భగ్గుమన్న వర్గపోరు

తిరుమలాయపాలెం/సిరిసిల్ల రూరల్, మే 2: కాంగ్రెస్‌లో రోజురోజుకూ వర్గ విభేదాలు తీవ్రమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల తరుణంలో అవి మరింత తీవ్రరూపం దాల్చి ఘర్షణలకు దారితీస్తున్నాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో గురువారం ఓ నాయకుడు మరో నాయకుడిని చెప్పుతో కొట్టినట్టు తెలిసింది. ఖమ్మం జిల్లాలో జరిగిన ప్రచారసభలో ఇద్దరు నేతల మధ్య వాగ్యుద్ధం తీవ్ర రభసకు దారితీసింది. సిరిసిల్ల నియోజకవర్గంలోని తంగళ్లపల్లిలో గురువారం కాంగ్రెస్ నేత వైద్య శివప్రసాద్ నివాసంలో కార్యకర్తలు సమావేశం అయ్యారు. రెండురోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరిన ఇందిరమ్మకాలనీ మాజీ సర్పంచ్ బైరి రమేశ్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆయన్ను చూసిన వెంటనే అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత మధుకర్ ఆగ్రహంతో ఊగిపోయి, రమేశ్‌పై చెప్పు తో దాడి చేసినట్టు సమాచారం.ఖమ్మం జిల్లా దమ్మాయిగూడెంలో గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. సభ ప్రారంభం కాగానే బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేశ్‌రెడ్డి, బీరోలు మాజీ ఉపసర్పంచ్ మిర్యాల విక్రమ్‌రెడ్డి వర్గీయుల మధ్య వాగ్యుద్ధం జరిగింది. విక్రమ్‌రెడ్డిని వేదికపైకి పిలవాలని ఆయన వర్గీయులు నినాదాలు చేయడంతో మంత్రి వేదికపైకి ఆహ్వానించారు. దీంతో రామసహాయం నరేశ్‌రెడ్డి.. 'వాడు పైకి వస్తే నేను వెళ్లిపోతా.. వాడు ప్రసంగించడానికి వీల్లేదు..' అని తెగేసి చెప్పారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి పంచన ఉన్న వాళ్లంతా ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి నాయకులమంటున్నారు' అని వ్యాఖ్యానించారు. వైరి వర్గాల నినాదాలతో సభలో గందరగోళం నెలకొన్నది. ముగ్గురు కార్యకర్తలను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జూలైలో సీఎం రేవంత్‌రెడ్డి జైలుకే

- ఓటుకు నోటు కేసులో శిక్ష తప్పదు
- కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎదురుచూస్తున్నరు
- బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్



కోరుట్ల రూరల్/సారంగాపూర్, మే 2 : ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి శిక్ష తప్పదని, జూలైలో జైలుకు వెళ్లడం ఖాయమని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్, రాత్రి సారంగాపూర్ మండలం పెంబట్లలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జూలై 14న సీఎం రేవంత్‌రెడ్డి జైలుకు పోవడం పక్కా అని, ఆ తేదీ ఎప్పుడు వస్తుం ది? జైలుకు ఎప్పుడు వెళ్తాడా ? అని మంత్రు లు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎదురు చూస్తున్నారని స్పష్టం చేశారు. రేవంత్ జైలుకెళ్లడం ఖాయమని తెలిసే కాంగ్రెస్‌లోని ముఖ్యనాయకులు సంబురాలు చేసుకుంటున్నారని తెలిపారు. 'కాంగ్రెస్ హామీ ఇచ్చినవి ఆరు గ్యారంటీలు కాదు.. అవి ఆరు గాడిద గుడ్లు. గాడిద గుడ్లు మోసినోన్ని ఏమనాలి? నువ్వు ముఖ్యమంత్రివా? గుడ్లు మోస్తున్నవ్.. గాడిద గుడ్డు పెడుతదా?.. గాడిద గుడ్డు ఎన్నడూ పెట్టది.. ఈయన ఎన్నడూ గ్యారెంటీలు ఇవ్వడు. పచ్చి మోసం చేస్తున్నడు' అని మండిపడ్డారు. రేవంత్ తులం బంగారం, నాలుగు వేల పింఛన్, మహిళలకు రూ.2,500, ధాన్యానికి రూ.500 బోనస్, రైతుబంధు రూ.15 వేలు, రూ.2 లక్షల రుణం మాఫీ, నిరుద్యోగ భృతి అని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. ఇవన్నీ ప్రశ్నలు ఎదురవుతాయని బీజేపీ వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు తీసేస్తదని కొత్త నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని ఆరోపించడం అవివేకమ ని విమర్శించారు. కామన్ సివి ల్ కోడ్ అమలైతే దేశ ప్రజలు సురక్షితంగా ఉంటారని, దానిపై కాంగ్రెస్ నాయకులు స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. మోదీ బతికున్నంత వరకు బీసీ,ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తగ్గించడం గానీ, రద్దు చేయడం గానీ జరగదని తెలిపారు. మతతత్వ రిజర్వేషన్లు ఉండవని, ఆర్థికంగా వెనుకబడిన అన్ని కుల, మతాలకు చెందిన వారి కోసం రిజర్వేషన్లు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ముస్లిం రాజ్యం అయిపోయి, దేశం మూడు ముక్కలవుతుందని చెప్పారు. అధికారం ఉంది కదా? అని తప్పు చేస్తే ఎవరైనా జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు.

కాంగ్రెస్‌కు ఓటెయ్యం

- నీళ్లియ్యక గోస పెడుతున్నరు
- మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఏజెన్సీ సరసన్నపల్లివాసుల ఆవేదన

కొత్తగూడ, మే 2 : 'పార్లమెంట్ ఎన్నికల్లో మేం కాంగ్రెస్ పార్టీకి ఓటేయం. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లనే మాకు తాగనీకే నీళ్లియ్యక మస్తు తిప్పలు పెడుతున్నడు. నీళ్ల కోసం మస్తు తక్లీబ్ అయితున్నది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నీళ్ల కోసం మేం రోడ్లమీదికి, చెరువుల కాడికి రాలె. కేసీఆర్ సార్ ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి నీటి సమస్యలు లేకుండా చేసిండు. పదేండ్లలో గింత కూడా తక్లీబ్ కాలేదు' అని మహబూబాబాద్ జిల్లా సరసన్నపల్లి గ్రామానికి చెందిన మహిళలు తమ గోడువెళ్లబోసుకున్నారు. 'కాంగ్రెస్ వచ్చినంక మళ్లీ నీళ్ల కష్టం వచ్చిందని గ్రామస్థులు వాపోతున్నారు. బిందెడు నీటికోసం కిలోమీటర్ల దూరం ఉన్న వ్యవసాయ బావులు, బోర్లు, చెరువులు, కుంటల కాడికి నడిచిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య తీరిస్తే తప్ప పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయమని ముక్త కంఠంతో చెబుతున్నారు.

కంగనపై రైతు సంఘాల భగ్గు

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కంగన రనౌత్‌పై రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 2021-22లో సాగు చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన రైతులను కించపరచినందుకు ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. సంయుక్త కిసాన్ మంచ్ కన్వీనర్ హరీశ్ చౌహాన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ, నాడు జరిగిన రైతు ఉద్యమంలో పాల్గొన్న పంజాబ్ మహిళా రైతును కంగన తప్పుగా చిత్రీకరించి, రైతులను కించపరిచారని చెప్పారు. సీఏఏకు వ్యతిరేకంగా షాహీన్‌బాగ్‌లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న బిల్కిస్ బానో (80)గా ఆ పంజాబ్ రైతును పేర్కొన్నారని చెప్పారు. వాస్తవాలను కొందరు యూజర్లు బయటపెట్టిన తర్వాత కంగన తన ట్వీట్‌ను డిలీట్ చేశారని తెలిపారు.





సీబీఐని కేంద్రం నియంత్రించదు

సుప్రీంలో కేంద్రం వివరణ


న్యూఢిల్లీ: సీబీఐని భారత ప్రభుత్వం నియంత్రించదని సుప్రీం కోర్టుకు కేంద్రం స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన కేసు విచారణలో భాగంగా గురువారం ఈ వివరణ ఇచ్చింది. తమ రాష్ట్రంలో సీబీఐ దర్యాప్తు చేయకుండా సాధారణ సమ్మతిని(జనరల్ కన్సెంట్) ఉపసంహరించుకున్నా .. సీబీఐ ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేస్తున్నదని, దర్యాప్తు చేపడుతున్నదని పేర్కొంటూ బెంగాల్ సర్కారు ఆర్టికల్ 131 కింద కేంద్రంపై కేసు పెట్టింది. దీనిపై కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. కేంద్ర ప్రభుత్వం కేసులు నమోదు చేయదని, సీబీఐ కేసులు నమోదు చేస్తుందని తెలిపారు. సీబీఐ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండదని స్పష్టం చేశారు. ఆర్టికల్ 131ను దుర్వినియోగం చేయకుండా చూడాలని కోర్టుకు విన్నవించారు.

సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో మహిళా కోటా అమలు

న్యూఢిల్లీ, మే 2: సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో మహిళా కోటా అమలుపై గురువారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఎస్సీబీఏ)లో మూడింట ఒక వంతు మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ఆదేశించింది. ఇకపై ఎస్సీబీఏలో ముగ్గురు ఎగ్జిక్యూటివ్ సభ్యులు, ఇద్దరు సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, కోశాధికారి.. అందరూ మహిళలే ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

బీజేపీకి ప్రజ్వల్ పోటు!

- కర్ణాటకలో కమలం పార్టీ ఆశలపై నీళ్లు
- లోక్‌సభ ఎన్నికల్లో సెక్స్ స్కాండల్ ప్రభావం
- వీడియోల గురించి ముందే తెలిసినా జేడీఎస్‌తో పొత్తు పెట్టుకున్న బీజేపీ!
- మహిళా ఓటర్లు దూరమయ్యే చాన్స్
- మే 7న తక్కిన 14 సీట్లకు ఎన్నికలు



బెంగళూరు, మే 2: దక్షిణాదిన 50 సీట్లు సాధించాలని బీజేపీ పెట్టుకున్న లక్ష్యానికి ప్రజ్వల్ రేవణ్ణ రూపంలో భారీ గండి పడింది. కర్ణాటకపై కమలం పార్టీ పెట్టుకున్న ఆశలన్నీ ఒకే దెబ్బకు ఆవిరయ్యాయి. జేడీఎస్‌తో పొత్తు పెట్టుకొని లాభపడాలని అనుకున్న ప్రయత్నాలు పూర్తిగా బెడిసికొట్టాయి. ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ వ్యవహారం బీజేపీకి భారీగా నష్టం చేసే అవకాశం ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మే 7న ఎన్నికలు జరగనున్న కర్ణాటకలోని 14 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ విజయావకాశాలను ఇది దెబ్బతీయవచ్చని, ముఖ్యంగా మహిళా ఓటర్లను బీజేపీకి దూరం చేయవచ్చని భావిస్తున్నారు. ఇదే జరిగితే కర్ణాటకలో బీజేపీ ఈసారి చేదు ఫలితాలను చూడబోతున్నది. గత ఎన్నికల్లో 28 స్థానాల్లో 25 స్థానాలు దక్కించుకొని దాదాపుగా క్లీన్‌స్వీప్ చేసిన కమలం పార్టీకి ఈసారి సీట్ల సంఖ్యలో భారీగా కోత పడే అవకాశం ఉంది.

లాభమెంతో కానీ నష్టమైతే ఎక్కువే

కర్ణాటకలోని మొత్తం 28 సీట్లలో దక్షిణ ప్రాంతంలోని 14 స్థానాలకు రెండో విడతలో పోలింగ్ ముగిసింది. దక్షిణ కర్ణాటకలో ఒక్కళిగ సామాజికవర్గం ప్రభావం ఎక్కువ. మొత్తం కర్ణాటకలో వీరి జనాభా దాదాపు 12 శాతం ఉంటుంది. ఈ సామాజికవర్గంలో దేవెగౌడ కుటుంబానికి మంచి పట్టుంది. ఈ ఎన్నికల్లో కూడా ఒక్కళిక సామాజికవర్గాన్ని ఆకట్టుకోవడం, దక్షిణ కర్ణాటకలో లాభపడాలనే ప్రయత్నంలో భాగంగానే జేడీఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకొని 3 సీట్లు కేటాయించింది. ఈ 3 సీట్లతో పాటు దక్షిణ కర్ణాటకలోని మొత్తం 14 సీట్లకు ఏప్రిల్ 26న పోలింగ్ పూర్తయ్యింది. ఇక్కడ జేడీఎస్‌తో పొత్తు వల్ల బీజేపీకి ఏమేరకు లాభం జరిగిందో కానీ ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతం వల్ల ఎన్నికలు జరగాల్సిన మిగతా 14 నియోజకవర్గాల్లో మాత్రం దారుణంగా నష్టం జరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ప్రజ్వల్ వ్యవహారంపై బీజేపీకి ముందే సమాచారం ఉన్నప్పటికీ జేడీఎస్‌తో పొత్తు పెట్టుకుందని, ప్రజ్వల్‌కు టికెట్ ఇచ్చిందని జరుగుతున్న ప్రచారం బీజేపీకి ఇబ్బందికరంగా మారింది.

పట్టున్న స్థానాల్లో సీన్ రివర్స్

మే 7న మూడో విడతలో కర్ణాటకలోని చిక్కోడి, బెలగావి, బాగల్‌కోట్, బీజాపూర్, గుల్బర్గ, రాయచూర్, బీదర్, కొప్పల్, బళ్లారి, హవేరి, ధార్వాడ్, ఉత్తర కన్నడ, దవనగెరె, శిమొగ్గ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ 14 స్థానాలనూ గత ఎన్నికల్లో బీజేపీ కైవసం చేసుకుంది. లింగాయత్‌ల ప్రభావం ఎక్కువగా ఉండే ఈ స్థానాలపై ఈసారి కూడా బీజేపీకి చాలా ఆశలు ఉండేవి. అయితే ప్రజ్వల్ వ్యవహారంతో ఈ ప్రాంతంలో బీజేపీకి పడే ఓట్లకు భారీగా గండి పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

జేడీఎస్‌లో సంక్షోభం

ప్రజ్వల్ వ్యవహారం కేవలం లోక్‌సభ ఎన్నికల వరకే పరిమితం కాదని, ఆ తర్వాత కూడా కర్ణాటకలో బీజేపీ – జేడీఎస్ రాజకీయ ఆకాంక్షలకు గండి కొట్టిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 136 సీట్లు వచ్చాయి. మ్యాజిక్ ఫిగర్ కంటే ఆ పార్టీకి 23 సీట్లు ఎక్కువే ఉన్నాయి. అయినప్పటికీ అంతర్గత కలహాల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ నేతలు పదేపదే చెబుతూ వస్తున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా సీన్ మారింది. ప్రజ్వల్ వ్యవహారం బీజేపీ, మిత్రపక్షమైన జేడీఎస్‌లో పెను సంక్షోభానికి దారి తీస్తున్నది. ఇది కాంగ్రెస్‌కు కలిసి వస్తుందని విశ్లేషకులు అంటున్నారు.

సర్వేల ముసుగులో లబ్ధిదారుల నమోదు ఆపాలి

అన్ని పార్టీలకు ఈసీ ఆదేశం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రతిపాదిత పథకాల కోసం సర్వేల ముసుగులో ఓటర్ల వివరాలను సేకరిస్తుండటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ) గురువారం తెలిపింది. ఇటువంటి కార్యకలాపాలు ఎన్నికల చట్టాల ప్రకారం అవినీతిగా పరిగణింపబడతాయని చెప్పింది. ఎన్నికల తర్వాత లబ్ధి చేకూర్చే పథకాల కోసం వ్యక్తుల పేర్లను నమోదు చేయడానికి పక్షపాతంతో చేసే పనులకు, చట్టబద్ధమైన సర్వేలకు మధ్యనున్న గీతను మసకబార్చే కార్యకలాపాలకు వీరు పాల్పడుతున్నట్లు గమనించామని తెలిపింది. ఎన్నికల తర్వాత లబ్ధి చేకూర్చే పథకాల కోసం వ్యక్తుల పేర్లను మొబైల్ యాప్, సర్వే, లేదా, ప్రకటనల ద్వారా నమోదు చేయడాన్ని తక్షణమే మానుకోవాలని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు చెప్పింది. ఈ విధంగా పేర్లను నమోదు చేయడం వల్ల ఓటరుకు, ఎన్నికల తర్వాత రాబోతున్నదని ప్రతిపాదించిన లబ్ధికి మధ్య లావాదేవీ సంబంధం ఏర్పడుతుందని, ఓటు వేసే పద్ధతిని ప్రభావితం చేసి ఓ విధంగా 'నీకు ఇది – నాకు అది' అనే ఏర్పాటును సృష్టించవచ్చునని, ఇది ప్రలోభపెట్టడమవుతుందని వివరించింది. అయితే, సాధారణ ఎన్నికల వాగ్దానాలు అనుమతించదగినవేనని స్పష్టం చేసింది.

వాటిపై చర్యలు తీసుకోండి

ఓటర్ల వివరాలను సర్వేల ముసుగులో సేకరించేందుకు ప్రచురించే, ప్రచారం చేసే ప్రకటనలపై చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఫోన్ నంబర్ ఇచ్చి మిస్స్‌డ్ కాల్ ఇవ్వాలని, లేదా, ఫోన్ చేయాలని కోరుతూ ఇచ్చే ప్రకటనలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సాంఘిక–ఆర్థిక సర్వే పేరుతో ఫారాలను పంచిపెట్టి, దానిలో ఓటరు పేరు, రేషన్ కార్డు నంబరు, చిరునామా, ఫోన్ నంబరు, బూత్ నంబరు, బ్యాంక్ అకౌంట్ నంబరు, నియోజకవర్గం పేరు వంటి వివరాలను రాయాలని కోరినా చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఇటువంటి వివరాలను కోరే వెబ్ ప్లాట్‌ఫామ్స్, వెబ్ అప్లికేషన్లు, మొబైల్ యాప్‌లపై కూడా చర్యలకు ఆదేశించింది. కరపత్రాల రూపంలో గ్యారెంటీ కార్డులు ఇచ్చినా కొరడా ఝళిపించాలని చెప్పింది.

2014లో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడిచమురు ధర 113 డాలర్లు.

అప్పుడు దేశీయంగా లీటరు పెట్రోలు ధర రూ.71గా ఉంది.

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడిచమురు ధర 85 డాలర్లు. ఈ లెక్కన లీటరు పెట్రోలు ధర రూ.50కి అటూ ఇటూగా ఉండాలి. అయితే, ప్రస్తుతం లీటర్ పెట్రోల్ రూ. 107గా ఉన్నది.

అంటే లీటర్ పెట్రోల్ ధర ఉండాల్సిన దానికంటే రూ. 57 ఎక్కువగా ఉన్నది. దీనిని బట్టి కేంద్రంలోని బీజేపీ సర్కారు సామాన్యులపై ఎలా ధరాఘాతం మోపుతున్నదో అర్థంచేసుకోవచ్చు.

పెట్రో మంట

పదేండ్ల బీజేపీ ప్రభుత్వహయాంలో ఇంధన ధరలు అంతకంతకూ పైపైకి

- 50 శాతం మేర పెరిగిన పెట్రోల్ ధర
- లీటర్ డీజిల్‌పై 72 శాతం పెంపుదల
- వంటగ్యాస్ సిలిండర్ ధర 114% పైకి
- అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినా.. ఇక్కడ తగ్గించని కేంద్ర సర్కారు
- పదేండ్లలో డీజిల్‌పై 343%, పెట్రోల్‌పై 109 శాతం ఎక్సైజ్ డ్యూటీ వడ్డింపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): పదేండ్ల బీజేపీ ప్రభుత్వహయాంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టినప్పుడు లీటర్ పెట్రోల్ ధర రూ. 71గా ఉంటే ప్రస్తుతం ఇది రూ. 107కు పెరిగింది. అప్పుడు రూ. 55గా ఉన్న లీటర్ డీజిల్ ధర ఇప్పుడు రూ. 95కు చేరింది. ఇండ్లల్లో వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధర 2014లో రూ. 399కే లభించగా.. ఇప్పుడు రూ. 855 ఖర్చుచేసినా దొరకని పరిస్థితి. వెరసి మోదీ ప్రభుత్వహయాంలో పెరిగిన ఇంధన ధరలతో సామాన్యులు కుదేలవుతున్నారు.

తగ్గకపోగా.. బాదుడే బాదుడు

అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినప్పుడు పెట్రోవాతపెట్టిన మోదీ సర్కారు.. ధరలు తగ్గినప్పుడు మాత్రం పెట్రోల్, డీజిల్ రేట్లను తగ్గించట్లేదు. దీంతో సామాన్యులకు అందాల్సిన ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. వివరంగా చెప్పాలంటే.. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గితే, దేశీయంగా పెట్రో ధరలు తగ్గాలి. కానీ కేంద్రం ఇంధన ధరలను పెంచుకుంటూ పోతున్నది. దీనికోసం ఎక్సైజ్ డ్యూటీ పేరిట అదనపు సుంకాలను విధిస్తున్నది. గడిచిన పదేండ్లలో కేంద్రం పెట్రోల్‌పై 109.91 శాతం ఎక్సైజ్ డ్యూటీని పెంచగా, డీజిల్‌పై ఏకంగా 343.82 శాతం పన్ను పెంచింది. ఈ మేరకు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) గణాంకాలు చెప్తున్నాయి. ఫలితంగా ఉక్రెయిన్ యుద్ధం సమయంలో చమురు ధరలు తగ్గినప్పటికీ, దేశీయంగా పెట్రో ధరలు మాత్రం తగ్గలేదు.



పదేండ్లలో ఇంధన ధరల్లో మార్పు ఇలా

ఇంధనం	2014	2024	పెరుగుదల(%)
పెట్రోల్	రూ. 71	రూ. 107	50.7
డీజిల్	రూ. 55	రూ. 95	72
వంటగ్యాస్	రూ. 399	రూ. 855	114

పదేండ్లలో ఎక్సైజ్ డ్యూటీలో మార్పు ఇలా

ఇంధనం	2014	2024	పెరుగుదల(%)
పెట్రోల్	రూ. 9.48	రూ. 19.9	109.9
డీజిల్	రూ. 3.56	రూ. 15.8	343.8

400 మందిపై లైంగిక దాడి!

- ప్రజ్వల్ రేవణ్ణపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- రేపిస్ట్‌కు ఓట్లేయాలన్న ప్రధాని మోదీ దేశంలోని మహిళలందరికీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్



గత నెల 14న ఓ ఎన్నికల ప్రచార సభలో దేవెగౌడ, ప్రజ్వల్‌తో ప్రధాని మోదీ

శివమొగ్గ, మే 2: హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ 400 మహిళలపై లైంగిక దాడికి పాల్పడ్డారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటకలోని శివమొగ్గలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడారు. 'మాస్ రేపిస్ట్'కు ఓట్లేయమని అడిగినందుకు ప్రధాని మోదీ దేశ మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజ్వల్ 400 మందిపై అఘాయిత్యానికి పాల్పడి, వీడియోలు చిత్రీకరించాడని ఆరోపించారు. ఇది సెక్స్ కుంభకోణం కాదని, అతి పెద్ద అత్యాచార ఘటన అని పేర్కొన్నారు. ప్రజ్వల్ చేసిన అసభ్య పనుల గురించి మోదీకి ముందే తెలుసని ఆరోపించారు. 'ప్రతి భారత మహిళను ప్రధాని అవమానించారు. ప్రధాని, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ నాయకులందరూ దేశంలోని ప్రతి మహిళకు క్షమాపణలు చెప్పాలి. ప్రపంచంలో ఏ నాయకుడూ ఇలా లైంగిక దాడులు చేసిన వ్యక్తికి ఎన్నికల ప్రచారం చేయరు' అని రాహుల్ అన్నారు.

ప్రజ్వల్‌పై లుక్ అవుట్ నోటీస్

ప్రజ్వల్‌ను అరెస్ట్ చేసేందుకు లుక్ అవుట్ నోటీస్ జారీ చేసినట్టు కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర గురువారం తెలిపారు. ప్రజ్వల్ లైంగిక వేధింపుల గురించి మరో మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. మరోవైపు జర్మనీకి విమాన ప్రయాణం చేసేందుకు డిప్లొమాటిక్ పాస్‌పోర్ట్ కలిగినవారికి వీసా అవసరం లేదని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ప్రజ్వల్ పాస్‌పోర్ట్ రద్దు గురించి తమకు ఇంకా ఏ కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు.

అన్ని వివరాలు సిట్‌కు చెప్తా

ప్రజ్వల్ సెక్స్ స్కాండల్ వీడియోలపై వివరాలన్నీ సిట్‌కు వెల్లడిస్తానని ప్రజ్వల్ మాజీ డ్రైవర్ కార్తీక్ గుర్తు తెలియని ప్రదేశం నుంచి పంపించిన వీడియో సందేశంలో పేర్కొన్నాడు. తాను బీజేపీ నేత దేవరాజె గౌడకు తప్ప ఇంకెవరికీ ఆ వీడియోలు ఇవ్వలేదని తెలిపాడు. మరోవైపు కార్తీక్ మలేషియాలో ఉన్నాడని.. అతడిని అక్కడికి ఎవరు పంపించారని జేడీ(ఎస్) కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి ప్రశ్నించారు. సెక్స్ స్కాండల్ వీడియోల విడుదల వెనుక రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఆయన సోదరుడు సురేశ్‌ల హస్తం ఉన్నదని ఆరోపించారు. దీన్ని శివకుమార్ ఖండించారు.

ముందస్తు బెయిల్‌కు రేవణ్ణ దరఖాస్తు

ప్రజ్వల్ లైంగిక వేధింపుల కేసులో సహ నిందితుడు, జేడీ(ఎస్) ఎమ్మెల్యే రేవణ్ణ గురువారం ముందస్తు బెయిల్ కోసం బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల కోర్టును ఆశ్రయించారు. రేవణ్ణ బెయిల్ అభ్యర్థనపై ఏమైనా అభ్యంతరాలంటే మే 3 లోగా తెలపాలని కోర్టు సిట్‌ను ఆదేశించింది.

ప్రజ్వల్‌ను కృష్ణుడితో పోల్చిన మంత్రి!

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజ్వల్‌ను శ్రీ కృష్ణుడితో పోలుస్తూ కర్ణాటక అబ్కారీ మంత్రి రామప్ప వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఇలాంటి నీచమైన ఆలోచన దేశంలో ఎక్కడా చూడలేదు. ఆయన తాను గిన్నిస్ రికార్డు నెలకొల్పుతానని అనుకున్నారేమో. ప్రజ్వల్ కృష్ణుడి రికార్డును బ్రేక్ చేయాలనుకున్నారేమో' అని అన్నారు.

బ్రిజ్ భూషణ్ కుమారుడికి బీజేపీ టికెట్

రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్



కరణ్ భూషణ్

న్యూఢిల్లీ, మే 2: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఈసారి టికెట్ దక్కలేదు. ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ నుంచి బ్రిజ్ భూషణ్ స్థానంలో ఈసారి ఆయన కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌ను బీజేపీ బరిలోకి దింపింది. ప్రస్తుతం కరణ్ భూషణ్ సింగ్ ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ ఫెడరేషన్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు. 2009, 2014, 2019లో కైసర్‌గంజ్ నుంచి బ్రిజ్ భూషణ్ ఎంపీగా గెలిచారు. అంతకుముందు ఆయన గోండా నియోజకవర్గం నుంచి రెండుసార్లు, బల్‌రాంపూర్ నుంచి ఒకసారి ఎంపీగా పని చేశారు. 2011 నుంచి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడిగా పని చేసిన బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ రెజ్లర్లు గత ఏడాది ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. దీంతో బ్రిజ్ భూషణ్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. మైనర్‌పై లైంగిక వేధింపులతో ఆరోపణలతో ఆయనపై పోక్సో చట్టం కింద కూడా కేసు నమోదయ్యింది. ఈ నేపథ్యంలో మళ్లీ బ్రిజ్ భూషణ్‌కు టికెట్ ఇస్తే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని బీజేపీ అధిష్ఠానం భావించింది. అయితే, ఈ ప్రాంతంలో బ్రిజ్ భూషణ్‌కు పట్టుండటంతో, ఎన్నికల్లో నష్టం జరగకుండా ఉండేందుకు ఆయన స్థానంలో కుమారుడు కరణ్ భూషణ్‌కు టికెట్ ఇచ్చింది. కైసర్‌గంజ్‌కు ఐదో దశలో మే 20న ఎన్నికలు జరగనున్నాయి.

బీజేపీ తీరు సిగ్గుచేటు: విపక్షాలు

తీవ్రమైన లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌కు బీజేపీ టికెట్ కేటాయించడంపై ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ బీజేపీ దిగజారుడుతనాన్ని బహిర్గతం చేసిందని అనుకుంటుండగానే, బ్రిజ్ భూషణ్ కుమారుడికి టికెట్‌ను బహుమతిగా అందించడం ద్వారా ఇంకా లోతుల్లోకి పతనం అవుతామని బీజేపీ నిరూపించుకుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ.. బ్రిజ్ భూషణ్ టికెట్‌ను అతడి కుమారుడికి ఇవ్వడం ద్వారా మహిళలకు న్యాయం చేస్తున్నట్టు చెప్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ఇది సిగ్గుచేటు అని విమర్శించారు. బ్రిజ్ లైంగిక వేధింపులను ఖండించడానికి బీజేపీ సిద్ధంగా లేదని అర్థమైందని టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ పేర్కొన్నారు.

బెంగాల్ గవర్నర్‌పై లైంగిక ఆరోపణలు

ఫిర్యాదు చేసిన రాజ్‌భవన్ ఉద్యోగిని



ఆనంద బోస్

కోల్‌కతా: ప్రధాని మోదీ బెంగాల్ పర్యటనకు ముందు బీజేపీకి షాక్ తగిలింది. బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ రాజ్‌భవన్‌లో పనిచేస్తున్న తాత్కాలిక మహిళా ఉద్యోగి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆమె ఆయనపై హరే స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఇప్పటికే బెంగాల్ ప్రభుత్వం, గవర్నర్ మధ్య సంబంధాలు దెబ్బతిని ఉండటం, దానికి తోడు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండు రోజుల పర్యటనకు ప్రధాని మోదీ వస్తున్న సమయంలో ఈ పరిణామాలు బీజేపీకి షాక్‌నిచ్చాయి. కాగా, తనపై వచ్చిన ఆరోపణలను గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఖండించారు. ఇది దురుద్దేశంతో అల్లిన కట్టుకథ అని అన్నారు. 'ఒకవేళ ఎవరైనా ఎన్నికల్లో లబ్ధి పొందడానికి నాపై దుష్ప్రచారం చేయొచ్చు. అయితే బెంగాల్‌లో అవినీతి, హింసపై నా పోరాటాన్ని ఆపలేరు' అని ఆయన పేర్కొన్నారు.

ఢిల్లీలో మళ్లీ ఎల్జీ వర్సెస్ ఆప్

- మహిళా కమిషన్‌లో 52 మంది ఉద్యోగులను తొలగిస్తూ ఎల్జీ వీకే సక్సేనా నిర్ణయం
- ఆప్ ఎంపీ స్వాతి మలివాల్ ఆగ్రహం



న్యూఢిల్లీ: ఢిల్లీ మహిళా కమిషన్‌లో పని చేస్తున్న 52 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పంపిన ప్రతిపాదనలను ఆయన ఆమోదించారు. దీంతో అక్రమంగా నియమితులైన కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తున్నట్టు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కమిషన్‌లో 40 పోస్టులు మాత్రమే మంజూరైతే, 223 మందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించారని, నియామక ప్రక్రియ కూడా సరిగ్గా జరగలేదని ఉత్తర్వుల్లో అధికారులు పేర్కొన్నారు. అయితే, 52 మందిని నియమించారని, మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ 52 మందిని విధుల నుంచి తొలగించినట్టు గురువారం పేర్కొన్నారు.

తుగ్లక్ నిర్ణయం: స్వాతి మలివాల్


లెఫ్టినెంట్ గవర్నర్ నిర్ణయాన్ని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ స్వాతి మలివాల్ తప్పుపట్టారు. ఎల్జీ 'తుగ్లక్' ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపించారు. కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తే మహిళా కమిషన్‌కు తాళాలు వేయాల్సి వస్తుందని ఆమె పేర్కొన్నారు. రక్తం, చెమట ధారబోసి మహిళా కమిషన్‌ను నిర్మించామని, దీనికి సిబ్బందిని, రక్షణను ఇవ్వాల్సింది పోయి పునాదుల నుంచి ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. తాను జీవించి ఉన్నన్ని రోజులు కమిషన్‌ను మూతపడనివ్వనన్నారు.

2జీ తీర్పుపై కేంద్రం అభ్యర్థన తిరస్కరణ

న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులపై 2012లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును సవరించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అభ్యర్థనను అనుమతించేందుకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ తిరస్కరించింది. స్పష్టత ఇవ్వాలన్న ముసుగులో తీర్పును సమీక్షించాలని కేంద్రం ప్రయత్నిస్తున్నదని రిజిస్ట్రీ పేర్కొన్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. 2008 జనవరిలో ఏ రాజా టెలికం మంత్రిగా ఉన్న సమయంలో వివిధ సంస్థలకు కేటాయించిన స్పెక్ట్రమ్ లైసెన్సులను రద్దు చేస్తూ 2012లో సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. వేలం ద్వారా మాత్రమే స్పెక్ట్రమ్‌ను కేటాయించాలని కోర్టు తీర్పు చెప్పింది. అయితే ఈ తీర్పు సవరించాలని కేంద్రం కోరుతున్నది.

'ఇండియా కూటమి గెలిస్తే.. బీజేపీ ప్రభుత్వాలు కూలుతయ్'

పానాజీ, మే 2: కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. బీజేపీ నేతృత్వంలోని 10 నుంచి 15 రాష్ట్ర ప్రభుత్వాలు కుప్పకూలుతాయని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక 10వ షెడ్యూల్‌ను సవరించి ఫిరాయింపులను నివారిస్తామని, పార్టీ మారిన వారిని అనర్హులుగా చేస్తామని చెప్పారు. అలా చేయడం వల్ల పార్టీ మారిన వారు అనర్హులై, దొడ్డి దారిన అధికారం చేపట్టిన 10, 15 ప్రభుత్వాలు జూలై నాటికి పడిపోతాయన్నారు. కాగా, కర్ణాటకలోని సెక్స్ స్కాండల్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పాస్‌పోర్టును రద్దు చేసి, అతడిని భారత్ రప్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పవన్ ఖేరా అన్నారు.



'బీజేపీకి 400 సీట్లా?.. అదో జోక్'

న్యూఢిల్లీ, మే 2: ఈ లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు గెల్చుకుంటామని బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ఎద్దేవా చేసింది. 'ఈ ఎన్నికల్లో 400 సీట్లు గెల్చుకుంటామనడం పెద్ద జోక్. ఆ పార్టీ 300 సీట్లు దాటడమే అసాధ్యం. 200 సీట్లు గెలవడం వారికి సవాల్' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో దిగువ సభలో కమలం పార్టీ తప్పక మెజారిటీని కోల్పోతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. గురువారం ఆయన పీటీఐతో మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో బీజేపీకి కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో వచ్చే సీట్లు సున్నా అని, దక్షిణాదిలో ఆ పార్టీ పరిస్థితి 2019 కన్నా అధ్వానంగా ఉందని అన్నారు. ఇక ఉత్తరాదిన సైతం గతంలోలా ఎన్డీఏ సీట్లు తెచ్చుకోవడం అసాధ్యమని అన్నారు.

రాయ్‌బరేలీ బీజేపీ అభ్యర్థిగా దినేష్ ప్రతాప్ సింగ్

అభ్యర్థి పేరు ఇంకా ప్రకటించని కాంగ్రెస్

న్యూఢిల్లీ, మే 2: కాంగ్రెస్‌కు కంచుకోట అయిన యూపీలోని రాయ్‌బరేలీలో బీజేపీ అభ్యర్థిగా దినేష్ ప్రతాప్ సింగ్ పేరును ఆ పార్టీ గురువారం ప్రకటించింది. కాగా, నామినేషన్ల తుది గడువుకు ఇంకా 24 గంటలే ఉన్నప్పటికీ ఇక్కడ పోటీ చేసే అభ్యర్థిని కాంగ్రెస్ ఇంతవరకూ ప్రకటించ లేదు. కాంగ్రెస్ మాజీ ఎంఎల్‌సీ అయిన దినేష్ ప్రతాప్ సింగ్ దేశ ప్రజలకు అంతగా తెలియక పోయినా యూపీ ప్రజలకు చిరపరిచితుడే. ఆయన 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై పోటీ చేసి ఓటమి చెందారు. అయితే ఈసారి అభ్యర్థి ఎవరైనా గెలుపు మాత్రం తనదేనంటూ దినేష్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో అమేథీలో అమలు చేసిన వ్యూహాన్నే రాయ్‌బరేలీలో కూడా అమలు చేయాలని బీజేపీ భావిస్తున్నది.

జార్ఖండ్ కాంగ్రెస్ 'ఎక్స్' ఖాతా సస్పెండ్

రాంచీ, మే 2: అమిత్ షా నకిలీ వీడియో కేసుకు సంబంధించి వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నాయకులకు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీచేస్తున్నారు. తాజాగా జార్ఖండ్ కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' (ట్విటర్) ఖాతా సస్పెండ్ అయ్యింది. చట్టపరమైన చర్యల్లో భాగంగా జార్ఖండ్ కాంగ్రెస్ 'ఎక్స్' ఖాతాను సస్పెండ్ చేసినట్టు 'ఎక్స్' ఈ మేరకు తెలిపింది. వీడియోను షేర్ చేసిన వారిలో ఉన్నందున జార్ఖండ్ కాంగ్రెస్ చీఫ్ రాజేశ్ ఠాకూర్‌కు ఢిల్లీ పోలీసుల నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఆయనపై పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా నమోదుచేశారు.

వెదిరె.. రాతలెందుకు దండుగ?

'ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించాలని వెదిరె శ్రీరాం చేసిన ప్రతిపాదనను తెలంగాణ పక్కన పెట్టిందనే కారణంతోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై అక్కసును వెళ్ల గక్కుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయవిచారణ కొనసాగుతున్న తరుణంలోనే వ్యాసాల పేరిట కథనాలను వండివార్చుతున్నారు. సాక్ష్యాలు, అభిప్రాయాలు ఉంటే కమిషన్‌కు అందజేయవచ్చు. ఆ మేరకు ప్రభుత్వం పబ్లిక్ నోటీస్ జారీ చేసింది. అయినా ఆ పని చేయకుండా.. ప్రాజెక్టుపై విషం చిమ్ముతున్నారు. ఇప్పటికే అనేకసార్లు, అనేక మంది లేవనెత్తిన అంశాలనే, ప్రశ్నలనే మళ్లీ మళ్లీ సంధిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనితీరుపై, కృత్రిమ జలాశయాల నిర్మాణంపై తనకు ఏపాటి అవగాహన ఉందో తన వ్యాసాలతో శ్రీరాం తనంతట తానే బయటపెట్టుకున్నారు.' - హైదరాబాద్, మే2 (నమస్తే తెలంగాణ)



కృత్రిమ జలాశయాలు కొత్తేమీ కాదు..

జలాశయాలను నదుల్లో కాకుండా ఊళ్లలో నిర్మించడం ఇంజినీరింగ్ సూత్రాలకు విరుద్ధమని మల్లన్నసాగర్‌ను ఉద్దేశించి శ్రీరాం గారు వ్యాఖ్యానిస్తున్నారు. ఇవి ఊళ్లలో నిర్మించినవి కాదు. గుట్టలను అనుసంధానం చేస్తూ నిర్మించిన కృత్రిమ జలాశయాలు. ఎత్తిపోతల సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత నదులపై మాత్రమే జలాశయాలు నిర్మించాలని చెప్పడం విచిత్రం. ప్రాణహిత –చేవెళ్ల డీపీఆర్‌పై సూచనలు చేస్తూ సీడబ్ల్యూసీనే 160 టీఎంసీల నీటిని తరలించే ప్రాజెక్టులో తగినంత నిల్వ సామర్థ్యం లేదని చెపుతూ ఆన్ లైన్ జలాశయాల సామర్థ్యాన్ని పెంచుకోమని, కృత్రిమ జలాశయాలు నిర్మించుకోమని ప్రభుత్వానికి సూచించింది. ఉమ్మడి ప్రభుత్వం ఆ సూచనని బేఖాతరు చేసింది. కేసీఆర్ ప్రభుత్వం ఆ సూచన ఆధారంగా జలాశయాల నిల్వ సామర్థ్యాన్ని 14 నుంచి 147 టీఎంసీలకు పెంచింది. అందులో భాగంగా మల్లన్నసాగర్ నిల్వ సామర్థ్యాన్ని 1.5 నుంచి 50 టీఎంసీలకు పెంచింది. కాళేశ్వరం ప్రాజెక్టులో 62శాతం ఆయకట్టు, హైదరాబాద్ నగర తాగునీటి సరఫరా మల్లన్నసాగర్‌పైన ఆధారపడింది కాబట్టి అక్కడ 50 టీఎంసీల జలాశయం అవసరమని ఇంజినీరింగ్ నిపుణులు భావించారు. ఇక నదులపై కాకుండా కృత్రిమ జలాశయాలు నిర్మించడం ఇది మొదటిసారి కాదు. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రాయలసీమలో నిర్మించిన భారీ జలాశయాలన్నీ కృత్రిమ జలాశయాలే. కండలేరు– 68టీఎంసీలు, గోరకల్లు 10టీఎంసీలు, వెలిగొండ 41 టీఎంసీలు, వెలుగోడు 17టీఎంసీలు, బ్రహ్మంగారి మఠం 17టీఎంసీలు, అవుకు 7టీఎంసీలు, అలుగునూరు 3టీఎంసీలు.. ఈ జలాశయాలన్ని నదులు లేని చోట నిర్మించినవి కావా? వాటిపై ఎవరూ ఎన్నడూ ప్రశ్నించిన దాఖలాల్లేవు. ఇవ్వాళ తెలంగాణ అదే పని చేస్తుంటే ఇంజినీరింగ్ సూత్రాలకు విరుద్ధమని విమర్శిస్తున్నారు. భారీ ఎత్తిపోతలకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ సూత్రీకరణకు విలువే లేదు. ఎత్తిపోతల పథకాల్లో పెద్ద జలాశయాల నిర్మాణం అత్యవసరం. అందుకే మల్లన్నసాగర్‌ను 50 టీఎంసీలతో నీటి సరఫరా అవసరాల రీత్యా రీ డిజైన్ చేయడం తప్పనిసరైంది. శ్రీరాం వాపోయినట్టు గోదావరి నదిపై నిల్వ సామర్థ్యం లేకపోవచ్చు కానీ గోదావరి బేసిన్‌లో ఇప్పుడు తెలంగాణ అవసరాలకు తగినంత నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాలు ఉన్నాయి. కాళేశ్వరం పరిధి, దాని కింద సమ్మక్కసాగర్ 7 టీఎంసీలు, సీతమ్మసాగర్ 36 టీఎంసీలు (నిర్మాణంలో ఉన్నది) మొత్తం 371టీఎంసీల నిల్వ సామర్థ్యమున్నది. అవసరం ఏర్పడినప్పుడు ఈ జలాశయాలను నింపడానికి కాళేశ్వరం వ్యవస్థ సిద్ధంగా ఉన్నది. కాబట్టి గోదావరిపై పెద్ద స్టోరేజి రిజర్వాయర్ లేదని శ్రీరాం వాపోవడంలో అర్థం లేదు.

న్యాయవిచారణ కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు కదా!

పత్రికల్లో పనిగట్టుకుని వ్యాసాలు అవసరమా..?

ఇది న్యాయవిచారణను ప్రభావితం చేసే ప్రయత్నమే..

అందులోనూ శ్రీరాం వ్యక్తిగత అభిప్రాయాలే తప్ప ఏవీ లేవు

కాళేశ్వరం ప్రాజెక్టు పనితీరుపై అవగాహనా రాహిత్యం..

విద్యాసాగర్‌రావు సూచనలతోనే మేడిగడ్డ ఎంపిక

కృత్రిమ జలాశయాలు కొత్తేమీ కాదు..సీమలోనూ ఉన్నాయి

తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్

న్యాయవిచారణను ప్రభావితం చేయాలనే..

కాళేశ్వరంపై ఇప్పటికే మూడు రకాలైన విచారణలు కొనసాగుతున్నాయి. 1) నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ విచారణ 2) రాష్ట్ర విజిలెన్స్ విభాగం విచారణ 3) జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ న్యాయ విచారణ. ఇప్పుడు వాటన్నింటినీ తలదన్నే కేంద్ర మంత్రి సలహాదారుడి విచారణ ఆంధ్రజ్యోతి పత్రిక ద్వారా జరుగుతున్నది. పైన పేర్కొన్న 3రకాలైన విచారణలకు నీటి పారుదలశాఖ ఇంజినీర్లు, ఉన్నతాధికారులు హాజరై వారడిగిన ప్రశ్నలకు ఇప్పటికే జవాబులు ఇచ్చారు. వేల పేజీల సమాచారాన్ని అందించారు. ఇప్పుడు శ్రీరాం తన విచారణలో అవే ప్రశ్నలు సంధిస్తున్నారు. అన్ని చట్టబద్ధ విచారణలు.. ముఖ్యంగా సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ కొనసాగుతున్న ఈ సమయంలో ఈయన విచారణ అవసరమున్నదా..? ఈయన గారికున్న విచారణార్హత ఏమిటి ? ఇదంతా పీసీ ఘోష్ న్యాయ విచారణను ప్రభావితం చేయడానికి కాకపోతే మరేమైనా ప్రయోజనమున్నదా? కేంద్ర మంత్రి సలహాదారులు వెదిరె శ్రీరాం చేయవలసింది న్యాయవిచారణ కాదు. జస్టిస్ ఘోష్ కమిషన్‌కు వ్యక్తిగత హోదాలో తన వద్ద ఉన్న సాక్ష్యాధారాలతో ఒక నివేదికను సమర్పించడం. ఆ రకంగా కమిషన్‌కు సహకరించడం. వివిధ సంస్థలు, వ్యక్తుల నుంచి ప్రభుత్వం నివేదికలను ఆహ్వానిస్తూ వివిధ పత్రికల్లో నీటిపారుదలశాఖ ప్రత్యేక పబ్లిక్ నోటీస్ జారీ చేసింది. ఈ పబ్లిక్ నోటీస్ వెదిరె శ్రీరాం దృష్టికి రాలేదనుకోడానికి వీలు లేదు. ఈ వ్యాసపరంపర ఉద్దేశం వేరు కాబట్టి తెలంగాణ ఇంజినీర్ల మీద తానే ఒక విచారణ కమిషనర్‌గా ప్రశ్నలు సంధిస్తున్నారు. ఆయన సంధించిన ప్రశ్నలకు స్పందించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను అవమానపరచడం భావ్యం కాదు. కమిషన్ విచారణ పరిధిలోని అంశాలను ప్రాజెక్టు ఇంజినీర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కమిషన్‌కు వివరించే పని ఎట్లాగూ చేస్తారు. వాటిని ఇంజినీర్లకు వదిలి వేయడం ఉత్తమం. అయితే ఈ వ్యాస పరంపరలో వెల్లడవుతున్న వెదిరె ఆలోచనల డొల్లతనాన్ని ఎత్తి చూపాల్సిన అవసరం మాత్రం ఎంతో ఉన్నది.

అమాయకత్వం.. అవగాహన రాహిత్యం..

2019లో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించిన నాటి నుంచి ఎత్తిపోసిన నీటి వివరాలు పొందుపరుస్తూ ఏటా 180 టీఎంసీల చొప్పున ఈ ఐదేండ్లలో 900 టీఎంసీల నీటిని ఎత్తి పోయాల్సి ఉండగా కేవలం 162.36 టీఎంసీలే ఎత్తిపోశారని శ్రీరాం ప్రశ్నిస్తున్నారు. ఇది కేంద్ర మంత్రికి సలహాదారుడు అడగవలసిన ప్రశ్న కానే కాదు. ఆ ప్రశ్న అడిగిండంటేనే ఆయనకు కాళేశ్వరం పని తీరు, నీటిని ఎత్తిపోసే విధానం మీద అసలే అవగాహన లేదని అర్థమవుతున్నది. అందుకే మళ్లీ వివరిస్తాను.

కాళేశ్వరం ప్రాజెక్టులో ఎత్తిపోతల ప్రక్రియ

3 మార్గాల ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశాలు కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థలో ఉన్నాయి. మొదటిది శ్రీరాంసాగర్‌కు వరద వచ్చినప్పుడు వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు, కాకతీయ కాలువ ద్వారా దిగువ మానేరు చేరతాయి. ఈ స్థితిలో కాళేశ్వరం లింక్ 1 పంపులు (మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి), లింక్2 పంపులు (ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు) తిప్పే అవసరం రాదు. ఇక రెండో స్థితి శ్రీరాంసాగర్‌కు వరద రాకున్నా ఎల్లంపల్లికి కడెం నది నుంచి, శ్రీరాంసాగర్ ఎల్లంపల్లికి మధ్యనున్న పరివాహాక ప్రాంతం నుంచి వరద వచ్చే అవకాశముంది. ఈ స్థితిలో కాళేశ్వరం లింక్1 పంపులు తిప్పే అవసరం రాదు. ఎల్లంపల్లి నుంచే లింక్ 2 పంపులు తిప్పి నీటిని మిడ్‌మానేరుకు చేరవేస్తారు. అక్కడి నుంచి ఎగువకు అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ దాకా ఎత్తిపోస్తారు. ఇక మూడోది పై రెండుచోట్ల నీటిలభ్యత లేని సందర్భాల్లో మాత్రమే లింక్ 1, లింక్ 2 పంపులను తిప్పాల్సి వస్తుంది. ఇక ప్రాజెక్టు ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 2దశల ఆయకట్టు, నిజామాబాద్ జిల్లాలో ఉన్న లక్ష్మి కాలువ కింద ఉన్న ఆయకట్టు, నిర్మల్ జిల్లాలో ఉన్న సరస్వతీ కాలువ ఆయకట్టు, అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాల కింద నిజాంసాగర్ ఆయకట్టు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉన్న చిన్న ఎత్తిపోతల పథకాల ఆయకట్టు, మిషన్ భగీరథ అవసరాలు ఈ రివర్స్ పంపింగ్ స్కీమ్ ద్వారా తీరుతాయి. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న మొత్తం 10వేలకు పైగా చెరువులు, చెక్ డ్యాంల కిందనున్న ఆయకట్టు స్థిరీకరణకు నికరంగా నీరందించడానికి కాళేశ్వరం భరోసా ఇస్తున్నది. ఇది ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా రైతాంగం అనుభవంలోకి వచ్చింది. కాళేశ్వరం రూపకల్పన సమయంలో ప్రభుత్వం ఆశించింది కూడా ఇదే. అయితే 2019 నుంచి వరుసగా భారీ వర్షాలు పడుతుండడంతో వానకాలం పంట కాలానికి మేడిగడ్డ నుంచి ఎత్తిపోసే అవసరం అతి తక్కువ సందర్భాలలో మాత్రమే ఏర్పడింది. కాబట్టే ఎత్తిపోసిన నీటి పరిమాణం తగ్గింది. ఇక ప్రతీ ఏటా 195(180 కాదు) టీఎంసీలు మేడిగడ్డ నుంచి ఎత్తిపోసే అవసరం ప్రతీసారి రాదు. ఇక రెండోది కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రతిపాదించిన కొత్త ఆయకట్టు ఇంకా అభివృద్ధి దశలో ఉన్నది. ఏ ప్రాజెక్టులోనైనా ఆయకట్టు క్రమంగా కాలువల వ్యవస్థ ఉనికిలోకి వస్తున్నా కొద్దీ పెరుగుతుందే కానీ ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ పూర్తి కాగానే మొత్తం ఆయకట్టు సాగు నీరివ్వడం జరగదు. ఏ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలోనైనా మొదట హెడ్ వర్క్స్ .. అంటే డ్యాంలు, బరాజ్‌లు, స్పిల్‌వే గేట్లు, జలాశయాలు, ఎత్తిపోతల పథకాలు అయితే పంప్‌హౌస్‌లు, సర్జిపూల్స్, విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లు, డెలివరీ సిస్టర్న్‌లు తదితర అనుబంధ నిర్మాణాలు పూర్తి చేస్తారు. వీటి పైననే ప్రభుత్వాలు ప్రథమ ప్రాధాన్యత కింద నిధులు ఖర్చు చేస్తాయి. ఎందుకంటే ఇవి నిర్మాణం కాకుండా ఆయకట్టుకు నీరివ్వలేం. వాటి తర్వాతనే ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణంపై ఖర్చు చేస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణమైన నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, జూరాల తదితర ప్రాజెక్టుల్లో కూడా జరిగింది ఇదే. 1963లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగితే హెడ్‌వర్క్స్ పూర్తయిన తర్వాతనే 1975లో.. 11 ఏండ్ల తర్వాత మొదటిసారి 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీటి విడుదల చేశారు. దశల వారీగా ఆయకట్టు పెరుగుతూ పోయింది తప్ప ఒక్కసారే మొత్తం ఆయకట్టు సాగులోకి రాలేదు. 2008–09 నాటికి ఆయకట్టు 9లక్షల ఎకరాలకు చేరుకున్నదన్న వాస్తవాన్ని శ్రీరాం లాంటి వారు గుర్తించాలి. అన్ని ప్రాజెక్టుల్లో కూడా ఇదే ప్రక్రియ కొనసాగింది. కాళేశ్వరం హెడ్‌వర్క్స్ పూర్తి కాగానే ఏటా 900 టీఎంసీలు ఎందుకు ఎత్తిపోయ లేదని శ్రీరాం అడిగిన ప్రశ్న చిన్నపిల్లలు అడిగే అమాయకపు ప్రశ్న కాక మరేమిటి.

విద్యాసాగర్‌రావు సూచనలతోనే మేడిగడ్డ ఎంపిక

గోదావరిపై ఎక్కువ నిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టు అవసరమని శ్రీరాం అంటున్నారు. మేడిగడ్డ స్థలం అనుకూలమైనదే అని అంటూనే భారీ ప్రాజెక్టు కట్టకుండా చిన్న బ్యారేజీ కట్టి తప్పు చేశారని అంటున్నారు. ఆయన దృష్టంతా ఇచ్చంపల్లి మీదనే ఉన్నది. గోదావరిపై భారీ నిల్వ సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు సాధ్యం కాదని శ్రీరాం గారికి తెల్వక పోవడం విచిత్రం. ఇచ్చంపల్లి చరిత్ర ఆయనకు తెలియదని అనుకోలేం. కఠినమైన పర్యావరణ, అటవీ చట్టాలులేని కాలంలోనే భారీ నిల్వ సామర్థ్యమున్న ఇచ్చంపల్లి, పోలవరం ప్రాజెక్టులను పబ్లిక్ డిమాండ్ ఉన్నప్పటికీ ఆనాటి ప్రభుత్వాలు సాకారం చేయలేకపోయినాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో భారీగా అటవీ భూములు, వందలాది గ్రామాల ముంపు, పునరావాసం సమస్యల కారణంగా పైరాష్ట్రాలు అంతరాష్ట్ర ఒప్పందంపై సంతకాలు చేసి కూడా నిరాకరించాయి. ఇచ్చంపల్లి ప్రాజెక్టును తొలుత 112.77 మీటర్ల ఎఫ్‌ఆర్ఎల్‌తో మొత్తం నిల్వసామర్థ్యం 366 టీఎంసీలు, నికర నిల్వ సామర్థ్యం 151టీఎంసీలతో నిర్మించడానికి డీపీఆర్ సిద్ధం చేశారు. అయితే అంతే స్థాయిలో ముంపు కూడా ఉండడంతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఒప్పుకోలేదు. ఆ తర్వాత ప్రాజెక్టు ఎత్తును 95 మీటర్లకు తగ్గిస్తూ మొత్తం నిల్వ సామర్థ్యం 60 టీఎంసీలు, నికర నిల్వ సామర్థ్యం 20.70టీఎంసీలతో మరో డీపీఆర్ తయారైంది. మహారాష్ట్రలో ముంపు గణనీయంగా తగ్గినా ఛత్తీస్‌గఢ్‌లో ముంపు బాగా ఉండడంతో ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పుకోలేదు. దీంతో అది మూలన పడింది. మరో విషయం ఏమంటే 83 మీటర్ల ఎత్తు వద్ద నిర్మించిన తుపాకుల గూడెం బరాజ్ నీరు కొద్దిగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వాగుల్లోకి పోవడం వలన 50 ఎకరాల భూమి మాత్రమే మునుగుతుంది. అంతదానికి కూడా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఎన్‌వోసీ ఇవ్వడం లేదు. 152 మీటర్ల ఎత్తు వద్ద తుమ్మిడిహట్టి వద్ద మహారాష్ట్రలో 5 వేల ఎకరాలు ముంపు బారిన పడతాయి. దానికి కూడా మహారాష్ట్ర మొండికిపోయిన అనుభవం మనకున్నది. ఈ సమస్యలున్న నేపథ్యంలోనే గోదావరి మీద కృష్ణా బేసిన్‌లో సాధ్యమైనట్టు భారీ జలాశయాలు కట్టడం దుర్లభమైంది. ఆ సమస్యను అధిగమించడానికి ప్రముఖ ఇంజినీర్, ఐక్య రాజ్య సమితి సలహాదారు హనుమంతరావు 'స్టెప్ ల్యాడర్ టెక్నాలజీ' పేరిట గోదావరిపై వరుస బరాజ్‌లను ప్రతిపాదించారు. అందులో మేడిగడ్డ స్థలానికి అతి దగ్గరలో ఉన్న పెద బెల్లాల స్థలం కూడా ఒకటి. ఈ బరాజ్‌ల్లోని నీరు గోదావరి నదిలోనే నిల్వ ఉంటాయి. కాబట్టి ముంపు, పునరావాసం అతితక్కువ. అయితే ఆనాటి ప్రభుత్వాలు ఆ ప్రతిపాదనను పక్కన పెట్టాయి. కేసీఆర్‌కు హనుమంతరావు ప్రతిపాదనలపై అవగాహన ఉంది. కాబట్టి తుమ్మిడిహట్టికి ప్రత్యామ్నాయాలు వెతికే క్రమంలో ఆయన పెదబెల్లాల స్థలాన్నీ పరిశీలించారు. అదే మేడిగడ్డ బ్యారేజి స్థలం. ఇక్కడ చాలా మందికి తెలియని అంశం ఒకటి చెప్పాలి. మేడిగడ్డ, ఇచ్చంపల్లి స్థలాల్లో ఏది ఉత్తమమైనది ? అనే చర్చ కూడా కేసీఆర్ జరిపారు. ఆ చర్చలో ఆనాటి ప్రభుత్వ సలహాదారు ఆర్ విద్యాసాగర్‌రావు, నేను పాల్గొన్నాను. ఆ చర్చ సందర్భంగా విద్యాసాగర్‌రావు చాలా స్పష్టంగా మేడిగడ్డ వైపునకే మొగ్గు చూపారు. ఇచ్చంపల్లి వద్ద 1978లో కుదిరిన అంతరాష్ట్ర ఒప్పందం ఎంత లోపభూయిష్టమైనదో వివరించారు. బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను తిప్పలు పడి ఒప్పించినా ప్రధానమంత్రి మోదీకి చెప్పి తెలంగాణ పుట్టక ముందే ఖమ్మం జిల్లాలో ఏడు మండలాలు, సీలేరు జలవిద్యుత్ కేంద్రాన్ని లాక్కున్న కట్టర్ తెలంగాణ వ్యతిరేకి చంద్రబాబు పరిపాలనలో ఉన్న ఏపీని ఒప్పించడం దుర్లభం అని చెబుతూ మేడిగడ్డ వద్ద బరాజ్‌కు ఒక్క మహారాష్ట్రతో ఒప్పందం చేసుకుంటే సరిపోతుందని సూచించారు. దానితో కేసీఆర్ కూడా సంతృప్తి చెంది మేడిగడ్డ స్థలం వద్ద బరాజ్ నిర్మాణానికి సర్వే చేయించమని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత చరిత్ర అందరికీ తెలిసిందే.



వరదాయిని కాళేశ్వరం

ఆంధ్రజ్యోతిలో వెదిరె శ్రీరాం రాసిన కాళేశ్వరంపై వ్యాసాలకు వీ ప్రకాశ్ కౌంటర్

ఇచ్చంపల్లి వ్యామోహంతోనే శ్రీరాం అక్కసు..

ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తున్నదంటే శ్రీరాం గారికి ఇచ్చంపల్లి స్థలం మీదున్న వ్యామోహానికి సకారణం ఏదీ లేదని చెప్పడానికే. గోదావరి జలాల వినియోగంపై ఆయన ఒక పుస్తకాన్ని కూడా ప్రచురించారు. అందులో ఆయన గోదావరి, ప్రాణహిత నదుల సంగమ ప్రదేశానికి కొద్ది దిగువన కాళేశ్వరం వద్ద ఒక మేజర్ డ్యామ్‌ను 115మీటర్ల ఎఫ్‌ఆర్ఎల్‌తో నిర్మించాలని ప్రతిపాదించారు. అక్టోబర్ 2018లో వరంగల్‌లో 'గోదావరీ జలాల సమగ్ర వినియోగం : సమస్యలు, పరిష్కారాలు' అన్న అంశంపై జరిగిన సదస్సులో చేసిన ప్రసంగంలో ఆయన అన్న మాటలు గుర్తుకు వస్తున్నవి. అప్పటికే మేడిగడ్డ బరాజ్ నిర్మాణం ప్రారంభమైంది. తన ప్రతిపాదనలను కేసీఆర్ పక్కనబెట్టినట్టు ఆ సదస్సులో అక్కసును వెళ్లగక్కారు. మగ్గులో నుంచి బకెట్లోకి నీరు తోడిపోస్తున్న చందంగా ఉందని, తక్కువ సామర్థ్యంతో కాళేశ్వరం బరాజ్ నిర్మించి 50టీఎంసీల సామర్థ్యమున్న మల్లన్నసాగర్‌కు నీటిని ఎత్తిపోయడం వింతగా ఉందని, మల్లన్నసాగర్‌లాంటి జలాశయాలను నదుల్లో కట్టకుండా ఊళ్లల్లో కట్టడం ఇంజినీరింగ్ సూత్రాలకు విరుద్ధమని అన్నట్టు ఆనాడు పత్రికలు రిపోర్ట్ చేశాయి. విచిత్రంగా మే2న అచ్చయిన నాలుగో వ్యాసంలో అవే అంశాలు లేవనెత్తారు. శ్రీరాం గారిని అప్పటి హాంగోవర్ ఇంకా వదిలిపెట్టినట్టు లేదు. వారి ప్రతిపాదనలను తెలంగాణ ఇంజినీర్లు అధ్యయనం చేస్తే కండ్లు బైర్లు గమ్మే వాస్తవాలు వెల్లడయ్యాయి. 115మీటర్ల వద్ద తెలంగాణలో 53,352 ఎకరాలు, మహారాష్ట్రలో 27,911 ఎకరాలు, మొత్తం 81,263 ఎకరాలు విస్తీర్ణంలో ముంపు ఉంటుందని అంచనా వేశారు. (మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టులో సేకరించవలసిన భూమి 55,800 ఎకరాలు) తెలంగాణ ఇంజినీర్ల అధ్యయనం ప్రకారం 115మీటర్ల కాంటూర్ లైన్ దక్షిణకాశీగా పేరుగాంచిన కాళేశ్వరం దేవాలయం మెట్ల వరకు వస్తుంది. గుడి మాత్రమే ముంపులో ఉండదు. సిరొంచా పట్టణం చుట్టూ నీరు నిలిచి ఉంటుంది. నిజాం జామానాలో గుట్టపై కట్టిన గెస్ట్‌హౌజ్ తప్ప ఏదీ మిగలదు. మహదేవపూర్, మంథని పట్టణాల దగ్గరికి నీరు వస్తుంది. చెన్నూర్ పట్టణానికి ముంపు బెడద తప్పదు. ఇక పూర్తిగా ముంపుకు గురయ్యే గ్రామాలు తెలంగాణలో 51, మహారాష్ట్రలో 21, పాక్షికంగా ముంపుకి గురయ్యే గ్రామాలు తెలంగాణలో 20, మహారాష్ట్రలో 31, ఊళ్లు మిగిలి కేవలం భూములు మాత్రమే ముంపు బారిన పడుతున్న గ్రామాలు తెలంగాణలో 12, మహారాష్ట్రలో 7. ఇక 115 మీటర్ల వద్ద డ్యాం వల్ల ప్రభావితమవుతున్న మొత్తం గ్రామాలు తెలంగాణలో 83, మహారాష్ట్రలో 59. ఇరు రాష్ట్రాల్లో మొత్తం 142 గ్రామాలు. ఈ ముంపు మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు ముంపుతో పోల్చినప్పుడు చాలా చాలా ఎక్కువ. ఇప్పుడున్న కఠినమైన పర్యావరణ, అటవీ చట్టాల నేపథ్యంలో ఇంత పెద్ద ఎత్తున ముంపుతో ప్రాజెక్టుని కట్టడం సాధ్యమేనా శ్రీరాం గారు ? పైగా ప్రాచీన, దక్షిణకాశీగా పేరుగాంచిన కాళేశ్వరాన్ని, తాలూకా కేంద్రమైన సిరొంచ పట్టణాన్ని కోల్పోవడానికి తెలంగాణ, మహారాష్ట్రాలు సిద్ధపడే అవకాశముందా? ఇది చాలా హాస్యాస్పదమైన ప్రతిపాదనని ఆనాడే తెలంగాణ ఇంజినీర్లు భావించారు. ఇంత హాస్యాస్పదమైన ప్రతిపాదనను అమాయాకుడు, సహృదయుడు, ఆనాటి కేంద్ర రైల్వే సహాయ మంత్రి బండారు దత్తాత్రేయతో తెలంగాణ ముఖ్యమంత్రికి లేఖ రాయించడం వెదిరే వారికే చెల్లింది.

మల్లన్నసాగర్‌పై అవగాహన రాహిత్యం..

ఇక మేడిగడ్డ వద్ద 100 మీటర్లు ఎఫ్ఆర్ఎల్ వద్ద 16టీఎంసీల నిల్వ నుంచి 50 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన మల్లన్నసాగర్ జలాశయాన్ని ఎట్లా నింపుతారు ? ఇది మగ్గులో నుంచి బకెట్లోకి నీరు తోడిపోస్తున్న చందంగా ఉందని శ్రీరాం గారు తన వ్యాసంలో ఎద్దేవా చేశారు. ఇక్కడ కూడా తన అవగాహనారాహిత్యాన్ని బయట పెట్టుకున్నారు. 40 ఏండ్ల గోదావరి ప్రవాహాలను పరిశీలిస్తే మేడిగడ్డ వద్ద నుంచి సరాసరి ప్రతీ సంవత్సరం 1650 టీఎంసీల నీరు నికరంగా ప్రవహిస్తున్నది. జూన్ నుంచి మార్చి దాకా నీటి ప్రవాహాలు ఉంటాయని సీడబ్ల్యూసీ వారి లెక్కలే చెబుతున్నాయి. సరాసరి జూన్‌లో 51, జూలైలో300, ఆగస్టులో607, సెప్టెంబరులో 424, అక్టోబరులో 176, నవంబరులో 39, డిసెంబరులో 17, జనవరిలో12 , ఫిబ్రవరిలో11 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని తెలుస్తున్నది. ఇంతకంటే ఎక్కువ ప్రవాహాలున్న సంవత్సరాలు కూడా ఉన్నాయి. జూన్‌లో ఒక టీఎంసీ, జూలై నుంచి అక్టోబరు దాకా రోజుకు 2టీఎంసీలు తోడుకోవడానికి ఎటువంటి ఇబ్బందుల్లేవు. నవంబరులో ఒక టీఎంసీ, డిసెంబరు నుంచి ఫిబ్రవరి దాకా అర టీఎంసీ తోడుకోవడానికి గోదావరిలో ప్రవాహాలుంటాయి. గోదావరిలో సంవత్సరానికి కనీసం 9నెలలు నీటిని తోడుకోవడానికి ప్రవాహాలు ఉంటాయని సీడబ్ల్యూసీ లెక్కలు నిర్ద్వందంగా తేల్చి చెబుతున్నాయి. కాబట్టి మేడిగడ్డ వద్ద 16టీఎంసీల చిన్న జలాశయం నుంచి కూడా మల్లన్నసాగర్ తదితర జలాశయాలను నింపుకోవడానికి ఉన్న అవకాశాలపై ఎటువంటి అనుమానాలు ఉండాల్సిన అవసరం లేదు. ధవళేశ్వరం బరాజ్ నిల్వ సామర్థ్యం 3టీఎంసీలు. బరాజ్ నుంచి తరలించే నీరు 150 టీఎంసీలకు పైబడే ఉంటుంది. బ్యారేజీల నిల్వ సామర్థ్యానికి, తరలించే నీటికి పోలిక పెట్టడం అశాస్త్రీయం. 16టీఎంసీల మేడిగడ్డ జలాశయం నుంచి 195టీఎంసీల నీటిని ఎత్తిపోయడం సాంకేతికంగా అసాధ్యం ఏమీ కాదు. దానికి ఎక్కువ నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయమే అవసరం లేదు. నదిలో ప్రవాహాలున్నాయా? లేదా అన్నదే ప్రామాణికం. నిజానికి మల్లన్నసాగర్‌కు నీరు ఎత్తిపోసేది 25టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న మిడ్‌మానేరు జలాశయం నుంచి అన్న సంగతి శ్రీరాం గమనించకపోవడమే ఒక అభాస.

డబ్బులున్నోళ్లకే కాంగ్రెస్ టికెట్లు

- **దళిత సంఘం రాష్ట్ర నాయకుడు కంసాల శ్రీనివాస్ ఆరోపణ**



పెద్దపల్లి టౌన్, మే 2: కాంగ్రెస్ పార్టీ డబ్బులున్నోళ్లకే టికెట్లు కేటాయించిందని దళిత సంఘం రాష్ట్ర నాయకుడు కంసాల శ్రీనివాస్ ఆరోపించారు. పారిశ్రామిక వేత్తలకే ఎంపీ టికెట్లు కేటాయించడం దారుణమని అన్నారు. గురువారం ఆయన పెద్దపల్లిలో మీడియాతో మాట్లాడారు. అనేక పార్టీల్లో బొంగరం మాదిరిగా, నిలకడలేకుండా తిరిగిన గడ్డం వివేక్ వెంకటస్వామి.. కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యే అయ్యారని, ఇప్పుడు ఆయన ఒక్క కుటుంబానికే మూడు టికెట్లు కేటాయించి మాదిగ జాతిని కాంగ్రెస్ అవమానించిందని విమర్శించారు. వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ అధిష్ఠానికి రూ.500 కోట్లు ఇచ్చి టికెట్లు కొనుగోలు చేశాడని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ దళిత వ్యతిరేక పార్టీలని, అందులో సామాజిక న్యాయం కొరవడిందని విమర్శించారు. తాము బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కే మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. నేతకాని సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్ల రాజమల్లు మాట్లాడుతూ రాజకీయ ఓనమాలు తెలియని గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ టికెట్ కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

40% ఫిట్‌మెంట్ వర్తింపజేయండి

పీఆర్సీ కమిటీకి రెవెన్యూ ఉద్యోగ సంఘాల వినతి

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగులకు 40 శాతం ఫిట్‌మెంట్ వర్తింపజేయాలని పీఆర్సీ కమిటీకి రెవెన్యూ ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు శివ శంకర్ నేతృత్వంలోని వేతన సవరణ కమిటీతో.. గురువారం ట్రెసా, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. తమ విజ్ఞప్తులకు కమిటీ సానుకూలంగా స్పందించిందని నేతలు తెలిపారు. సమావేశంలో ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షులు బాణాల రాంరెడ్డి, నిరంజన్ రావు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి. డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌పాల్గొన్నారు.



ఇసుక ట్రాక్టర్ బోల్తా

డ్రైవర్ కాలితొడలో ఇరుక్కున్న చెట్టుకొమ్మ

మానవపాడు, మే 2 : అతివేగం యువకుడి ప్రాణం మీదకు తెచ్చిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. మద్దూరు గ్రామానికి చెందిన మాలిక్ (28) సొంత ట్రాక్టర్‌పై ఇసుక నింపుకొని మానవపాడు బయలుదేరాడు. అమరవాయి గ్రామ శివారులోకి రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. మాలిక్ కుడి కాలి తొడ భాగానికి చెట్టుకొమ్మ కుచ్చుకొన్నది. స్థానికులు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై చంద్రకాంత్ వచ్చాక కొమ్మని రంపం తో కట్ చేశారు. ఇంకా తొడ భాగంలో కొమ్మ ఉండటంతో కర్నూల్ దవాఖానకు తరలించారు.



అనంతపురం జిల్లా పామిడి వద్ద కంటైనర్లను తనిఖీ చేస్తున్న పోలీసులు

నాలుగు లారీల్లో 2 వేల కోట్ల నగదు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): అనంతపురంలో 4 కంటైనర్ల నిండా రూ.5 వందల నోట్లతో కూడిన రూ.2 వేల కోట్ల కరెన్సీని పోలీసులు పట్టుకున్నారు. అనంతపురం జిల్లా పామిడి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కంటైనర్లలో భారీగా కరెన్సీని గుర్తించారు. పట్టుకున్న కరెన్సీ వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు.కాగా కరెన్సీని కొచ్చి నుంచి హైదరాబాద్‌లోని ఆర్‌బీఐ కార్యాలయానికి నాలుగు ప్రైవేట్ బ్యాంకుల వారు డిపాజిట్ చేసేందుకు తీసుకెళ్తున్నట్టు సమాచారం.

సమ్మక్కసాగర్ బరాజ్‌కు ఎన్‌వోసీ ఇవ్వండి

హైదరాబాద్, మే2 (నమస్తే తెలంగాణ): గోదావరి నదిపై ములుగు జిల్లాలో నిర్మిస్తున్న తుపాకులగూడెం బరాజ్ (సమ్మక్క సాగర్) కింద ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు అవసరమైన నిధులను జమచేస్తామని, తక్షణమే ఆ బ్యారేజీకి ఎన్‌వోసీని ఇవ్వాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శికి తెలంగాణ నీటిపారుదల కార్యదర్శి రాహుల్‌బొజ్జా ప్రత్యేకంగా లేఖ రాశారు. ఎస్ఆర్ఎల్ ప్రకారమే ముంపునకు గురయ్యే భూములకే భూసేకరణ చట్టం–2013 ప్రకారం పరిహారం ఇస్తామని, ఆ నిధులను బీజాపూర్ జాయింట్ కలెక్టర్ వద్ద జమచేస్తామని వెల్లడించింది.

ఈసీ అనుమతించినా పరిహారానికి నో!

మొదటిపేజీ తరువాయి...

ప్రతి ఎకరాకు రూ. 10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

ఎన్నికల కోడ్ అడ్డం

నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రులు తెలిపారు. ప్రస్తుతం కోడ్ అమల్లో ఉన్న కారణంగా పంపిణీ చేయలేకపోతున్నామని, ఎన్నికల సంఘం నుంచి అనుమతి రాగానే పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ మేరకు అనుమతి కోరుతూ ఈసీకి ప్రభుత్వం లేఖ కూడా రాసింది. స్పందించిన ఈసీ పరిహారం పంపిణీకి అనుమతినిచ్చింది. ఇప్పటికే పది రోజులు గడిచినా ప్రభుత్వం మాత్రం పంపిణీకి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రూ.15 కోట్లు కూడా లేవా?

అకాల వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 15,812 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఎకరాకు రూ. 10 వేల చొప్పన పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి రూ. 15.81 కోట్లు అవసరమవుతాయి. ఈసీ అనుమతినిచ్చినా ఇంకా పంపిణీ చేయకపోవడంతో ప్రభుత్వం మొత్తం ఈ కొద్దిపాటి మొత్తం కూడా లేదా? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లేదంటే కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే పరిహారం పంపిణీ చేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

పదోన్నతులకు తొలగనున్న 'టెట్' అడ్డంకి?

- పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు వెల్లడి
- ఉపాధ్యాయ నేతలకు ఎన్‌సీటీఈ సభ్యకార్యదర్శి హామీ



ఎన్‌సీటీఈ సభ్య కార్యదర్శి కేసంగ్‌వైషెర్పకు వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) అర్హత సమస్యకు పరిష్కారం త్వరలోనే లభించనున్నదని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తెలిపారు. టెట్ నుంచి ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) సభ్య కార్యదర్శి కేసంగ్ వైషెర్పకు విజ్ఞప్తి చేశారు. ఎస్‌జీటీ, పీఎస్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ నుంచి జీహెచ్‌ఎంగా పదోన్నతి పొందడానికి టెట్ ఉత్తీర్ణత అవసరం లేదని, ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందడానికి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అని తెలిపారు. టెట్ అర్హత పొందడానికి ఐదేండ్ల గడువు అనుమతించే విషయంలో సూచనలు జారీ చేస్తామని సభ్యకార్యదర్శి హామీ ఇచ్చినట్టు పీఆర్‌టీయూ నాయకులు తెలిపారు. ఈ విషయమై ఎన్‌సీటీఈ సభ్యకార్యదర్శిని కలువడానికి యూఎస్‌పీసీ, జాక్టో నేతలు గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లినట్టు సంఘ నాయకులు జంగయ్య, చావ రవి తెలిపారు. వారితోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏ నర్సిరెడ్డి కూడా ఢిల్లీకి వస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు దోస్త్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీలలో మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్ తెలంగాణ (దోస్త్-2024) నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేయనున్నట్టు గురువారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు.

జూన్ 8న రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): జూన్ 1న జరగాల్సిన రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ డెహ్రాడూన్ ప్రవేశ పరీక్షను జూన్ 8కి వాయిదా వేసినట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్‌నికోలస్ తెలిపారు. హాల్‌టికెట్లను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

టెట్ వాయిదా వేయండి

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఈ నెల 27న ఉన్నందున టెట్ వాయిదా వేయాలని ఎన్నికల సంఘం విద్యాశాఖకు గురువారం ఆదేశాలు జారీ చేసింది. టెట్ ఈ నెల 20 నుంచి జూన్ 3 వరకు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో పరీక్షలు నిర్వహించరాదని విద్యాశాఖ నిర్ణయించినట్టు సమాచారం. మిగతా పరీక్షలు యధాతథంగా కొనసాగించాలని నిర్ణయించారు.

వైటీడీఏ దివ్య విడిదిలో అపచారం!

- మాంసాహారంతో విందు భోజనం ఏర్పాటు
- ఇకపై నాన్‌వెజ్‌ను అనుమతించమన్న అధికారులు

యాదగిరిగుట్ట, మే 2 : పవిత్ర యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థాన పరిధిలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన వైటీడీఏ దివ్య విడిది (ప్రెసిడెన్సియల్ విల్లా)లో మాంసాహార భోజనం కలకలం రేపింది. గురువారం దివ్య విడిది కాటేజీలోని ఆడిటోరియంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమ నేత దాచూరి రామిరెడ్డి 8వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 33 జిల్లాలకు చెందిన ప్రతినిధులతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొన్నారు. మధ్యాహ్నం జెన్‌కో విల్లాలో దేవస్థాన నిబంధనలకు విరుద్ధంగా చికెన్‌తో కూడిన భోజనాలు ఏర్పాటు చేశారు. ఇది చూసిన కొంతమంది ఉపాధ్యాయ సంఘం నాయకులు అవాక్కయ్యారు. పవిత్ర పుణ్యక్షేత్రం పరిధిలో చికెన్ పెట్టడమేంటని విస్తుపోయారు. వైటీడీఏ అధికారులతో మాట్లాడితే దివ్య విడిది పేరుతో ఆడిటోరియాన్ని ప్రైవేట్ కార్యక్రమాలకు ఇస్తున్నామని తెలిపారు. చికెన్ వడ్డించినట్టు తమ దృష్టికి వచ్చిందని, ఇక నుంచి మాంసాహారాన్ని అనుమతించబోమని స్పష్టం చేశారు.

సజ్జనార్‌తో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ భేటీ

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఉన్నతాధికారులతో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్‌ఓవెన్ భేటీ అయ్యారు. టీఎస్‌ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం, టెక్నికల్ సపోర్ట్, అప్ గ్రేడింగ్ స్కిల్స్, ట్రైనింగ్‌పై ప్రధానంగా చర్చించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు


హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువును ఈనెల 4వరకు పొడిగించినట్టు గురువారం ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ శ్రుతి ఓజా తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లింపునకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, పేమెంట్ గేట్‌వే, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ వంటి సదుపాయాలు వినియోగించుకోవాలని సూచించారు.

జేఈఈ టాపర్లకు 'ఆకాశ్' అభినందనలు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ) : జేఈఈ మెయిన్ ఫలితాలలో ఆలిండియా క్యాటగిరీలో రాష్ట్రానికి చెందిన సాయిదివ్యతేజారెడ్డి 15వ ర్యాంకు, రిషిశేఖర్ శుక్లా 19వ ర్యాంకు సాధించడం పట్ల ఆకాశ్ ఇనిస్టిట్యూట్ అభినందనలు తెలిపింది. వీరిద్దరూ హైదరాబాద్‌లోని ఆకాశ్ అందించిన రెండేండ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో ప్రవేశం పొందారని పేర్కొన్నది.



సాయి దివ్యతేజారెడ్డి



రిషిశేఖర్ శుక్లా

20.13 కోట్లను విడుదల చేయండి: కేఆర్‌ఎంబీ లేఖ

హైదరాబాద్, మే2 (నమస్తే తెలంగాణ): 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బోర్డు నిర్వహణకు తన వాటాగా రూ.20.13కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కేఆర్‌ఎంబీ గురువారం లేఖ రాసింది. బోర్డు నిర్వహణకు నిధులను ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు సమాన వాటా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది బడ్జెట్‌కు ఇటీవల నిర్వహించిన బోర్డు సమావేశంలో ఈ ఆర్థిక సంవత్సరానికి 23.17కోట్ల బడ్జెట్‌కు ఆమోదించారు. రెండేండ్లుగా తెలంగాణ తన వాటా బడ్జెట్‌ను చెల్లించడం లేదు. ఆ మొత్తం కలిపి 20.13కోట్లను వెంటనే చెల్లించాలని బోర్డు లేఖ రాసింది.

'పాలస్తీనా' ఆందోళనలు ఉద్రిక్తం

- అమెరికా యూనివర్సిటీల్లోకి ప్రవేశించిన పోలీసు బలగాలు
- వందలాది మంది విద్యార్థుల అరెస్టు
- పోలీసులు - విద్యార్థుల మధ్య ఘర్షణ
- కాలిఫోర్నియా వర్సిటీలో తీవ్ర ఉద్రిక్తత



వాషింగ్టన్ యూనివర్సిటీలో నిరసనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

లాస్ ఏంజెల్స్, మే 2: అమెరికాలోని యూనివర్సిటీల్లో పాలస్తీనాకు అనుకూలంగా జరుగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. నిరసనలను అడ్డుకునేందుకు వర్సిటీల్లోకి పోలీసులు ప్రవేశించడంతో పోలీసులు – విద్యార్థులకు మధ్య ఘర్షణలు తలెత్తాయి. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 17న కొలంబియా యూనివర్సిటీలో ఆందోళనలు ప్రారంభమై వివిధ విశ్వవిద్యాలయాలకు వ్యాపించిన సంగతి తెలిసిందే. గాజాలో తక్షణం కాల్పులు విరమించాలని, ఇజ్రాయెల్‌తో పాటు గాజాపై యుద్ధానికి మద్దతు ఇచ్చిన కంపెనీలతో యూనివర్సిటీలు సంబంధాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు విశ్వవిద్యాలయాల కేంద్రంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో లాస్ ఏంజెల్స్‌లోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల నిరసనకారుల శిబిరంపై బుధవారం రాత్రి ముసుగులు ధరించిన కొందరు ఇజ్రాయెల్ మద్దతుదారులు దాడి చేశారు. శిబిరం వద్ద బారికేడ్లను తొలగించి, పేప్పర్ స్ప్రేను వెదజల్లారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరిగి 15 మంది గాయపడ్డారు. తమపై దాడి జరుగుతుంటే పోలీసులు అడ్డుకోలేదని, సకాలంలో స్పందించలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

వందలాది మంది అరెస్టు

వర్సిటీలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో శిబిరాన్ని ఖాళీ చేయాలని పోలీసులు పిలుపునివ్వగా విద్యార్థులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున వందలాది సంఖ్యలో పోలీసు బలగాలు వర్సిటీ క్యాంపస్ లోపలికి ప్రవేశించి బారికేడ్లు, శిబిరాలను తొలగించే ప్రయత్నం చేయడంతో విద్యార్థులు ప్రతిఘటించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. టియర్ గ్యాస్‌ను, పేప్పర్ స్ప్రేను తట్టుకునేలా నిరసనకారులు సర్జికల్ మాస్కులను, అద్దాలను ధరించారు. రబ్బర్ బుల్లెట్లను ఎదుర్కొనేందుకు ప్లైవుడ్‌తో రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. హెల్మెట్లు ధరించారు. పోలీసులు స్టన్ గ్రెనేడ్లను ప్రయోగించారు. పలువురు విద్యార్థులను బలవంతంగా అదుపులోకి తీసుకొని, నిరసన శిబిరాలను తొలగించారు. మరోవైపు పోర్ట్‌ల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ, కొలంబియా యూనివర్సిటీ, విస్కాన్సిన్ యూనివర్సిటీ, బ్రౌన్ యూనివర్సిటీల్లోనూ పోలీసులు 90 మంది నిరసనకారులను అరెస్టు చేసి నిరసన శిబిరాలను తొలగించారు. కాగా, ఇప్పటివరకు అమెరికాలోని 30 యూనివర్సిటీలు, కళాశాలల్లో దాదాపు 1,600 మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వియత్నాంపై యుద్ధానికి వ్యతిరేకంగా దశాబ్దాల క్రితం జరిగిన ఆందోళనల తర్వాత మళ్లీ ఈ స్థాయిలో అమెరికాలోని యూనివర్సిటీల్లో ఆందోళనలు జరగడం ఇదే మొదటిసారి. ఆందోళనల కారణంగా ఇప్పటికే పలు విశ్వవిద్యాలయాలు తాత్కాలికంగా మూతబడ్డాయి.

నిరసనలతో విధానాలు మార్చుకోం: బైడెన్

యూనివర్సిటీల్లో నిరసనలపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం స్పందించారు. ప్రజాస్వామ్యానికి భిన్నాభిప్రాయాలు అవసరమని, అయితే, ఇది శాంతిభద్రతలకు విఘాతం కలించేలా ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. వర్సిటీల్లో నిరసనలు యుద్ధంపై, మధ్యప్రాచ్యంలో తమ విధానాలను మార్చుకునేలా, పునరాలోచించేలా ప్రేరేపించవని ఆయన స్పష్టం చేశారు.

స్థానిక చట్టాలను గౌరవించండి: విదేశాంగ శాఖ

అమెరికా యూనివర్సిటీల్లో ఆందోళనపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఇప్పటివరకు ఎంబసీని, కాన్సులేట్లను విద్యార్థులెవరూ సహాయం కోరలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. స్థానిక చట్టాలు, నిబంధనలను భారత పౌరులంతా గౌరవించాలని ఆయన కోరారు. ప్రతి ప్రజాస్వామ్యంలో భావప్రకటన స్వేచ్ఛ, బాధ్యత, ప్రజాభద్రత, శాంతిభద్రతల మధ్య సమతుల్యత ఉండాలని పేర్కొన్నారు.



లగేజీ అనుమతిలో కోత

- ఎయిర్ ఇండియా నిర్ణయం

న్యూఢిల్లీ, మే 2: డొమెస్టిక్ ప్రయాణికుల లగేజీ అనుమతిలో కోత విధిస్తూ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా నిర్ణయం తీసుకుంది. గతంలో ఎకనామీ కంఫర్ట్ ప్రయాణికులకు 20 కేజీల లగేజీతో ప్రయాణించేందుకు అనుమతి ఉండగా ఇప్పుడు 15 కిలోలకు తగ్గించింది. ఎకనామీ కంఫర్ట్ ప్లస్ క్లాస్ ప్రయాణికులకు ఇంతకుముందు 25 కిలోలకు అనుమతి ఉండగా ఇప్పుడు 15 కిలోలకు తగ్గించింది. బిజినెస్ కంఫర్ట్ ప్లస్ ప్రయాణికులకు గతంలో 35 కిలోల వరకు లగేజీతో ప్రయాణం చేసే వీలుండేది. ఇప్పుడు 25 కిలోలకు పరిమితి విధించింది. బిజినెస్ ఫ్లెక్స్ ప్రయాణికులకు ఇంతకుముందు 40 కేజీల లగేజీకి అనుమతి ఉండేది. ఇప్పుడు 35 కేజీలకు తగ్గించింది. ఈ నిర్ణయం మే 2 నుంచి అమలులోకి వస్తుందని ఎయిర్ ఇండియా పేర్కొన్నది.

భారత్, చైనాకు జెనోఫోబియా

అందుకే ఆ దేశాల్లో ఆర్థిక ఒడిదొడుకులు: బైడెన్

వాషింగ్టన్, మే 2: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భా రత్, రష్యా, చైనా దేశాలపై విరుచుకుపడ్డారు. భారత్, చైనా, జపాన్, రష్యాలు 'జెనోఫోబిక్' (విదేశీయుల పట్ల విద్వేషం, భయం) దేశాలంటూ విమర్శించారు. భారత్ సహా ఆ దేశాలేవీ వలసదారులను ఆమోదించటం లేదని, దీంతో ఆ దేశాల ఆర్థిక అభివృద్ధిని 'జెనోఫోబియా' అడ్డుకుంటున్నదని అన్నారు. బుధవారం వాషింగ్టన్‌లో పార్టీ నిధుల సేకరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, 'చైనా ఆర్థికం దారుణంగా మారింది. జపాన్ అనేక ఇబ్బందుల్లో ఉంది. భారత్, రష్యా ఆర్థిక సమస్యల్లో ఉన్నాయి? ఎందుకంటే వాటికి 'జెనోఫోబిక్' ఉంది కాబట్టి. వలసదారులను అంగీకరించటం లేదు. వలసదారులతోనే దేశం మరింత బలోపేతమవుతుంది' అని బైడెన్ చెప్పారు. 'అమెరికా వలసదారులకు ఆహ్వానం పలుకుతున్నది కాబట్టే, ఆర్థికంగా వృద్ధి సాధిస్తున్నది' అని ఆయన అన్నారు.

కిమ్ సుఖం కోసం ఏటా 25 మంది కన్యలు!



న్యూఢిల్లీ: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌ను సంతోషపెట్టడానికి ఏటా 25 మంది కన్యలను ఎం పిక చేస్తారనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ 25 మంది కన్యల బృందాన్ని 'ప్లెజర్ స్క్వాడ్' అని పిలుస్తారు. వీరిని ఎంపిక చేసేటపుడు అందంతోపాటు కుటుంబ నేపథ్యాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఆ దేశం నుంచి తప్పించుకుని పారిపోయిన యువతి యూన్మి పార్క్ బయటపెట్టిన సంచలన విషయాల్లో ఇదొకటి. ఈ కిమ్ ప్లెజర్ స్క్వాడ్ కోసం తాను కూడా రెండు సార్లు ప్రయత్నించానని, అయితే తన కుటుంబ నేపథ్యం కారణంగా తాను ఎంపిక కాలేదని ఆమె చెప్పారు.



వరద నీటి కారణంగా దుబాయ్‌లోని ఓ వీధిలో నిలిచిపోయిన ఓ కారు

దుబాయ్‌ని మళ్లీ ముంచెత్తిన వానలు

పలు విమాన, బస్ సర్వీసులు రద్దు

దుబాయ్, మే 2: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని దుబాయ్‌ని గురువారం మరోసారి భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో పలు ప్రాంతాలు భారీ వరద నీటితో నిండిపోయాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షాల కారణంగా దుబాయ్, అబుదాబి, షార్జాలలో పలు విమాన, బస్ సర్వీసులను రద్దు చేశారు. కొన్ని విమానాలను దారి మళ్లించారు. అబుదాబిలోని చాలా వీధుల్లో వరద నీరు నిలిచిపోయింది. రాత్రి మూడు గంటల నుంచే ఉరుములు, బలమైన ఈదురుగాలులతో భారీ వాన ప్రారంభమైనట్టు దుబాయ్ మీడియా వెల్లడించింది.

ఉడుకుతున్న ఊటీ

- *సాధారణం కంటే 5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు*
- *38 ఏండ్ల తర్వాత ఇదే గరిష్ఠం*

ఊటీ: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి పర్యాటకులు ఊటీ వంటి ప్రదేశాలకు వెళ్తుంటారు. అయితే వేసవి విడిది కేంద్రమైన ఊటీలోనే ఈ ఏడాది ఎండలు భయపెడుతున్నాయి. ఈ హిల్ స్టేషన్‌లో ఏప్రిల్ 29న 29 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే 5.4 డిగ్రీలు ఎక్కువని ప్రాంతీయ వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. అలాగే మే 1న సాధారణం కంటే 5.1 డిగ్రీలు ఎక్కువ నమోదైంది. 1986 ఏప్రిల్ 29న 28.5 డిగ్రీలు నమోదైందని, 38 ఏండ్ల తర్వాత ఆ రికార్డు బద్ధలైందని ఆయన చెప్పారు. అయితే రాత్రి వేళలో మాత్రం వాతావరణం చల్లగానే ఉండటం టూరిస్టులకు ఊరటనిచ్చే విషయం.

కొవిడ్ టీకా సర్టిఫికెట్‌లో మోదీ ఫొటో మాయం

- కొవిషీల్డ్ సైడ్‌ఎఫెక్ట్స్ విషయం తెలియగానే తొలగించారు
- సోషల్ మీడియాలో నెటిజన్లు
- లోక్ సభ ఎన్నికల కోడ్ వల్లే తొలగించాం: కేంద్రం



న్యూఢిల్లీ: కొవిషీల్డ్ వ్యాక్సిన్‌తో సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయన్న సంగతి బయటకు వచ్చిన నేపథ్యంలో 'కొవిడ్ వ్యాక్సిన్ సర్టిఫికెట్'లో ప్రధాని మోదీ ఫొటో మాయమవడం లోక్‌సభ ఎన్నికల వేళ చర్చనీయాంశమైంది. తాజాగా కొవిడ్ టీకా సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసుకున్నవారు.. ప్రధాని మోదీ ఫొటో అందులో లేకపోవటాన్ని గుర్తించారు. 'ఎక్స్' వేదికగా పలువురు యూజర్లు ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. కొవిషీల్డ్ వ్యాక్సిన్‌తో సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయని బ్రిటన్ కోర్టు ముందు 'ఆస్ట్రాజెనికా' (టీకా తయారీ కంపెనీ) అంగీకరించటమే ఇందుకు కారణమని పలువురు యూజర్లు అభిప్రాయపడ్డారు. దీనిపై కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం స్పందించింది. ఎన్నికల కోడ్‌లో భాగంగా కొవిడ్ సర్టిఫికెట్ నుంచి ప్రధాని మోదీ ఫొటోను తొలగించినట్టు తెలిపింది.

కొవిషీల్డ్‌తో బిడ్డ మృతి.. సీరంపై తల్లిదండ్రుల దావా!

భారత్‌లో 2021లో కొవిషీల్డ్ టీకా తీసుకున్న ఓ అమ్మాయి.. కొద్ది రోజుల తర్వాత మరణించింది. ఆ అమ్మాయి తల్లిదండ్రులు ఇప్పుడు 'సీరం ఇన్‌స్టిట్యూట్'కు వ్యతిరేకంగా కోర్టులో దావా వేసేందుకు సిద్ధమవుతున్నారు. టీకా పంపిణీకి అనుమతించిన కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుబడుతూ గతంలో కొంతమంది తల్లిదండ్రులు కూడా కోర్టును ఆశ్రయించారు. బ్రిటన్ కోర్టులో ఆస్ట్రాజెనికా ప్రకటనతో, భారత్‌లో బాధిత తల్లిదండ్రుల వాదన మరోసారి తెరపైకి వస్తున్నది.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి : గుజరాత్ కాంగ్రెస్ చీఫ్

కరోనా వైరస్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల్ని మోదీ సర్కార్ పాటించలేదని, టీకా సైడ్ ఎఫెక్ట్స్‌తో అనేకమంది గుండెపోటు, పక్షవాతం బారినపడుతున్నారని గుజరాత్ కాంగ్రెస్ చీఫ్, ఎంపీ శక్తిసిన్హ్ గోహిల్ ఆరోపించారు. టీకా సంబంధిత మరణాల కేసుల్లో బాధిత కుటుంబాలకు కేంద్రం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొవాగ్జిన్ పూర్తి సురక్షితం

భారత్ బయోటెక్ వివరణ



హైదరాబాద్, మే 2(నమస్తే తెలంగాణ): కొవిడ్ వ్యాక్సిన్లపై పరిశోధనలు, సామర్థ్యంపై అనుమానాలు తలెత్తుతున్న నేపథ్యంలో భారత్ బయోటెక్ గురువారం స్పందించింది. 'సేఫ్టీ ఫస్ట్' (రక్షణకే తొలి ప్రాధాన్యం) అనే నినాదంతో తాము కొవాగ్జిన్‌ను తయారు చేశామని తెలిపింది. సామర్థ్యాన్ని రెండో ప్రాధాన్య అంశంగా ఎంచుకున్నామని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం' కింద తయారై, దేశంలో అన్ని రకాల పరీక్షలు పూర్తి చేసుకున్న ఏకైక వ్యాక్సిన్ కొవాగ్జిన్ అని పేర్కొన్నది. లైసెన్స్ పొందే క్రమంలో 27 వేల పరీక్షలను ఎదుర్కొన్నట్టు చెప్పింది. వేలాది మందిపై క్లినికల్ ట్రయల్స్‌ను అత్యంత పకడ్బందీగా నిర్వహించామని, కేంద్ర వైద్యారోగ్య శాఖ నిరంతరం పర్యవేక్షించిందని తెలిపింది. అందుకే ఇప్పటివరకు కొవాగ్జిన్‌కు సంబంధించి ఎలాంటి దుష్ప్రభావాలు కనిపించలేదని, రక్తం గడ్డ కట్టడం, థ్రాంబోసైటోపెనియా, టీటీఎస్, వీఐటీటీ, పెరికార్డియాటిక్స్ వంటివి నమోదు కాలేదని చెప్పింది.



చిన్న మొక్కలతో ఒత్తిడి చిత్తు

కార్యాలయాలు, పనిచేసే ప్రదేశాల్లో ఒత్తిడికి గురవుతున్నారా? అయితే ఈ సలహా మీ కోసమే. మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు పని ప్రదేశాల్లో చిన్నచిన్న మొక్కలు పెంచాలని పరిశోధకులు సూచిస్తున్నారు. దీని వల్ల ఒత్తిడి తగ్గుతుందని చెబుతున్నారు. పని ప్రదేశాల్లో మొక్కలు పెంచడం వల్ల చాలామంది ఒత్తిడిని జయించారని జపాన్‌లోని హ్యోగో యూనివర్సిటీ పరిశోధకుడు మసాహిరో ఉవాచ. సుమారు 63 మంది ఉద్యోగులు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. వర్కర్స్ డెస్క్ వద్ద చిన్న మొక్కలను ఉంచి వారిలో జరుగుతున్న మార్పులను అధ్యయనం చేశారు. అలసట అనిపించే సమయంలో డెస్క్ వద్ద మూడు నిమిషాలు కూర్చోవాలని బృందం సూచించింది. మొక్కలను చూశాక వారిలో ప్రశాంతత నెలకొనడంతోపాటు పనిలో వేగం పెరిగినట్టు గుర్తించింది. అదే సమయంలో మొక్కలు లేని స్థలంలో ఉద్యోగుల పని తీరును కూడా గమనించింది. ఇరువురి మధ్య చాలా వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. కంప్యూటర్ల దగ్గర ఒకటీ అరా మొక్కలు ఉంచిన వాళ్లలో పనితనం పెరిగిందని మసాహిరో మాట. మొత్తంగా ఆఫీస్‌లో చిన్నచిన్న ఇండోర్ ప్లాంట్స్ పెంచడం వల్ల ఒత్తిడి చిత్తయి పనిమంతులు అనిపించుకునే అవకాశం ఉందన్నమాట!

ఆనపకాయ మంచూరియా



కావాల్సిన పదార్థాలు

ఆనపకాయ తురుము: ఒక కప్పు, **మైదా:** నాలుగు టేబుల్ స్పూన్లు, **కార్న్ ఫ్లోర్:** ఒక టేబుల్ స్పూను, **గోధుమపిండి:** మూడు టేబుల్ స్పూన్లు, **అల్లం వెల్లుల్లి పేస్టు:** అర టీస్పూను, **కారం:** ఒక టీస్పూను, **జీలకర్ర:** అర టీస్పూను, **ఉల్లిపాయ ముక్కలు:** అరకప్పు, **పచ్చిమిర్చి:** ఒకటి, **కొత్తిమీర తురుము:** పావు కప్పు, **కరివేపాకు:** అయిదు రెబ్బలు, **టమాటా సాస్:** రెండు స్పూన్లు, **చిల్లీసాస్:** ఒక టీస్పూను, **నూనె:** సరిపడినంత, **ఉప్పు:** తగినంత

తయారీ విధానం

ముందుగా ఆనపకాయ తురుములో మైదాపిండి, గోధుమపిండి, అల్లం వెల్లుల్లి ముద్ద, జీలకర్ర, కారం వేసి బాగా కలపాలి. మరీ పొడిగా ఉంటే కాస్త నీళ్లు చల్లి చిన్న చిన్న ఉండలుగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద కడాయి పెట్టి నూనె పోసి వేడయ్యాక ఉండల్ని వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. మరో కడాయి స్టవ్ మీద పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడయ్యాక ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. బాగా వేగాక చిల్లీసాస్, టమాటా సాస్, కొత్తిమీర తురుము వేసి కలిపి ఆనపకాయ ఉండలను వేసి ఒక నిమిషం పాటు వేగనివ్వాలి. అంతే ఆనపకాయ మంచూరియా రెడీ.

ప్రీ డయాబెటిస్.. డైట్ ఏంటి?

ఫుడ్ సైన్స్

డయాబెటిస్‌తో పాటు ఇప్పుడు ప్రీ డయాబెటిస్ అన్నది కూడా ఆరోగ్య హెచ్చరికలా డాక్టర్లు చెబుతున్నారు. ఈ దశలో ఉన్న వాళ్లు ఏవైనా ఆహార అలవాట్లు మార్చుకోవడం ద్వారా మధుమేహం రాకుండా పొడిగించుకునే అవకాశం ఉందా. వాళ్లు ఇందుకు ఏం చేయాలో తెలుపగలరు?

• ఓ పాఠకురాలు

డయాబెటిస్‌కు ముందు దశలో మనం బరువు పెరగడాన్ని గమనించవచ్చు. దీంతో శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ వస్తుంది. అస్తవ్యస్తమైన ఆహారపు సమయాలు, అలవాట్లు ఉన్న వాళ్లతో పాటు పీసీఓఎస్ ఉన్నవాళ్లకూ ఈ ఇన్సులిన్ సమస్య వస్తుంది. అలాగే విటమిన్ డి, విటమిన్ బి12 తక్కువగా ఉండటం వల్ల కూడా ఈ ఇబ్బంది తలెత్తుతుంది. ఒకప్పటితో పోలిస్తే ఇప్పటి ఆహార అలవాట్లు, జీవనశైలి చాలా మారింది. ఇప్పుడన్నీ స్మార్ట్. ఎంత కదలకుండా అన్ని పనులూ చక్కబెడితే అంత గొప్ప అనుకుంటున్నాం. కాబట్టి జీవక్రియ దానికి తగ్గట్టే తయారవుతుంది. బరువు పెరిగిపోతున్నాం. మధుమేహం బారిన పడుతున్నాం. అంతేకాదు, ప్రకృతి సహజ ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్ (వాపులు)ను ఇవి తగ్గిస్తాయి. అలాగే ఇన్సులిన్ పనితీరు బాగుండేందుకు తక్కువ మోతాదులోనే అయినా విటమిన్-డి 3 చాలా అవసరం. చీజ్, చేపల్లాంటి వాటిలో ఇది ఉంటుంది. లేదా సప్లిమెంట్‌గానూ తీసుకోవచ్చు. అలాగే ఎండలో సమయం గడపడం చాలా ముఖ్యం. క్యాల్షియం, ఐరన్‌లాంటి సూక్ష్మ పోషకాలు కూడా డయాబెటిస్‌ని వాయిదా వేయడంలో తోడ్పడతాయి. వీటికోసం పాలు, పెరుగు, సీ ఫుడ్, క్యాల్షియం ఫోర్టిఫైడ్ ఆహారాలు తీసుకోవాలి. నువ్వులు, బెల్లంలాంటి వాటిలో ఐరన్ దొరుకుతుంది. మైదా, పంచదారలాంటి ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకోవడం మానేయాలి. పండ్లు, కూరగాయల్లాంటి సహజ ఆహారానికి చోటివ్వాలి. సూర్యరశ్మి పడే సమయంలో కనీసం 45 నిమిషాలు వ్యాయామం చేయాలి. అలాగే ఆకుకూరలు వారానికి మూడు సార్లు తీసుకోవాలి. రాత్రి భోజనం త్వరగా పూర్తి చేయాలి. ఆహారానికి ఆహారానికి మధ్య ఎక్కువ విరామం ఇవ్వకుండా జాగ్రత్తపడాలి. పండ్ల రసాలు ముఖ్యంగా విటమిన్- డి శరీరం శోషించుకునేందుకు నిల్వ ఉంచేందుకు ఉపయోగపడే విటమిన్-సి కలిగిన నారింజ, నిమ్మ, బత్తాయిలాంటి పండ్ల రసాలు, ఇతర పండ్లు తీసుకోవాలి. వీటితో పాటు పీచులు అధికంగా ఉండే చిరుధాన్యాలు, గోధుమల్లాంటివి తినాలి. వాల్‌నట్, బాదం, అవిసెల్లాంటి గింజలు కూడా మేలు చేస్తాయి. ముఖ్యంగా ఆల్కహాల్, సిగరెట్ వదిలేయాలి. మొలకలు, పనీర్, సోయా, టోఫులాంటి ప్రొటీన్ ఉండే పదార్థాలూ ముఖ్యమే.

ఆహారాన్ని నిష్పత్తుల్లో చెప్పాలంటే... 50 శాతం ఉడికించిన లేదా పచ్చి కూరగాయలు లేదా పండ్లు, 25 శాతం కార్బోహైడ్రేట్లు, 25 శాతం ప్రొటీన్ తీసుకోవాలి.


మయూరి ఆవుల
న్యూట్రిషనిస్ట్
Mayuri.trudiet@gmail.com





ఆమె వంటను కేంబ్రిడ్జ్ రుచి చూసింది..

కొన్ని చేతుల్లో అమృతరేఖ ఉంటుంది. వాళ్లు తిరగమోత పెడితే.. వీధంతా గుప్పుమంటుంది. ఆవకాయ కలిపిందని తెలిస్తే.. బంధువర్గమంతా ఇంటి ముందు వాలిపోతుంది. ఈ వంటలక్క అంతకుమించి. వంటావార్పులో ఖండాంతరాలు దాటిన కీర్తి ఆమె సొంతం. స్వదేశీ రుచులు పక్కాగా వండేస్తుంది. విదేశీ వంటకాలనూ చక్కగా వార్చేస్తుంది. తన హస్తవాసితో మాస్టర్ షెఫ్ ఇండియా తొలి కిరీటాన్ని కైవసం చేసుకుంది. ఆమె వంటలకే కాదు.. తయారు చేసే పద్ధతికీ ఎంతో మంది అభిమానులు ఉన్నారు. మీ చేతి వంట మాకు రుచి చూపించరూ... అని న్యూయార్క్‌లోని పెద్ద ఫుడ్ ఫెస్టివల్స్, కేంబ్రిడ్జ్ లాంటి యూనివర్సిటీలు ప్రేమగా ఆమెను ఆహ్వానించాయి. బీబీసీలాంటి ప్రఖ్యాత చానెళ్లు ఆమె వంటలను సిరీస్‌గా చిత్రీకరించాయి. పిల్లల కోసం వంట చేసే దగ్గర నుంచి స్టార్ షెఫ్‌గా మారిన మాస్టర్ షెఫ్ పంకజ్ భదౌరియా జీవన ప్రయాణం తొలుత చాలామంది మహిళల్లాగే ప్రారంభమైంది.

ఇంటికీ ఇంటికీ... చేతికీ చేతికీ వంట రుచి భిన్నంగా ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే వంట వంశపారంపర్యం. వండే విధానం, అందులోని దినుసులు, ఉప్పు, కారం... ఇలా అన్నీ ఎవరికి వాళ్లు తోచినట్టు వేస్తారు. చేస్తారు. ఆ వైవిధ్యమే ఒకే వంటకు విభిన్నమైన రుచుల్ని తెచ్చి పెడుతుంది. కొందరు వండితే అమృతం అంటే ఇలాగే ఉంటుందేమో అనిపిస్తుంది. ఆత్మారాముడు ఆవురావురుమంటున్నప్పుడే కాదు, తిండి ఇంకేమాత్రమూ వద్దని పొట్ట మొండికేసినప్పుడూ... వీళ్లచేతి రుచులు జిహ్వను వహ్వా అనిపిస్తాయి. అలాంటి అమృత హస్తాలు పంకజ్ అమ్మానాన్నలవి. అందులోనూ పంకజ్ తండ్రి వంట తింటే ఆయన పాకశాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారేమో అనిపించేంత అద్భుతంగా ఉండేదట. పంకజ్ తల్లి కూడా ఆయన నుంచే వంట నేర్చుకుని అమోఘంగా వండేవారట. ఇక, ఆమె తండ్రి పంజాబీ, తల్లి బెంగాలీ అవడంతో ఉభయ రాష్ర్టాల రుచులూ ఆస్వాదిస్తూ పెరిగిందామె. తమ ఇంట్లో పార్టీల కోసం చుట్టాల ఎదురుచూపులు బాగా గుర్తు అంటుంది పంకజ్. వంట రుచే కాదు, దాన్ని నోరూరించేలా అలంకరించడమూ వాళ్లకు అలవాటు. అందరూ కడుపు నిండా తిన్నాక ఆ చోటు ఒక మెచ్చుకోళ్ల వేదిక! వంట చేస్తే ఇంత గుర్తింపు వస్తుందా... మనల్ని అందరూ ఇంతలా మెచ్చుకుంటారా... అన్న ఆలోచన చిన్న వయసులోనే పంకజ్‌కు వంటింటిని పరిచయం చేసింది.

చిన్ననాటి నుంచే...

అమ్మానాన్నా ఎలా వండుతున్నారని రెండు మూడు తరగతుల్లో ఉన్నప్పటి నుంచే గమనించేది పంకజ్. వాళ్లకు వంటలో సాయం చేసేది. అలా అచ్చం వాళ్లలాగే వండటమూ నేర్చుకుంది. పదకొండేండ్ల వయసుకే ఆమె సొంతంగా వంట చేసి, కుటుంబ సభ్యులకు వడ్డించేది. అయితే దాన్ని కెరీర్‌గా తీసుకోవచ్చన్న ఆలోచన అప్పటికి తనకు లేదంటుందామె. అందుకే చదువు మీద దృష్టి పెట్టింది. ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేసింది. స్కూల్ టీచర్‌గా కెరీర్‌ను ఎంచుకుంది. పెండ్లి, పిల్లలు వరుసగా జరిగిపోయాయి. అత్తారింటికి వెళ్లాక ఇంటికి వచ్చే అతిథులకు చక్కగా తన చేతి వంట రుచిచూపించేది. దానికి చాలామంది అభిమానులయ్యారు. 2010లో మాస్టర్ షెఫ్ ఇండియా కార్యక్రమం భారత్‌లోని పాకయాజులందరికీ పిలుపునిచ్చింది. పంకజ్ చేతివంట మీద అపారమైన నమ్మకం ఉన్న వాళ్ల పిల్లలు 'నువ్వు పార్టిసిపేట్ చెయ్యి అమ్మా, నీకన్నా బెస్ట్ షెఫ్ ఎవరుంటారు' అని ప్రోత్సహించారు. తొలి రౌండ్‌లో పంకజ్ సొంత ఊరు లక్నోలో ఫేమస్ అయిన గలౌటీ కబాబ్‌కు బెంగాలీ మాడల్ అయిన ఫ్రెంచ్ చికెన్ రౌలాదేను జోడించి ఒక కొత్త వంటకాన్ని తయారుచేసింది. నిజానికి అక్కడ పోటీకి వచ్చిన సగం మంది ఈ కబాబ్‌లే తెచ్చినా, కొత్త కలబోత ఆ వంటల మధ్య పంకజ్‌ను భిన్నంగా నిలబెట్టింది. ఇందులో తన భర్త సలహా, సహకారం ఎంతగానో ఉన్నాయని చెబుతుంది పంకజ్.



టీచర్ కొలువు వదిలి...

మాస్టర్ షెఫ్ కార్యక్రమంలో చివరి దాకా వెళ్లాలంటే ముంబయిలోని ఒక హోటల్లో మూడు నెలలు ఉండాలన్నారు కార్యక్రమ నిర్వాహకులు. అప్పటికి పంకజ్ పదహారేండ్లుగా టీచర్‌గా పనిచేస్తున్నది. దీంతో ఉద్యోగమా, పోటీనా... అన్నది తేల్చుకోవాల్సి వచ్చింది. ధైర్యం చేసి తన మనసున్న పోటీకే ఓటేసింది. ప్రతి రౌండ్‌లోనూ తనదైన రీతిలోని ఫ్యూజన్ వంటల్ని ఎంచుకుంది. కోటి రూపాయల ప్రైజ్‌తో పాటు మాస్టర్ షెఫ్ టైటిల్ వరించింది. దేశంలోనే పేరెన్నికగన్న షెఫ్‌లు ఉన్నారు ఆ పోటీలో. కేవలం ఇంటి వాళ్ల కోసం వంట చేసే మహిళ ఇందులో గెలవడం అన్నది నిజంగా నమ్మలేని విషయమే. మాస్టర్ షెఫ్‌లుగా మగవాళ్ల ఆధిపత్యం కొనసాగే చోట ఆడవాళ్లూ అంతే స్థాయిలో వంట చేసి మెప్పించగలరు అని నిరూపించింది పంకజ్. దేశం మొత్తం మీదే కాదు, ప్రపంచ వ్యాప్తంగానూ ఇది ఆమెకు గుర్తింపు తెచ్చిపెట్టింది. లండన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం 'మీచేతి వంట రుచి చూపించరూ' అంటూ ఆమెను ఆహ్వానించింది. న్యూయార్క్‌లోని వర్లి ఫుడ్ ఫెస్టివల్ నుంచి కూడా పంకజ్ పిలుపు అందుకుంది. అమెరికా, దుబాయ్, ఇజ్రాయెల్, సింగపూర్... ఇలా వేర్వేరు దేశాలకు తన వంటల్ని పరిచయం చేస్తున్నది.

ఆంత్రప్రెన్యూర్‌గా...

మాస్టర్ షెఫ్ టైటిల్ గెలుచుకున్నాక పెద్ద పెద్ద హోటళ్లు ఆమెతో కలిసి పనిచేసేందుకు ఆహ్వానాలు పంపాయి. కానీ అందుకు ఆమె ఇష్టపడలేదు. వంటను ఉద్యోగంగా చేయడం అనే విషయం రుచించలేదు. వంటలో ఎన్ని ప్రయోగాలు చేస్తే అంత మంచి రుచులు అందించగలం. అందుకే ఈ విషయంలో స్వేచ్ఛగా ఉండదలచుకున్నానని చెబుతారామె. అందుకే, లక్నోలోనే సొంతంగా కలినరీ అకాడమీని ఏర్పాటుచేసింది పంకజ్. ఔత్సాహిక యువతకు, నైపుణ్యాలు మరింత మెరుగుపరచుకుని కెరీర్‌లో ఎదగాలనుకునే షెఫ్‌లకూ పాఠాలు చెబుతున్నది. అంతేకాదు, తన వంటలు పదిమందికీ చేరాలన్న ఉద్దేశంతో 'షెఫ్ పంకజ్‌కా జైకా', 'రిక్ స్టెయిన్స్ ఇండియా', 'సేల్స్ కా బాజీగర్', 'కిఫాయతీ కిచెన్', 'త్రీ కోర్స్ విత్ పంకజ్', 'డ్రీమ్ కిచెన్' లాంటి కార్యక్రమాలకు, బీబీసీ, స్టార్‌ప్లస్, జీలాంటి వివిధ చానెళ్ల ద్వారా హోస్ట్‌గా పనిచేసింది. కొత్తకొత్త వంటలు ఎలా చేయవచ్చో చెబుతూ ప్రజలకు చేరువైంది. 'ద సీక్రెట్స్ ఇన్ ద స్పైస్ మిక్స్', 'చికెన్ ఫ్రమ్ మై కిచెన్', 'టాప్ హండ్రెడ్ రెసిపీస్ బై షెఫ్ పంకజ్'... లాంటి పేర్లతో, తనదైన రీతిలో వంటల్ని పరిచయం చేస్తూ ఏడు పుస్తకాలనూ రాసింది. నార్ సూప్, ఈస్టర్న్ మసాలాస్, తాజా టీ, శాంసంగ్ స్మార్ట్ ఓవెన్, కెంట్ జ్యూసర్ అండ్ పాస్తా మేకర్‌లకు సంబంధించిన ప్రకటనలూ చేసింది.

మొత్తానికి ఒకప్పుడు టీచర్ అయిన పంకజ్ ఇప్పుడు సెలెబ్రిటీ షెఫ్. 'వంటను కెరీర్‌గా ఎంచుకోవాలంటే దాని మీద విపరీతమైన ఇష్టం ఉండాలి. అలాంటి వాళ్లనే షెఫ్ కోర్సుల్లో చేరమని సలహా ఇస్తా. ఎందుకంటే మంట ముందు నిలబడి చెమటలు కక్కడం అన్నది గ్లామరస్ ఉద్యోగం కాదు. ఆ మంటలాగే మండే ప్యాషన్ మనలోపల ఉంటేనే ఈ వృత్తిలో రాణించగలం. ఆ కష్టానికి తగిన గుర్తింపు మాత్రం చివర్లో తప్పకుండా ఉంటుంది. ఇదే ఇందులోని గొప్పదనం' అని ఔత్సాహిక విద్యార్థులకు చెబుతుంది పంకజ్. అవును మరి... ఎంత ఇష్టముంటే, స్కూల్లో పాఠాలు చెప్పే స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో షెఫ్‌లకు పాకశాస్త్ర పాఠాలు చెప్పే స్థాయికి ఎదగగలరు... చెప్పండి!

ఉదయం ఆహ్లాదంగా..

ఒకప్పుడు ఉదయం కాగానే పక్షుల కిలకిలారావాలు సుప్రభాతం పలికేవి. వేకువజామునే మలయమారుతం ముంగురులను ముద్దాడేది. కానీ, ఇప్పుడు ప్రతి ఉదయం సెల్‌ఫోన్ చూడటంతోనే మొదలవుతున్నది. ఇంట్లో ఉన్నవాళ్లను పలకరించక ముందే.. స్నేహితులకు సందేశాలు పంపడం రివాజుగా మారింది. అయితే, ఉదయం లేవగానే కొంత సమయాన్ని మనకోసం కేటాయించుకోవడం వల్ల రోజంతా ప్రశాంతంగా ఉంటుందని చెబుతున్నారు నిపుణులు.

కష్టమే అయినా తెల్లవారుజామున లేవడం మంచిది. ముఖ్యంగా వేసవిలో సూర్యోదయానికి ముందు వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. కాస్త పెందరాలే లేచి డాబాపైకి వెళ్లి... ఉదయిస్తున్న సూర్యుణ్ని చూడటం దినచర్యగా చేసుకోండి.

లేవగానే నేర వార్తలు, రాజకీయ వార్తలు వినడం ద్వారా నెగెటివిటీ పెరుగుతుంది. ఆ భారం రోజంతా కొనసాగుతుంది. అలా కావొద్దంటే.. శ్రావ్యమైన సంగీతం వినండి. లేదంటే మీకు నచ్చిన మ్యూజిక్ ఎంజాయ్ చేయండి. నాలుగు మంచి మాటలు వినే ప్రయత్నం చేయండి. సంగీతం ఆసక్తి లేకపోతే.. కండ్లు మూసుకొని మీకు నచ్చిన వ్యక్తిని, మీ జీవితంలో నచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకోండి. ఇది మీలో ఆనందాన్ని, నమ్మకాన్ని పెంచుతుంది.



తేలికపాటి యోగాసనాలు రోజూ చేయడం అలవాటు చేసుకోండి. దీనివల్ల మనసు ఉత్సాహంగా మారుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.


ఉదయం లేవగానే మీ గురించి ఆలోచించుకోవాలి. ఆ రోజు ఏం చేయాలనుకుంటున్నారు, ప్రత్యేకమైన పనులు ఉన్నట్లయితే వాటిని ఏ సమయంలోగా పూర్తిచేయాలి.. ఇలా మనసులో అనుకోండి. దానికి తగ్గట్టుగా వ్యవహరించండి.

ప్రతీ ఉదయం చిక్కటి టీ ఆస్వాదిస్తూ కుటుంబసభ్యులతో నాలుగు మంచి విషయాలు మాట్లాడండి. ఇరుగుపొరుగు, బంధువుల తప్పొప్పుల గురించి కాకుండా.. సరదా కబుర్లు చెప్పుకొనే ప్రయత్నం చేయండి.

గుడ్ డాడీ అనిపించుకోవాలంటే..

పిల్లల పెంపకం కత్తిమీద సామే! తల్లిదండ్రుల మాటతీరు, వ్యవహారశైలి పిల్లలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అమ్మానాన్నలు ఇద్దరూ ఉద్యోగులే అయితే.. ఆ కుటుంబ వాతావరణం కాస్త విచిత్రంగానే ఉంటుంది. అయితే, ఎంత బిజీగా ఉన్నా.. ఇంటికి వచ్చాక తల్లులు పిల్లలతో అధిక సమయం గడుపుతుంటారు. అదే తండ్రుల విషయానికి వచ్చేసరికి పిల్లల కోసం సమయాన్ని చాలా తక్కువ మంది కేటాయిస్తుంటారు. గుడ్ డాడీ అనిపించుకోవాలంటే ఈ టిప్స్ ఫాలో అవ్వండి..

- ఎంత బిజీగా ఉన్నా పిల్లలకు రోజూ సమయం కేటాయించాల్సిందే! వారానికి ఒకసారైనా బిడ్డలను దగ్గర్లోని పార్కుకు తీసుకెళ్లాలి. తీసుకెళ్లాక వారి మానాన వారిని వదిలేయకుండా.. మీరూ వారితో గేమ్స్ ఆడాలి. అప్పుడే పిల్లలతో బాగా కనెక్ట్ అవగలుగుతారు.



- తండ్రి లక్షణాలు పిల్లలకు ఇట్టే వచ్చేస్తుంటాయి. కాబట్టి, తండ్రి తన పాత్ర సమర్థంగా పోషించాలి. వ్యసనాలు, అబద్ధాలాడటం లాంటి లక్షణాలుంటే.. వాటిని మార్చుకోవాలి. చీటికీమాటికీ ఆవేశపడితే అది పిల్లలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని గ్రహించండి.
- ఈతరం పిల్లలు హైపర్ యాక్టివ్‌గా ఉంటున్నారు. వారిని భరించాలంటే ఓపిక చాలా అవసరం. వాళ్లు వేసే ప్రశ్నలకు నిదానంగా సమాధానం చెప్పాలి. వారితో విలువైన సమయం గడపాలి. అంతేకానీ, తీరిక లేదని కసురుకుంటే.. మంచి తండ్రి అనిపించుకోలేరు.